- ఒంగోలు జీజీహెచ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం
- రోగులను ముట్టుకోని మేల్ నర్సులు
- అర్హత లేని వారు ఫ్యాకల్టీగా పెత్తనం
- వైసీపీ అండతో విధులకు అతిథులుగా మారిన వైనం
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ► ప్రభుత్వం మారినా తీరంతే!
- పేదలకు అందని వైద్యసేవలు
- నిబంధనలకు విరుద్ధంగా నర్సులకు డ్యూటీలు
- అందులోనూ చేతివాటం చూపుతున్నట్లు ఆరోపణలు



అంతా మా ఇష్టం



పేదల పెద్దాసుపత్రి అయిన ఒంగోలు జీజీహెచ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులపట్ల కనికరం చూపాల్సిన వారు కాఠిన్యం ప్రదర్శిస్తున్నారు. వివిధ రకాల వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్న వారికి కనీస సేవలు అందించకుండా కాలక్షేపం చేస్తున్నారు. అసలు పనిని వదిలేసి పెత్తనం చేయడానికే పరిమితమవుతున్నారు. ఎంఎన్‌వోలు (పురుష నర్సులు)గా విధుల్లో చేరిన వారు డ్యూటీలు మానేసి ఫ్యాకల్టీలుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తిష్ఠ వేశారు. గత ప్రభుత్వంలో నేరుగా మెడలో వైసీపీ కండువాలు వేసుకొని విధులకు అతిథులుగా మారిన వారు ఇప్పటికీ అదే పంథాను కొనసాగిస్తున్నారు. మరికొందరు ఉద్యోగ సంఘ నాయకులుగా చెలామణి అవుతూ ఎలాంటి బదిలీలు లేకుండా తమ స్థానాలను కాపాడుకొంటున్నారు. అర్హత లేకపోయినా మేల్ నర్సింగ్ ఆపరేటర్ (ఎంఎన్‌వో) నర్సింగ్ విద్యార్థులకు ఫ్యాకల్టీగా కొనసాగడంపై డాక్టర్లు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని ఇతర వైద్యశాలలకు భిన్నంగా ఇక్కడి నర్సింగ్ సూపరింటెండెంట్ సొంత టైంటేబుల్ అమలు చేస్తున్నారు. తనకు పైసలు ఇచ్చిన సిబ్బందికి వారికి ఇష్టమొచ్చిన సమయాల్లో విధులు కేటాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3: ఒంగోలులోని సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)కి జబ్బు చేసింది. ఇక్కడి సిబ్బంది తమ రూటే సపరేటు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ ముఖ్య నేతల ఆశీస్సులతో అంతా మా ఇష్టం అన్నట్లు సాగిన వారు ఇప్పటికీ తీరు మార్చుకోలేదు. సుమారు 60మంది వరకు మేల్ నర్సులు ఉండగా ఒక్కరు కూడా రోగి చేయి పట్టుకోరు. వారికి కట్టుగుడ్డ కట్టరు. వాస్తవానికి మేల్‌నర్సులు కాంపౌడర్‌తో సమానం. రోగులు వస్తే వారికి సేవ చేయాలి. కానీ గత ఐదేళ్లుగా ఇక్కడ ఎంఎన్‌వోలు రాజకీయ పలుకుబడితో కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఫ్యాకల్టీలుగా, అధికారుల వద్ద సీసీలుగా ఎవరికి ఆసక్తి ఉన్నది వారు ఎంచుకుని వైట్‌కాలర్ ఉద్యోగాలకే పరిమితమయ్యారు. దీంతో రోగులను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వారికి పనులు అప్పగించేందుకు జీజీహెచ్ అధికారులు సైతం జంకుతున్నారు. దీంతో పేద రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. నర్సింగ్ విద్యార్థులకు విద్యాబోధన కోసం ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులు. అయితే జీజీహెచ్‌లో మాత్రం బీఎస్సీ నర్సింగ్ చదివి ఎంఎన్‌వోగా ఉద్యోగం పొందిన ఒకరు ఉద్యోగుల సంఘం నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. దాన్ని అడ్డుపెట్టుకొని ఎలాంటి అర్హత లేకపోయినా నర్సింగ్ విద్యార్థులకు బోధకుడిగా వ్యవహరిస్తుండటం విస్తుగొలుపుతోంది.

ఇంకా వైసీపీ ముసుగులోనే పెత్తనం

ఐదేళ్ల వైసీపీ పాలనలో జీజీహెచ్‌లో కొందరు సిబ్బంది అంతా తామై వ్యవహరించి అధికారులపై పెత్తనం చేయడమే కాకుండా, మాజీమంత్రి పీఏ అండదండలతో తాము చెప్పిందే వేదమన్నట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైనప్పటికీ ఆ పార్టీ పేరు చెప్పుకొని ఇన్నాళ్లూ షాడోలుగా వ్యవహరించిన వారి తీరు మారలేదు. ఇదే విషయం ఆసుపత్రి అధికారులు, డాక్టర్ల మధ్య పలు సందర్భాలలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ వారిని వారివారి విధులకు పంపడంలో వెనకడుగు వేస్తున్నారు.

వచ్చామా.. పోయామా..!

వైద్యశాలలో ముఖ్యమైన శస్త్ర చికిత్సలకు డాక్టర్‌ల కొరత తీవ్రంగా ఉంది. సర్జరీ విభాగానికి 70 శాతం మంది రోగులు వస్తుండగా అవసరమైన వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శస్త్ర చికిత్స విభాగానికి సుమారు ఐదుగురు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరముంది. మెడిసిన్ విభాగంలో మరో ముగ్గురు వైద్యుల కొరత వేధిస్తోంది. గుండె జబ్బులు, న్యూరాలజీ, నరాలకు సంబంధించిన వైద్యుల లేకపోవడంతో మరింత దారుణంగా కనిపిస్తోంది. ఇటీవల కాలంలో వైద్యుల బదిలీలు జరగడంతో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల నుంచి పలువురు ఒంగోలు జీజీహెచ్‌కు వచ్చారు. వీరిలో ఎక్కువ మంది వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే విధుల్లో అందుబాటులో ఉంటున్నారు. మిగిలిన రోజుల్లో వైద్యానికి వీరి సేవలు కరువయ్యాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది.

మేడంకి పైసలిస్తే పగలు డ్యూటీ

జీజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ సొంత టైం టేబుల్ అమలు చేస్తున్నారు. తనకు పైసలు ఇచ్చిన నర్సింగ్ సిబ్బందికి వారికి ఇష్టమొచ్చిన సమయాల్లో విధులు కేటాయిస్తున్నట్లు విమర్శలున్నాయి. రాష్ట్రంలోని ఏజిల్లాలో లేనివిధంగా ఒంగోలు జీజీహెచ్‌లో డ్యూటీలు మారుస్తూ భారీగా దండుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 200 మంది వరకూ వైద్యులు, వారికి సహాయకులుగా మేల్ నర్సులు (ఎంఎన్‌వోలు) 60 మంది ఉండగా, మహిళా నర్సులు (ఎఫ్ఎన్‌వోలు) 45 మంది వరకూ పనిచేస్తున్నారు. స్టాఫ్ నర్సులు (కాంట్రాక్టు కలిపి) 400 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. వారికి మూడు షిఫ్టుల్లో విధులు కేటాయించాల్సి ఉంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకూ పనిచేయాలి. వీరిలో స్టాఫ్ నర్సులకు ప్రతి మూడు నెలలకు ఒక నెల మాత్రం నైట్ డ్యూటీ చేయాల్సి ఉంది. అయితే నర్సింగ్ సూపరింటెండెంట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకూ తన సొంత టైంటేబుల్‌ను అమలు చేస్తున్నారు. ఆ సమయాల్లో డ్యూటీలు వేయడం, అందుకోసం వారి వద్ద నుంచి మామూళ్లు తీసుకోవడం పరిపాటైందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



అధికారులు, హాస్టల్ వార్డెన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల

లెక్కలు రావా.. మెనూ తెలియదా..!

- హాస్టల్ నిర్వహణలో పొంతన లేని లెక్కలు
- డీడీ, వార్డెన్ల పనితీరుపై మంత్రి స్వామి మండిపాటు
- ఒంగోలులో సాంఘిక సంక్షేమ వసతి గృహం, బధిరుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3: 'మెనూ సక్రమంగా పాటించడం లేదు. ఉడికీ ఉడకని అన్నం, ఏ పూట ఏమి పెడుతున్నారో తెలియదు. ఒక్కో విద్యార్థికి ఎంత ఖర్చు చేస్తున్నారో చెప్పలేకపోతున్నారు. లెక్కలు తెలియవా? ఒక్కసారైనా హాస్టల్స్‌ను విజిట్ చేశారా?' అంటూ సాంఘిక సంక్షేమ శాఖ డీడీపై ఆశాఖ మంత్రి, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి మండిపడ్డారు. ఆయన బుధవారం నగరంలోని భాగ్యనగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల సంక్షేమ హాస్టల్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండున్నర గంటలపాటు ఉద్యోగుల రిజిస్టర్, విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ, మరుగుదొడ్లు, వంటశాలతోపాటు, వసతి గదులను పరిశీలించారు. అయితే అక్కడ అన్నీ సమస్యలు కనిపించడంతోపాటు, కనీస బాధ్యత లేకుండా వ్యవహరించిన డీడీ లక్ష్మానాయక్, ఇద్దరు మహిళా వార్డెన్లపై మంత్రి మండిపడ్డారు. పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వీడాలన్నారు. ఈ ఐదేళ్లలో తరచుగా వసతి గృహాలు తనిఖీ చేస్తామని, ఏ మాత్రం అలసత్వం ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో భాగంగా వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఆ పార్టీకి చెందిన మంత్రి, ప్రజాప్రతినిధుల పేరుతోపాటు జగన్ బొమ్మ హాస్టల్‌లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారింది.. పాలకులు మారారు.. మీరు మారడం లేదని చురకలంటించారు. ఇదేసమయంలో విద్యార్థులతో మాట్లాడిన మంత్రి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మంచిగా చదువుకోవాలన్నారు. వారంవారం పరిశుభ్రతపై దృష్టిపెట్టాలన్నారు.

బధిర విద్యార్థుల హాస్టల్‌లో కాలింగ్‌బెల్ ఏర్పాటు చేయాలి

అంతకుముందు ప్రభుత్వ బధిరుల పాఠశాలను మంత్రి సందర్శించారు. రిజిస్టర్‌లో ఉద్యోగుల పేర్లు, వారి హోదాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా బధిర విద్యార్థులు మాట్లాలేదని, వినే అవకాశం లేనందున మరుగుదొడ్లు, ఇతర ఏదైనా అసౌకర్యం కలిగినప్పుడు ఉద్యోగుల దృష్టికి తెచ్చేందుకు కాలింగ్ బెల్ విధానం అమలుచేయాలని ఆదేశించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని దివ్యాంగుల సంక్షేమశాఖ డీడీ అర్చనకు ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించడంతోపాటు ఉద్యోగాలకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఉచితంగా అందిస్తామని తెలిపారు.

వసతి గృహం పరిసరాల్లో పారిశుధ్యం మెరుగు: ఎమ్మెల్యే దామచర్ల

బాలికల వసతి గృహ సమీపంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులు సంచరించే అవకాశం ఉందని విద్యార్థినులు ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన వెంటనే నగర కమిషనర్ ఎం.జశ్వంతరావుతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే హాస్టల్ పరిసరాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ హాస్టల్‌పైన అదనపు అంతస్తు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హాస్టల్స్‌లో ఫిర్యాదు బాక్సులు : కలెక్టర్

మంత్రి స్వామి ఆదేశాల మేరకు జిల్లాలోని 81 ప్రభుత్వ వసతి గృహాల్లో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. దీనివలన హాస్టల్స్‌లో సమస్యలు తెలియజేయడంతోపాటు, వారికి అసవరమైన మౌలిక వసతులు, ఫిర్యాదులను విద్యార్థులు తెలిపేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు బహిర్గతం చేయమన్నారు. వాటిని గోప్యంగా ఉంచి, వారానికి ఒకసారి బాక్సులను తెరిచి వారు చేసిన ఫిర్యాదుపై విచారణ చేస్తామని చెప్పారు. తద్వారా ఉద్యోగుల్లో బాధ్యత పెరగడంతోపాటు, హాస్టల్‌లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతితోపాటు మౌలిక సదుపాయాలు సమకూరుతాయన్నారు. ఇకపై జిల్లాలోని అన్ని హాస్టళ్లను తరచూ తనిఖీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.

సొసైటీలకు అధికార పీఐసీలు

- జిల్లాలోని 93 సంఘాలకు నియామకం

ఒంగోలు (విద్య), జూలై 3 : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీల)కు అధికార పర్సన్ ఇన్‌చార్జిల నియామకం పూర్తయ్యింది. 93 సొసైటీలకు అధికార పీఐసీలను నియమిస్తూ ఒంగోలు, మార్కాపురం డివిజన్ల డిప్యూటీ రిజిస్ట్రార్లు పి.రాజశేఖర్, పోలిశెట్టి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని సొసైటీలకు గత ప్రభుత్వం నియమించిన నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల నుంచి రాజీనామాలు స్వీకరించి వారి స్థానంలో అధికార పీఐసీలను నియమించాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు ఈనెల 27న ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు అధికార పర్సన్ ఇన్‌చార్జిలుగా డివిజనల్ సహకార అధికారుల పరిధిలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. వీరి పదవీ కాలం జూన్ 28నుంచి డిసెంబరు 20 వరకూ ఉంటుంది. ఈలోపు సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తే ఇవి రద్దవుతాయి. లేదా ప్రభుత్వం తదుపరి



ఉత్తర్వులు జారీచేసే వరకు మాత్రమే ఈ పీఐసీలు కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో 176 సొసైటీలు ఉండగా వీటిలో 93 విభజిత జిల్లాలో కొనసాగుతున్నాయి. బాపట్ల జిల్లాకు 68, నెల్లూరు జిల్లాకు 15 సొసైటీలు వెళ్లాయి.

రాజీనామాలు చేయని 43 సొసైటీ పాలకవర్గాలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 360 సొసైటీల పాలకవర్గాలు రాజీనామాలు చేయకపోగా అందులో మన జిల్లాలో అత్యధికంగా 43 ఉన్నాయి. వీటిలో ఒంగోలు డివిజన్ పరిధిలో 20 ఉన్నాయి. అందులో బొప్పూడివారిపాలెం, చిమట, చినారికట్ల, కనిగిరి, కరవది, కొత్తపట్నం, లింగంగుంట, ఎం.నిడమానూరు, మాదాలవారిపాలెం, ముండ్లమూరు, ముప్పాళ్లపాడు, నమశ్శివాయపురం, పసుపుగల్లు, పెద్దకొత్తపల్లి, రేగలగడ్డ, శింగన్నపాలెం, శ్రీరామలింగేశ్వర ఉప్పలపాడు, తర్లుబాడు, ఉమామహేశ్వరపురం, వల్లూరు, పడమర వీరాయపాలెం, జరుగుమల్లి సొసైటీలు ఉన్నాయి. వీటికి కూడా అధికార పీఐసీలను నియమించి వెంటనే బాధ్యతలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని ఒంగోలు డీఆర్ పి.రాజశేఖర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో రాజీనామాలు సమర్పించిన 41 సొసైటీలు ఇప్పటికే అధికార పీఐసీల పాలనలోకి వెళ్లాయి. మార్కాపురం డివిజన్‌లో ఉన్న 23 సొసైటీల్లో మూడింటికి ఇప్పటికే అధికార పీఐసీలు ఉన్నాయి. రాజీనామాలు సమర్పించని సొసైటీలకు మార్కాపురం డీఆర్ రాజశేఖర్ అధికార పీఐసీలను నియమించారు. ఇప్పటికే ఉన్న నాన్ అఫిషియల్ పీఐసీలను తొలగించారు.

ఈకేవైసీ దోపిడీ!

- ప్రక్రియ పూర్తిచేయాలంటే పైపు కొనాల్సిందే
- గ్యాస్ ఏజెన్సీల బలవంతపు అమ్మకాలు..!
- కంపెనీ నిబంధనల పేరుతో నిర్వాకం
- రూ.50 విలువ చేసే పైపునకు రూ.150 వసూలు
- వినియోగదారుల ఆగ్రహం



గ్యాస్ కంపెనీలు బలవంతంగా అంటగడుతున్న పైపు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3: ఈకేవైసీని కొన్ని గ్యాస్ ఏజెన్సీలు దోపిడీకి అవకాశంగా మార్చుకున్నాయి. కొన్నిచోట్ల డబ్బులు వసూలు చేస్తుండగా, కొందరు గ్యాస్‌పైపులను అధిక ధరకు అంటగడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మహిళల కోసం సీఎం చంద్రబాబునాయుడు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు ఇచ్చే దిశగా ముందుకు వెళుతున్నారు. అందులోభాగంగా వారంరోజులుగా గ్యాస్ కనెక్షన్ వినియోగదారులు వారికి సంబంధించిన డీలర్ వద్ద ఈకేవైసీ కోసం బారులు తీరుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొందరు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. నిబంధనల ప్రకారం గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు సంబంధిత పుస్తకంతోపాటు, ఆధార్ కార్డును డీలర్ వద్దకు తీసుకెళ్లే ఈకేవైసీ చేయాల్సి ఉంది. అయితే డీలర్లు సొంత నిబంధనలు అమలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి వినియోగదారుడు కచ్చితంగా గ్యాస్ స్టౌవ్‌కు ఉపయోగించే పైపును కొనాల్సిందేనంటూ షరతు విధించారు. అదేమని ప్రశ్నించిన వినియోగదారుడికి ఎప్పుడో గ్యాస్ కనెక్షన్ తీసుకున్నారు. మీ పైపు కాలపరిమితి తీరిపోయిందంటూ పేర్కొనడంతో అవాక్కవుతున్నారు. అయితే గ్యాస్ కనెక్షన్ పొందిన తర్వాత ఒక్కో వినియోగదారుడు తాను ఉపయోగిస్తున్న స్టౌవ్ పైపును కనీసం ఐదారు సార్లు మార్చుకున్నామని చెప్పినా అదేమీ కుదరదు, కంప్యూటర్‌లో చూపిస్తుందంటూ చెప్తుండటం కొసమెరుపు. ఒక్కొక్కరి నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రూ.150 వసూలు చేస్తున్న డీలర్లు

జిల్లాలో 49కి పైగా ఏజెన్సీలు ఉన్నాయి. వాటన్నింటి పరిధిలో సుమారు 6లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నారు. అయితే పేదలకు వంట గ్యాస్ ఆర్థిక భారంగా ఉండకూడదని సీఎం చంద్రబాబు ఒక్కో ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఇప్పుడు అధికారంలోకి రావడంతో అమలుకు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అందులోభాగంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వినియోగదారుడికి ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే ప్రతి వినియోగదారుడు తన ఆధార్ నెంబర్‌తో ఈకేవైసీ చేయించాలని ఏజెన్సీలను ఆదేశించారు. ఇదేఅదునుగా భావించిన ఏజెన్సీలు కొన్నిచోట్ల రూ.50లెక్కన వసూలు చేస్తుండగా మరికొన్నిచోట్ల గ్యాస్ పైపులు అంటగడుతున్నారు. రూ.50 విలువ చేసే పైపును రూ.150కు అమ్ముతున్నారు. ఒక్కో పైపుపై అదనంగా రూ.100 వసూలు చేయడమే కాకుండా అవసరమున్నా, లేకపోయినా కచ్చితంగా పైపు కొంటేనే ఈకేవైసీ చేస్తామని తెలపడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి ఈ తరహా దోపిడీ యథేచ్ఛగా జరుగుతుండగా, కొనకుంటే ఉచిత సిలిండర్ రాదేమోనన్న భయంతో వినియోగదారులు అవసరం లేకున్నా మౌనంగా డబ్బులు చెల్లించి పైపులు తీసుకుంటున్నారు.

సర్వర్ నిలిపివేత

గ్యాస్ కనెక్షన్‌కు ఉచితంగానే ఈకేవైసీ చేయాల్సి ఉండగా, గత వారం, పది రోజుల నుంచి ఏజెన్సీలు వినియోగదారుడి వద్ద నుంచి రూ.150 వసూలు చేస్తున్నాయి. అవసరమున్నా, లేకపోయినా పైపు కొనాల్సిందేనని ఒత్తిడి చేయడంతో విషయాన్ని పలువురు జిల్లా పౌరసరఫరాల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు వినియోగదారుడి వద్ద నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయకూడదని, పైపులైను అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో డీలర్లు బుధవారం నుంచి ఈకేవైసీ చేయడం నిలిపేశారు. సర్వర్ రావడం లేదని, మరో పదిరోజుల వరకూ రాదని తేల్చి చెప్పడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఈకేవైసీ కోసం ఒంగోలులోని ఓ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చిన వినియోగదారులు

ఆలస్యంగా ప్రారంభమైన ఆడిట్

- హెచ్‌ఎంల ఎదురుచూపులు
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం



ఒంగోలులోని ఎస్ఎస్ఏ కార్యాలయానికి ఆడిట్ కోసం హాజరైన హెచ్‌ఎంలు

ఒంగోలు (విద్య), జూలై 3: పాఠశాల గ్రాంటు ఆడిట్ కార్యక్రమం బుధవారం సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఆలస్యంగా ప్రారంభమైంది. ఆడిట్ చేయించుకునేందుకు 60 నుంచి 70 కిలోమీటర్ల దూరం నుంచి ఉదయం 10 గంటలకే సమగ్రశిక్ష కార్యాలయానికి చేరుకున్న హెచ్‌ఎంలు ఆడిటర్ల కోసం గంటకుపైగా ఎదురుచూడాల్సి వచ్చింది. ఆడిటర్లు తాపీగా రావడంతో 11గంటల తర్వాత కార్యక్రమం మొదలైంది. పాఠశాలకు విడుదల కాని నిధులకు ఆడిట్ ఏమిటంటూ బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'సమగ్రశిక్ష.. మజాకా' కథనంపై హెచ్‌ఎంలలో చర్చ నడిచింది. కథనం నేపథ్యంలో ఆడిట్ రద్దు చేసుకున్నారేమోనన్న సందేహం కూడా మొదట వారిలో వ్యక్తమైంది. ఒంగోలు, మద్దిపాడు, చీమకుర్తి, కొండపి, కొత్తపట్నం, ముండ్లమూరు, ఎన్‌జీపాడు, పొన్నలూరు, ఎస్ఎన్‌పాడు, తాళ్లూరు టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లోని 285 పాఠశాలలకు ఆడిట్ నిర్వహించారు. ఇంటర్నల్ ఆడిట్ పేరుతో ఐదుశాతం పాఠశాలలు, స్టాట్యుటరీ ఆడిట్ పేరుతో మొత్తం పాఠశాలల్లో మూడో వంతు ఆడిట్ చేశారు. హెచ్‌ఎంలు ముందుగానే ఎమ్మార్సీల నుంచి ప్రొఫార్మాలు పూరించిన కంప్యూటర్ షీట్లు తేవడంతో వాటిలో ఆడిటర్లు ఒక సెట్ తీసుకొని క్యాష్ పుస్తకంలో వెరిఫైడ్ అని సంతకం చేసి స్టాంప్ వేయడంతో ఆడిట్ పూర్తయినట్లయ్యింది. గంటలసేపు ఎదురుచూసిన ఆడిట్ ఒక నిమిషంలోనే పూర్తికావడంతో హెచ్‌ఎంలు ఊపిరిపీల్చుకొని వెళ్లిపోయారు.

కనిగిరికి కొత్తకళ

- ఆధునికీకరణ పనులకు శ్రీకారం
- తొలివిడతగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు
- తీరనున్న ట్రాఫిక్ సమస్య, రోడ్ల అభివృద్ధికి అవకాశం
- మలి విడతగా కబ్జా అయిన ప్రభుత్వ భూములపై దృష్టి
- పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు, షాపులపై ఎమ్మెల్యే ఉగ్ర దృష్టి
- మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చలు ప్రారంభం

వివరాలు లోపలి పేజీల్లో..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 3: సమగ్ర శిక్షలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా జేఏసీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యేను కలిసిన వారు గత రెండు నెలలుగా సిబ్బందికి వేతనాలు విడుదల కాలేదన్నారు. అలాగే సమ్మె కాలంలో నిలిపివేసిన వేతనం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు డీఎస్సీలో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన దామచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యు.కళ్యాణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, నాయకులు టి.రవికుమార్, రోజర్‌బెన్ని, ఆనంద్, రత్నకుమారి, సుల్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



కలెక్టర్ అన్సారియాను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3: జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న తమీమ్ అన్సారియాను రెడ్‌క్రాస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం రెడ్‌క్రాస్ చైర్మన్ మాంటిస్సోరి ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో కలిసి బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ద్వారా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి రాఘవ, కమిటీ సభ్యులు ప్రసన్నరాజు, మారెళ్ల సుబ్బారావు, శివమ్, శ్రీహరి, కోటేశ్వరమ్మ, అడ్మిన్ సుధాకరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3 : పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భగీరథి సూచించారు. స్థానిక జీజీహెచ్ మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో రెండవ బ్యాచ్‌లో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సుల శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించేందుకు తల నుంచి పాదాల వరకు చేసే పరీక్ష విధానాన్ని వివరించారు. పెరుగుదల లోపాలు, జన్యుపరమైన లోపాలు, వైకల్యాలు, బరువు తక్కువ గల పిల్లలు, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్లకన్ను, గ్రహణమొరి, వంకర పాదాలు, కంటి శుక్లాలు, వినికిడిలోపం, గుండె సంబంధిత వ్యాధులు, పలు రకాల అంటు వ్యాధులు గుర్తించి సత్వరమే చికిత్స అందించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీచందు, వైద్య నిపుణుడు ఆర్‌బీఎస్‌కే తది తరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు రేపు కౌన్సెలింగ్

సింగరాయకొండ, జూలై 3 : సింగరాయకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కొత్తగా ప్రవేశపెట్టిన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఈనెల 5న పాఠశాల ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి ఒక ప్రకటన తెలిపారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్ల చొప్పున రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కేటాయించారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. మెరిట్ లిస్టను అదేరోజు ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా 5వ తరగతి, జూనియర్ ఇంటర్ సీఈసీలలో సీట్లు పొందిన వారు వెంటనే తరగతులకు హాజరుకావాలన్నారు. లేని పక్షంలో ఈ వారాంతంలోపు వారి సీట్లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

మంత్రిని కలిసిన 'మీసేవ' సంఘ ప్రతినిధులు



మంత్రి స్వామికి మొక్కను అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తూర్పునాయుడుపాలెం (టంగుటూరు) జూలై 3 : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని బుధవారం తూర్పునాయుడుపాలెంలోని నివాసంలో మీసేవ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు గత వైసీపీ ప్రభుత్వంలో పడిన బాధలను వివరించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ మీకు మున్ముందు మంచిరోజులు వస్తాయని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త తెలియజేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో మీసేవ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు, మేనేజర్ గంగాధర్‌బాబు, జిల్లా మీసేవ ఆపరేటర్స్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది

సింగరాయకొండ, జూలై 3 : మలేరియా వారోత్సవాల సందర్భంగా సింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం బాలయోగి నగర్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆరోగ్యకేంద్రం వైద్యులు జ్వాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లోని నీటి సంపులు, కుండీలు, టైర్లు, కొబ్బరి బోండాలు, ఇతర ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి భాస్కర్ దోమల వల్ల వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సాంబశివరావు, ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్ అలీ, భారతి, నసీమోన్, సుభాకర్, గంజి సుబ్బారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.362

కొండపి, జూలై 3 : కొండపి వేలం కేంద్రంలో మేలురకం పొగాకు ధర కిలో రూ.362 పలికింది. రైతులు తమకు అనుమతించిన కోటాలో మిగిలినపోయిన పొగాకు బేళ్లను బుధవారం వేలానికి తీసుకువచ్చారు. మొత్తం 1,183 బేళ్లను వేలానికి ఉంచగా 1,085 బేళ్ల వ్యాపారులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

పామూరులో స్థలం కబ్జాను అరికట్టాలి

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 3: పామూరులోని సెయింట్ మార్క్స్ స్కూలు ప్రిన్సిపాల్, పాస్టర్ జోసఫ్, స్కూలు పక్కనే ఉన్న పది సెంట్లు స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, అధికారులు దృష్టి సారించి, కబ్జాను అరికట్టడంతోపాటు అయనపై చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధికార ప్రతినిధి తాళ్ళూరి విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామూరు పట్టణంలోని సర్వే నెం. 205/4.206/4లో ఉన్న తెనాలి అన్నమ్మకు చెందిన పది సెంట్లు స్థలాన్ని ఆక్రమణ చేస్తున్నారని ఆరోపించారు. అడ్డునేందుకు వెళ్ళిన బాధితులపై దౌర్జన్యం చేస్తున్న అయనపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు స్పందించి తగు ఆ క్రమణ అరికట్టాలని ఆయన కోరారు.

నగరంలో నో..పార్కింగ్..!

రోడ్లపైనే అడ్డగోలుగా వాహనాలు నిలిపివేత ● చోద్యం చూస్తున్న యంత్రాంగం ● మచ్చుకైనా కనిపించని నిబంధనలు



వాహనాలతో రద్దీగా ఉన్న నగరంలో కర్నూలురోడ్డు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 3 : ఒంగోలు నగరంలో పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలు పెరగడం లేదు. పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కనీస పార్కింగ్ లేకపోవడం, అంతేగాకుండా గృహ సముదాయాల వద్ద సైతం రోడ్లపైనే వాహన పార్కింగ్‌తో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నగరంలో అధికంగా పలు రహదారులపైనే అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో సమస్య అధికమవుతుంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో పార్కింగ్ కరువైపోతోంది. ఇదిలా ఉండగా అపార్ట్‌మెంట్‌లో అతిథుల వాహనాల పార్కింగ్ సౌకర్యం ఉండగా, అవేమీ లేవంటూ సంబంధిత యజమానులు బుకాయిస్తూ బయటే అడ్డగిస్తున్నారు. ఫలితంగా నగరంలోనూ, పట్టణ ప్రాంతాల్లోను ట్రాఫిక్ సమస్య వేధిస్తూ వాహన ప్రయాణం పరమ చిరాకు పుట్టిస్తుంది. పది నిమిషాల ప్రయాణం కూడా గంటలు పడుతుంది.

వాణిజ్య సంస్థల వద్ద..

వాణిజ్య సంస్థల ముందు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహన పార్కింగ్‌కు స్థలం విడిచిపెట్టాలి. కానీ ప్రస్తుతం జిల్లాలోని పట్టణాల్లో ఆ పరిస్థితి లేదు. ఎవరికి వారే ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించి వాహన దారులకు పార్కింగ్ సౌకర్యం లేకుండా చేస్తున్నారు. దీంతో వాహనదారుడు రోడ్డుపైన తన వాహనాన్ని నిలిపివేయడంతో ట్రాఫిక్ పోలీసుల బారిన పడి జరిమానాలు కట్టాల్సి వస్తుంది. దీంతో నగరంలో ప్రతి చోటా నో పార్కింగ్ అనే బోర్డులు ఉండటంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

అపార్ట్‌మెంట్లలో..

అపార్ట్‌మెంట్లలో అతిథుల వాహనాలకు అవకాశం కల్పించాలి. అయితే సంబంధిత అపార్ట్‌మెంట్ యజమానులు అతిథుల వాహనాలకు అవకాశం లేదని (విజిటర్స్ వేహికల్స్ నాట్ ఎలౌడ్) బోర్డులు పెట్టేస్తున్నారు. అందుకు ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. బిల్టప్ ఏరియాలో పార్కింగ్ ఏర్పాటు చేసిన స్థలంలో అతిథుల వాహనాలకు 10 శాతం స్థలం కేటాయించాలి. అంటే 33 శాతం పార్కింగ్ స్థలంలో విజిటర్స్‌కు 10 శాతం వాటా ఉందన్నమాట. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

సెంట్రల్ పార్కింగ్ ప్రతిపాదన ఏమైనట్లు..

పదేళ్ల క్రితం నగరంలో వాహన పార్కింగ్ కోసం నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు ప్రతిపాదించారు. పెరిగిన వాహనాలతో ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు వాహన పార్కింగ్ కోసం మల్టిపుల్ పార్కింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా అప్పటి కలెక్టర్ నగరంలో పర్యటించి వాహన పార్కింగ్‌కు స్థల పరిశీలన చేశారు. స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్ లేదా, బండ్లమిట్ట నుంచి కొత్త కూరగాయల మార్కెట్‌కు వెళ్ళే మార్గంలో వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు భావించారు. ఆ తర్వాత అధికారులు మారడం, కొత్తవారికి విషయాలపై అవగాహన లేకపోవడంతో పార్కింగ్ సమస్యపై పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు.

1994 ఏడాది బిల్డింగ్స్ నిబంధనలు

- నివాస సముదాయాల్లో రెండుఫ్లాట్లకు ఒకటి చొప్పున కారు పార్కింగ్ వదలాలి.
- వాణిజ్య వ్యాపార సముదాయాల్లో వాహన పార్కింగ్ కోసం 25 శాతం స్థలం విడిచి పెట్టాలి.
- సినిమాటోగ్రఫీ చట్ట ప్రకారం సినిమాహాళ్ళకు హాలులోని కుర్చీల ప్రామాణిక ప్రకారం పార్కింగ్ స్థలం కేటాయించాలి
- ఇండిపెండెంట్ ఇళ్ళకు పార్కింగ్ సౌకర్యం నిబంధనలు వర్తించవు.

2006 బిల్డింగ్స్ రూలు ప్రకారం..

- నివాస సముదాయాలకు పార్కింగ్‌కు 33 శాతం, వాణిజ్య సముదాయాల ముందు పార్కింగ్‌కు 44 శాతం పార్కింగ్ ఉండాలి. అలాగే మాల్స్, మల్టీపెక్స్‌లు, సినిమాహాళ్ళలో పార్కింగ్‌కు 66 శాతం స్థలం కేటాయించాలి.

గెలుపు కోసం పని చేసిన అందరికీ అండగా ఉంటా !

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ● క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



హజరైన కూటమి నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 3: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, సీఎంగా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అన్ని వేళలా అండగా ఉంటానని, ఎవరూ నిరుత్సాహపడవద్దని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. బుధవారం నగరంలోని ఆస్టోనా ఫంక్షన్ హాలులో టీడీపీ, జనసేన, బీజేపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో దామచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుంచి నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి నాయకుల వరకు కష్టపడి పనిచేశారని చెప్పారు. ఒంగోలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజారిటీ వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ప్రతి డివిజన్‌లో సమస్యలు గుర్తించాలని, ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారిస్తానని సూచించారు. అలాగే ఒంగోలు నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఎమ్మెల్యేగా తనపై, అలాగే కూటమి శ్రేణులుగా మీ అందరిపై ఉందని దామచర్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● కలెక్టర్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు సత్వరం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం డ్వామా అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా డ్వామా ఆధ్వర్యంలో వ్యవసాయ-అనుబంధ శాఖల ద్వారా చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు లభిస్తున్న రోజువారీ వేతనం, రాష్ట్ర స్థాయిలో లభిస్తున్న సగటు వేతనం, జిల్లాలో కల్పిస్తున్న పనిదినాల సంఖ్య తదితర అంశాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే జిల్లాలో చేపట్టిన వ్యవసాయ, అనుబంధ పనులను పూర్తి చేసేందుకు గడువును నిర్దేశించుకోవాలన్నారు. అనుమతి లభించినా ఇప్పటికి ప్రారంభించని పనులను సత్వరమే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అనుమతిస్తూ తీర్మానాలు చేసిన పనుల ప్రతిపాదనలను తుది ఆమోదం కోసం తనకు పంపాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ అర్జునరావు, అదనపు పీడీ వండర్‌మెన్, ఉద్యానవనశాఖ అధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, జిల్లా సెరికల్చర్ అధికారి సుజయ్‌కుమార్, ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలు, వాటర్ షెడ్ సీవోలు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం ఇచ్చే సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్యే బీఎన్



విద్యార్థులకు కిట్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూలై 3: విద్యార్థుల్లోని ప్రతిభకు ప్రోత్సాహం ఇచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సంతనూతలపాడులోని జడ్పీహైస్కూల్లో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు విద్యార్థులకు అన్నివిధాలుగా తోడుండి వారిలో ఎక్కువమందిని సాఫ్ట్‌వేర్ రంగం వైపు వెళ్లేవిధంగా చేసి వారికి జీవితంలో భరోసా ఇచ్చిన గొప్ప విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా చదువులో వెనుకపడకూడదని, దేశానికి నేటి విద్యార్థులే రేపటి పునాదులు వంటివారన్నారు. గత 20 ఏళ్ల క్రితం చూసిన చంద్రబాబును ఇప్పుడు అందరం చూడబోతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు అన్ని వర్గాలవారికి, అన్ని రంగాల్లోను సముచితస్థానం దక్కేలా ముఖ్యమంత్రి వద్ద ప్రణాళికలు ఉన్నాయన్నారు. అందువలన విద్యార్థులు తమ దృష్టి అంతా చదువుపై ఉంచితే మీ భవిష్యత్తు ముఖ్యమంత్రి చూసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరెడ్డి, హెచ్‌ఎం ఉమాదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ఐ కేంద్రంలో అవస్థలు

● ఇబ్బందిపడుతున్న రోగులు



ముఖ్యమంత్రి ఐ కేంద్రంలో రద్దీగా ఉన్న రోగులు

కొండపి, జూలై 3 : కొండపి సీహెచ్‌సీలోని ముఖ్యమంత్రి ఐ కేంద్రానికి రోగుల తాకిడి అధికంగా ఉంది. అయితే తగినంత మంది సిబ్బంది లేక వారు ఇబ్బందిపడుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీహెచ్‌సీలో చంద్రన్న ఐకేర్ కేంద్రం పేరుతో కంటి రోగులకు సేవలు అందించే కార్యక్రమం ప్రారంభమైంది. అప్పటి నుంచి అవి కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి ఐకేర్ పేరుతో ఈ కేంద్రం నడిచింది. కొద్దినెలలపాటు ఆగినప్పటికీ అనంతరం పునఃప్రారంభమైంది. ఈ కేంద్రంలో కొండపితోపాటు పరిసరాల్లోని దాదాపు పది మండలాల నుంచి రోగులు సేవలు పొందుతున్నారు. ఇక్కడ కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లకు సిఫారసు చేసి వచ్చాక రోగులకు ఉచితంగా అందజేస్తారు. ప్రతి రోజూ దాదాపు 20 మందికిపైగా ఈ కేంద్రంలో పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ పారామెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంవోఏ) మాత్రమే ఉన్నారు. సహాయకులుగా ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్ (ఈఏ) కూడా ఉండాలి. అయితే ప్రస్తుతం పీఎంవోఏ ఒక్కరే పరీక్షలు నిర్వహించడం, గతంలో పరీక్షలు చేయించుకున్నవారికి కళ్లజోళ్లు ఇవ్వడంతో పాటు ఇతరత్రా సేవలు అందించాల్సి వస్తోంది. ఇది ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రిలో ఈఏను నియమించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

9న ఇంటర్ ఉత్తీర్ణులకు జాబ్‌మేళా

ఒంగోలు(విద్య), జూలై 3: జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 9న ఒంగోలులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో ఇంటర్‌బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో సైమన్‌విక్టర్ బుధవారం తెలిపారు. ఇంటర్‌లో 71శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ విద్యార్థులు జాబ్ మేళాకు హాజరయ్యేందుకు అర్హులన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికే ఈ అవకాశం. ముందుగా విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఎంపిక ప్రక్రియలో మొదట కెరీర్ అప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తనిఖీ నివేదికలు ప్రధాన కార్యాలయానికి..

● సివిల్ సప్లయీస్ మేనేజర్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3: జిల్లాలో ఉన్న పది ప్రభుత్వ నిత్యావసర సరుకుల గోదాములను తూనికలు, కొలతల శాఖ అధికారులతో తనిఖీ చేయించడం జరిగిందని, నివేదికను పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపించినట్లు జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయం నుంచి సూచనలు లేదా ఉత్తర్వులు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన విద్యార్థి జేఏసీ



మంత్రి లోకేష్‌తో జగదీష్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3 : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం అమరావతిలోని మంత్రి చాంబర్‌లో కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సంక్షేమ వసతిగృహాల్లో సన్నబియ్యం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా విశ్వవిద్యాలయం, ట్రిపుల్‌ఐటీ, రామాయపట్నం పోర్టును ప్రకాశం జిల్లాలో కలిపి పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్తీక్, కరుణాకర్, కృష్ణ, సూర్య, సాయి, తేజ, రాము, సురేంద్ర, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపే లక్ష్యంగా పని చేయాలి

● ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

ఒంగోలు(విద్య), జూలై 3: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు తమ విధులు నిర్వర్తించాలని పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి కోరారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల తాను ఒకపాఠశాలను సందర్శించినపుడు అక్కడి హెచ్‌ఎం వద్దే పాఠ్య ప్రణాళిక లేకపోవడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. హడావుడిగా సిలబస్ పూర్తి చేయడం కాకుండా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఏ మేరకు పెరిగాయన్న దృష్టిలో పెట్టుకొని బోధన సాగించాలని సూచించారు. గతం కంటే ఇప్పుడు పరిస్థితులు మారాయని, దానికి అనుగుణంగా మారాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్‌బాబు, ఏఎంవో రమేష్, పరిశీలకులు కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉపాధి శిక్షణ

ఒంగోలు(క్రైం), జూలై 3: ఖైదీలకు గ్రామీణ అభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి తెలిపారు. బుధవారం ఒంగోలులోని జిల్లా జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా రూడ్‌సెట్ ప్రతినిధి పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ స్త్రీ, పురుషులకు స్వయం ఉపాధి కోసం పలు రంగాలలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బాషాజీ, జైలర్ వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

ఒంగోలు(క్రైం), జూలై 3: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంవీ.గోపాలరావు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని యూనియన్ కార్యాలయంలో జిల్లా ప్రాంతీయ సమావేశం సీహెచ్.హరిక్రిష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్‌శాఖలో జరిగిన రిక్రూట్‌మెంట్ లోపభూయిష్టంగా ఉందన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. విద్యుత్‌శాఖలో ఉద్యోగుల సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు తెలియజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎన్.శర్మ, ఆర్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3: విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు 106వ జయంతి వేడుకలను బుధవారం ఒంగోలులోని కాపు సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొప్పోలు శ్రీనివాసరావు, చెన్నంశెట్టి శివ, అద్దెపల్లి మోహన్, మల్లెల చెన్నకేశవులు, చిక్కాల యలమంద, గుర్రం మాల్యాద్రి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, పేస్ రాంబాబు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


షహనాజ్‌కు సమాజసేవలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న షహనాజ్

ఒంగోలు(కల్చరల్), జూలై 3: ఒంగోలుకు చెందిన సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సయ్యద్ షహనాజ్‌కు సమాజ సేవలో గౌరవ డాక్టరేట్ లభించింది. బెంగళూరుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ బుధవారం ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసి అవార్డు కింద రూ.52వేలను బహూకరించింది. ఆమె తన ట్రస్ట్ ద్వారా ఎంతోమంది దివ్యాంగులకు వసతి కల్పించి సేవ చేస్తున్నారు. భర్త షేక్ సర్దార్‌బాషాతో కలిసి విస్తృతంగా నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. షహనాజ్‌కు గౌరవ డాక్టరేట్ లభించటం పట్ల ట్రస్ట్ గౌరవాధ్యక్షులు మండవ మురళీకృష్ణ, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేసిన శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, జూలై 3 : బి.నిడమానూరు గ్రామానికి చెందిన మారెళ్ళ విజయలక్ష్మి చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలను అందజేశారు. టీడీపీ నాయకులు మారెళ్ళ శ్రీనివాసరావు, మారెళ్ళ అంజనేయులు అంబేద్కర్‌కాలనీలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఊదరగుడి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, భీమవరపు శ్రీనివాసరావు, అంకిరెడ్డి, కనపర్తి ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

కనిగిరికి కొత్త కళ!

ఆధునికీకరణ పనులకు శ్రీకారం
తొలివిడతగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు
మలివిడతగా ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగించే అవకాశం
పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు, షాపులపై ఎమ్మెల్యే ఉగ్ర దృష్టి



రోడ్డు వెంబడి ఉన్న బంకులను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నగరపంచాయతీగా మారి తొమ్మిదేళ్లు. డివిజన్ కేంద్రమై కూడా రెండేళ్లు దాటింది. కానీ కనిగిరిలో అభివృద్ధి శూన్యమనే చెప్పుకోవచ్చు. అందుకు ప్రధాన కారణం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటం అందుకు ఆక్రమణలు ప్రతిబంధకంగా మారటం. ఉదయం స్కూల్ బస్సు తిరిగే అవకాశం ఉండదు. సాయంత్రం టూవీలర్‌పై కుటుంబ సభ్యులు షాపింగ్ వెళ్లే అవకాశం అసలే ఉండదు. ఈ నేపథ్యంలో ఐదు మాసాల క్రితం ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఆక్రమణల తొలగింపు ఆరంభమైంది. బుధవారం ఒకేసారి కీలకమైన ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించేశారు. రోడ్లు విశాలంగా మారాయి. అన్నివర్గాల వారు హర్షించారు. కానీ ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. దీంతో వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించే విషయంపై కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దృష్టి సారించారు.

ఆ రోడ్లలో అన్నీ ఇబ్బందులే..

కనిగిరి నగరపంచాయితీలో 20 డివిజన్లు ఉన్నాయి. 50వేలమందికిపైగా జనం నివసిస్తున్నారు. పూర్వకాలంలో చిన్న పల్లెటూరు కావటంతో చిన్నచిన్న రోడ్లు ఉండేవి. క్రమేపీ అన్నీ రకాలుగా ఆ ప్రాంతం విస్తరించింది. గతంలో ఉగ్రనరసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కనిగిరి మున్సిపాలిటీ చేయాలని ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరపంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా కనిగిరిని డివిజన్ కేంద్రంగా మార్పు చేశారు. తదనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు పెరిగాయి. మరోవైపు గ్రామాల నుంచి కనిగిరిలో స్థిరపడే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీంతో స్థానికంగా ఉండేవారితోపాటు వివిధ అవసరాల కోసం కనిగిరి వచ్చిపోయే వారి సంఖ్య పెరిగింది. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి కనిగిరి వెళ్లేందుకు గంట సమయం పడితే, కనిగిరిలో ఒంగోలు బస్టాండ్ ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లేందుకు ముప్పావుగంట పట్టే పరిస్థితి నెలకొంది. ఇక కనిగిరిలోని వీధులన్నీ ఉదయం, సాయంత్రం కిటకటలాడటమే. సాయంత్రం షాపింగ్ వెళితే టూవీలర్ పార్కింగ్‌కు అవకాశం లేదు. పొరపాటున ఎక్కడైనా కూడలి ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవిస్తే సకాలంలో ఫైరింజన్ చేరే పరిస్థితి లేదు. అంబులెన్స్‌కు దారి దొరకని ప్రాంతాలు అనేకం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కనిగిరిలో ఆక్రమణల తొలగింపు, తదనుగుణంగా అభివృద్ధి పనుల ద్వారా సమస్యల నివారణకు ప్రతిపాదనలు రూపొందించారు. ఎన్నికలు కాగానే ప్రతిపాదనల అమలుకు శ్రీకారం పలికారు. బుధవారం యావత్తు యంత్రాంగం రంగంలోకి దిగి శాశ్వత నిర్మాణాల జోలికి వెళ్లకుండా ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తొలగించేశారు. పామూరు రోడ్డు, ఆర్టీసీ డిపో రోడ్డు, చెప్పుల బజారు. ఓవీ రోడ్డులో ఈ ఆక్రమణల తొలగింపు పూర్తయ్యింది. మిగిలిన ప్రాంతాల్లో శుక్రవారం కార్యక్రమం జరగనుంది.

చిరు వ్యాపారుల గగ్గోలు

ఈ ఆక్రమణల తొలగింపు ఎంత అవసరం ఉన్నప్పటికీ తాము ఉపాధి కోల్పోయామంటూ చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలే జీవనాధారంగా ఉండేవారు కొందరైతే వాటిని ఆక్రమించి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకునేవారు మరికొందరు. వారు చిరువ్యాపారులకు తోడై అధికారులు, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిపై తీవ్ర వత్తిడి తెచ్చినట్లు తెలిసింది. అయితే సమస్యను అధిగమించి ముందుకుపోతే ఫలితం ఉంటుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే, అధికారులు ధైర్యంగా ముందడుగు వేశారు ఫలితంగా రోడ్లు విశాలంగా మారుతున్నాయి. కానీ ఉపాధి కోల్పోతున్న చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

అయితే ఇదేసమయంలో చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోకుండా, వృత్తిపరమైన, ఇతర వ్యాపారపరమైన షాపుల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించినట్లు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. ఈ విషయంపై బుధవారం ఆయన అమరావతిలో రోడ్లు, భవనాలు శాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు వారి సిబ్బందితోపాటు కొన్ని శాఖల ఉన్నతాధికారులతో చర్చలు ప్రారంభించారు. అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో ఉండగా రాగానే ఆయన్ను కలిసే ప్రయత్నంలో ఉన్నారు. కనిగిరిలో రోడ్లు భవనాలుశాఖ, అటవీశాఖ, రెవెన్యూశాఖల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఖాళీస్థలాలను వినియోగంలోకి తీసుకొని అక్కడ ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ షాపుల కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. అంతేకాక ఏబీఎం గ్రౌండ్‌లో మిగిలి ఉన్న స్థలంలో కూడా షాపుల ఏర్పాటు ద్వారా వీరికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. అవసరమైతే సీఎం వద్దకు వెళ్లి ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారుల విషయం చర్చించి వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అదేసమయంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణతో మాట్లాడి అభివృద్ధి పనులకు నిధుల రాబట్టే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిపారు.

ఒంగోలు మున్సిపల్ అధికారులపై చర్యలు

• ఉప లోకాయుక్త ఆదేశం

కర్నూలు(లీగల్), జూలై 3: నిబంధనలకు విరుద్ధంగా కొన్ని బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌ను అక్రమంగా ఆమోదించారనే ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకున్నారు. లోకాయుక్త ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలుకు చెందిన ఇద్దరు మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకుంది. ఒంగోలు మున్సిపల్ అధికారులు నిబంధనలను ఖాతరు చేయకుండా అక్రమంగా కొన్ని బిల్డింగ్ ప్లాన్‌లను ఆమోదించారంటూ ఒంగోలు చెందిన ఒక మాజీ సైనిక ఉద్యోగి పత్తిపాటి రామమూర్తి 2016లో రాష్ట్ర ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఉప లోకాయుక్త వెంటనే విచారించి తుది నివేదికను దాఖలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ అధికారులకు గతంలో ఆదేశించింది. దీంతో రాష్ట్ర స్థాయి మున్సిపల్ అధికారులు విచారించి బిల్డింగ్ ప్లాన్‌లను ఆమోదించడంలో బాధ్యులైన విశ్రాంత సీడీపీవో జి.శేషాచారీ, ఇన్‌చార్జి సీపీడీవో ఎం.నారాయణరావులపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ఒక వార్షిక ఇంక్రిమెంటుతో పాటు మూడు సంవత్సరాల పాటు వీరి పెన్షన్‌లో రెండున్నర శాతం కోత విధించింది. అధికారుల చర్యలతో ఫిర్యాదును ముగిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పలువురికి బీఎన్ పరామర్శ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి, జూలై3 : చీమకుర్తి పట్టణంలోని దిన్నేపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పసుపులేటి శివ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. అదేవిధంగా పట్టణంలోని గాంధీనగర్‌లో మృతి చెందిన టీడీపీ నాయకుడు పొన్నగంటి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మండల పరిధిలోని మర్రిపాలెంలో లాయర్ బొడ్డు రామలింగం తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని విజయ్‌కుమార్ నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, కాట్రగడ్డ రమణయ్య, శేషయ్య, పూనాటి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, జనసేన నాయకులు కందుకూరి బాబు, శివప్రసాద్, శ్రీరామ్, బ్రహ్మయ్య, యాసిన్, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, జూలై 3: ప్రతిభ కనపరచిన విద్యార్థులను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కె.హేమలత జూనియర్ ఇంటర్‌లో స్టేట్ 1 ర్యాంక్, పి.బ్లెస్సీజాయ్ ఏపీపీజీసెట్‌లో రాష్ట్రస్థాయిలో 2 ర్యాంక్, ఏపీ ఎంసెట్‌లో గాదం శెట్టి సంకల్ప్ 402 ర్యాంక్ సాధించగా బుధవారం రాత్రి స్థానిక గ్రంథాలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, సభ్యులు అమరా వేణు, పులకణం రాజేష్, గ్రంథపాలకులు ప్రసాద్, తెలగతోటి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఆర్జేడీ

కొత్తపట్నం(ఒంగోలునగరం) జూలై 3: కొత్తపట్నం మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామలింగేశ్వరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులతో ఎక్కువ సేపు మాట్లాడారు. సీబీఎస్‌ఈ సిలబస్‌ను ఉపాధ్యాయులు అర్థం అయ్యేలా చెబుతున్నారా లేదా అనే దిశగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, దుస్తులు, ఇతర విద్యా సామగ్రి అందిందా అని ఆరా తీశారు. మెనూను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులును ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో టి.పద్మావతి, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, ప్రత్యేక అధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

18 బస్తాల రేషన్ బియ్యం సీజ్

నాగులుప్పలపాడు, జూలై 3: అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు.. అమ్మనబ్రోలు గ్రామ శివారులో ఉన్న ఓ పొగాకు బ్యారన్‌లో రేషన్‌బియ్యం ఉన్నాయన్న సమాచారం మేరకు బుధవారం డీటీలు కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి, డేవిడ్, సీహెచ్.కృష్ణమోహన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 18 రేషన్ బియ్యం బస్తాలను గుర్తించిసీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.

విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం



విద్యాసామగ్రి అందజేస్తున్న మక్కెన థామస్

చీమకుర్తి, జూలై3 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తమ వంత సంపూర్ణ సహకారం అందజేస్తామని ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్ తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎంఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు తాము అన్నివిధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా థామస్ తెలిపారు. కార్యక్రమంలో షేక్ సర్దార్, టీడీపీ నాయకుడు గొల్లపూడి వెంకట్రావు, గోపవరపు శ్రీనివాసరావు, ముప్పూరి రంగారావు, భాష్యం శ్రీనివాసరావు, చలవువాది రమేష్, బక్కా రత్నం, హెచ్‌ఎం చాట్ల శ్రీనివాసరావు, శివలీల, శైలజ, సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడుగా ప్రభుదాస్



ప్రభుదాస్‌ను అభినందిస్తున్న సమితి నాయకులు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఒంగోలు నగర అధ్యక్షుడుగా గుంటూరి ప్రభుదాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ప్రభుదాస్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జాతి ఉద్యమ నాయకుడు మంద కృష్ణమాదిగ అడుగుజాడల్లో, ఆయన చేపట్టిన ఉద్యమంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే కృష్ణమాదిగ ఆశయాలకు అనుగుణంగా, వర్గీకరణ సాధనే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. తనను జిల్లా కేంద్రమైన ఒంగోలు నగర అధ్యక్షులుగా నియమించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా భారీ బైక్ ర్యాలీ, మహనీయులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుదాస్‌ను అభినందించారు.

తరగతులకు హాజరుకాని వారి సీట్లు రద్దు

కొండపి, జూలై 3 : కొండపి గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ ద్వారా ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌కు ప్రవేశాలు పొందిన విద్యార్థులు వెంటనే తరగతులకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ అరుణ ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారంలోపు హాజరుకాని వీరి సీట్లు రద్దు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

ట్రాక్టర్, అంబులెన్స్ ఢీకొని ఒకరికి స్వల్ప గాయాలు

• కొత్త ట్రాక్టర్ కొని ఇంటికి తీసుకెళ్తుండగా ప్రమాదం

కనిగిరి, జూలై 3 : రోడ్డులో వెళ్తున్న ముందు ట్రాక్టర్‌ను అంబులెన్స్ ఢీకొట్టిన ఘటన బుధవారం మండల పరిధిలోని పొదిలి రోడ్డులో నందనమారెళ్ల వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలపరిధిలోని ఏరువారిపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి నరసింహారెడ్డి దర్శిలో కొత్త ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి బుధవారం ఉదయాన్నే కనిగిరి బయలుదేరాడు. నందనమారెళ్ల వద్దకు వచ్చే సరికి అదే రోడ్డులో వస్తున్న అంబులెన్స్ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్, అంబులెన్స్‌లు రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి తిరగబడ్డాయి. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ నరసింహారెడ్డికి గాయాలవగా ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ పరారైనట్లు స్థానికులు వెల్లడించారు. ఈ సంఘటనపై కనిగిరి పీఎస్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ త్యాగరాజు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ • ఘనంగా టూవీలర్ మెకానిక్‌ల దినోత్సవం



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల



ఉప్పుగుండూరులో మెకానిక్‌ల వేడుకలు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 3 : కార్మికుల సంక్షేమానికి, వారి ఆర్థిక పురోభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ప్రపంచ టూవీలర్ మెకానిక్‌ల దినోత్సవం బుధవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. టూవీలర్ మెకానికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దామచర్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక మినీస్టేడియం వద్ద నుంచి కర్నూలు రోడ్‌లోని అసోసియేషన్ కార్యాలయం వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెకానిక్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అదేవిధంగా ఆయా కార్పొరేషన్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పించి వారి ఆర్థిక పురోభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా జిల్లాకు విచ్చేసిన సమయంలోనూ మెకానిక్‌లతో ప్రత్యేకంగా మాట్లాడటంతోపాటు, వారి సమ్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం దాయనేని ధర్మ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం, కార్మికుల కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు, అలాగే పిల్లల చదువులకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీ సౌకర్యం కల్పించాలన్నారు. వయసు రిత్యా వృద్ధులైన కార్మికుల కుటుంబం ఆధారం కోసం కార్మిక పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అండగా నిలవాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి సుమారు వెయ్యిమందికి పైగా మెకానిక్‌లు పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కటింగ్‌లతో సంతోషాలు పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చాన్‌బసు, కోశాధికారి షౌకత్, జిల్లా సెక్రటరీ ఉస్మాని, నగర ఉపాధ్యక్షులు మీరా, రాము, బాబు, శివ, మగ్బుల్, దాసరి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: బైక్ మెకానిక్ దినోత్సవాన్ని ఉప్పుగుండూరులో బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను అధ్యక్షులు శివకాంతారావు ఎగురవేశారు. స్వీట్లు పంచారు. ప్రభుత్వం మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అత్తంటి సురేష్, యు.బసవయ్య, షేక్ బాజీ, ఏసు, సుబ్బయ్య, శివ, బి.శ్రీను పాల్గొన్నారు.

నష్టపోయిన ఆక్వా రైతులకు పరిహారం చెల్లించాలి

రొయ్యల రైతుల సంఘం జిల్లా నాయకుల డిమాండ్ • నాసిరకం రొయ్యల సీడ్‌తో నష్టపోయినట్లు ఆవేదన



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి

ఒంగోలు నగరం, జూలై 3: వేసవిలో నాసిరకం మోనోడాన్ టైగర్ రొయ్యలసీడ్‌ను వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఆ సీడ్‌ను సరఫరా చేసిన హేచరీస్ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని జిల్లా రొయ్యల రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపినాథ్ అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపినాథ్, కుంతూరి సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో హేచరీస్ నుంచి సరఫరా అవుతున్న నాసిరకం మోనోడాన్ టైగర్‌సీడ్ వల్ల అనేక మంది రైతులు నష్టపోతున్నారని, హేచరీల నుంచి నాసిరకం సీడ్ సరఫరా కాకుండా అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 27 వేల ఎకరాల్లో రైతులు రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలో రైతులు వెనామీ రకం రొయ్యలను సాగు చేపట్టి గిట్టుబాటు ధర లేకపోవటంతో తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో సుమారుగా 12 వేల ఎకరాల్లో రైతులు మోనోడాన్ బ్లాక్‌టైగర్ అనే రకం రొయ్యల సాగువైపు మొగ్గుచూపారన్నారు. అయితే ప్రస్తుత కాలంలో హే చరీస్ నుంచి రైతులకు సరఫరా చేసిన మోనోడాన్ రకం టైగర్ రొయ్యలు చెరువుల్లో ఎదుగుదల లేక రైతులు తీవ్రంగా నష్టపోయరన్నారు. దీనివల్ల రైతులకు పెట్టుబడులు కూడా రాని విధంగా నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తిరిగి సాగు మొదలు పెట్టే సమయంలో ఏ రకం రొయ్యల సాగు చేపట్టాలో, నాణ్యమైన సీడ్ ఎక్కడ నుంచి తెచ్చుకోవాలో కూడా తెలియని ఆయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కలుగచేసుకుని రైతులకు నాణ్యమైన టైగర్ రొయ్యల సీడ్ హేచరీస్ నుంచి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వెనామీ రకం రొయ్యలకు 100 కౌంట్ రూ.240కి తగ్గకుండా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. రొయ్యల రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లాలోని ప్రజాప్రతినిదులు వద్దకు, అధికారుల వద్దకు రాయబారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు పమిడి సుబ్బానాయుడు, ఉపాధ్యక్షులు ఎస్.అంజిబాబు, నార్నె రమేష్‌బాబు, సహాయ కార్యదర్శులు రమేష్‌రెడ్డి, ఎస్‌కే.సలామ్, మారినేని వెంకటేశ్వర్లు, సతీష్‌బాబు, నరేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

దర్శికి చేరిన ప్యాసింజర్ రైలు



రైల్వే స్టేషన్‌కు చేరిన ప్యాసింజర్ రైలు

దర్శి, జూలై 3 : ట్రయిల్‌రన్‌లో భాగంగా ప్యాసింజర్ రైలు బుధవారం దర్శికి చేరుకుంది. రైల్వేలైను పరిశీలించేందుకు సిబ్బంది కూడా అందులోనే వచ్చారు. నడికుడి నుంచి దర్శి వరకు ప్యాసింజర్ రైళ్లను నడపాలని అధికారులు ఆలోచిస్తున్న విషయం తెలిసిందే. పనులు పూర్తికాక జాప్యం జరుగుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో 'సా..గుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను పనులు' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గత ఏప్రిల్ నుంచి ప్యాసింజర్ రైళ్లు నడుపుతామని గతంలో అధికారులు ప్రకటించిన తీరును కథనంలో వివరించటంతో అధికారులు స్పందించారు. వీలైనంత త్వరలో రైళ్లు నడపాలనే ఉద్దేశంతో ట్రయిల్‌రన్‌లో భాగంగా బుధవారం మరోసారి సిబ్బందితో ప్యాసింజర్ రైలు వచ్చింది. ప్రస్తుతం దర్శి వరకు ఒక లైను మాత్రమే పూర్తయినందున ప్యాసింజర్ రైళ్లు తిరిగే అవకాశం ఉంది. దర్శి నుంచి శ్రీకాళహస్తి వరకు రైల్వేలైను నిర్మాణం మందకొడిగా సాగుతోంది. దర్శి-పొదిలి మధ్యలో నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అక్కడ ఒక రైతు నష్టపరిహారం విషయంలో ఎక్కువ చెల్లించాలని కోర్టుకు వెళ్లటంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం తమ వాటా చెల్లించకపోవటం వలన కూడా ఐదేళ్లు పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ప్రస్తుతం అధికారులు హడావుడి చేస్తున్నారు. ఇప్పటికైనా వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి రైళ్లు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

నాసిరకంగా కంభం రైల్వేస్టేషన్ పనులు

ఆధునికీకరణకు అమృత భారత్ కింద రూ.11 కోట్లు మంజూరు

అధికారుల పర్యవేక్షణ కరువు

వసతులు లేక ప్రయాణికుల అవస్థలు

కంభం, జూలై 3 : కంభం రైల్వేస్టేషన్‌లో నిర్లక్ష్యం ఆలుముకున్నది. అధికారుల పర్యవేక్షణ లోపంతో అభివృద్ధి పనులు సక్రమంగా జరగకపోగా కనీస వసతులు సైతం కానరావడం లేదు. స్టేషన్ పరిస్థితి ఆదాయం బారెడు, సౌకర్యాలు బెత్తడు అన్న చందంగా మారింది. ఇక్కడి నుంచి రోజుకు లక్ష, ఏడాదికి రూ. 3.80 కోట్ల ఆదాయం వస్తున్నా ఆస్థాయిలో వసతులు కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. 6 నెలలక్రితం ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని అన్ని రైల్వేస్టేషన్లు ఆధునికీకరణలో భాగంగా కంభం రైల్వేస్టేషన్‌కు రూ. 11 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో రైల్వేస్టేషన్‌లోని 2 ప్లాట్‌ఫారంలు, అదనపు గదుల నిర్మాణాలు చేపట్టారు. ప్లాట్‌ఫారంపై బండలను పూర్తిగా తొలగించి, మరోవైపు గచ్చును తవ్వి లేపడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫారంపై నిలిచేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నీటి శుద్ధి యంత్రాలు, కూలింగ్ మిషన్లు మూతపడ్డాయి. ఇక్కడికి కనిగిరి, కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి నిత్యం 2వేల మందికి పైగా ప్రయాణికులు వస్తుంటారు. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం వెయిటింగ్ రూమ్‌కు ఎప్పుడూ తాళాలు వేసే ఉంటాయి. దీనితో రాత్రిపూట దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బిక్కుబిక్కు మంటూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. మార్కాపురం, గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లే ఆర్‌పీఎఫ్ పోలీసులను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. చేపట్టిన అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలు ఇచ్చాడు. స్టేషన్ ముందు సిమెంటుతో నిర్మించిన ప్లాట్‌ఫారం, స్టేషన్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. పనులు చేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణమనే విమర్శలు ఉన్నాయి.


నాసిరకంగా జరుగుతున్న పనులు


పనులకు వినియోగిస్తున్న నాసిరకం సిమెంటు, ఇసుక


అసంపూర్తిగా నిలిచిన ఫ్లాట్‌ఫారం పనులు

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఆస్తి కోసమే హత్య
- స్నేహితునితో కలిసి భర్తను చంపించిన భార్య

గిద్దలూరు, జూలై 3 : రాచర్ల మండలం రామాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి చిన్నరంగారెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసమే స్నేహితునితో కలిసి భార్య భర్తను చంపించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రాచర్ల పోలీసుస్టేషన్‌లో మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందర్‌రావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అన్నపురెడ్డి చిన్నరంగారెడ్డి తన మూడో భార్య అయిన రాజేశ్వరితో కలిసి రామాపురంలో నివాసం ఉంటున్నారు. వారిరువురి మధ్య కొంతకాలంగా విభేదాలు, చిన్న చిన్న గొడవలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పొలం రాసి ఇవ్వాలని రాజేశ్వరి కోరుతుండగా చిన్నరంగారెడ్డి నిరాకరించాడు. ఈనేపథ్యంలో భర్తను ఎలాగైనా వదిలించుకోవాలని భావించిన రాజేశ్వరి రంగారెడ్డి స్నేహితుడు ఏసోబుతో కలిసి హత్యకు పథకం రచించిందని పేర్కొన్నారు. శనివారం రాత్రి మద్యం సేవించేందుకు రమ్మని ఏసోబు రంగారెడ్డిని పిలిచాడు. అనంతరం ఎస్సీకాలనీ సమీపంలోని చెట్టుకింద ఇద్దరూ మద్యం సేవించారు. ముందుగా తెచ్చి పెట్టుకున్న గొడ్డలిని చెట్టు వెనుక నుంచి తెచ్చి మద్యం మత్తులో ఉన్న చిన్నరంగారెడ్డిని ఏసోబు తలపై నరకడంతో అతను మృతిచెందాడని పేర్కొన్నారు. ఈమేరకు చిన్నరంగారెడ్డి భార్య రాజేశ్వరిని, ఏసోబును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ బాలసుందర్‌రావు తెలిపారు. హత్య కేసును ఛేదించిన అర్బన్, రూరల్ సీఐలు సోమయ్య, ప్రసాద్, రాచర్ల ఎస్సై సుబ్రమణ్యం, హెడ్ కానిస్టేబుల్ కేశవరెడ్డి, సురేష్‌లను డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధరాదేవి

డ్వాక్రా మహిళలకు స్వయం జీవనోపాధి కల్పించాలి

మార్కాపురం రూరల్, జూలై 3: డ్వాక్రా సంఘాల మహిళలకు స్వయం జీవనోపాధి అవకాశం కల్పించాలని డీఆర్డీఏ సిబ్బందిని కోరారు. స్థానిక ఎస్వీటీసీ కాలనీలో గల డ్వాక్రా బజార్‌లో డీఆర్డీఏ సిబ్బందికి డ్వాక్రా మహిళలకు జీవనోపాదుల కల్పనపై అవగాహన కార్యక్రమం మంగళవారం జిల్లా డీఆర్డీఏ పీడీ వసుంధరాదేవి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులకు చిరు వ్యాపారాలను వారి గ్రామాలలోనే నిర్వహించుకునేందుకు ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ విషయాలను గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళలకు వివరంగా తెలియజేయాలని డీఆర్డీఏ సిబ్బందిని కోరారు. గిద్దలూరు, ఎర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాలలో ఎస్వీఈపీ, మెడ్, ఓఎస్‌ఎఫ్‌లకు కేటాయించిన మండలాలకు ప్రత్యేకంగా జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలకు అవగాహన కల్పించాలని ఎస్వీఈపీ అడిషనల్ డైరెక్టర్ సుధాకర్ కోరారు. స్వయం సహాయక సంఘాలలో మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యూనిట్ల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఎస్ఆర్ఎల్ఎం కింద నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం శేఖర్, లైవ్లీ హుడ్ డీపీఎం డేవిడ్, మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు ఏరియా కోఆర్డినేటర్లు సుధాకర్, లక్ష్మీరెడ్డి, అంబేడ్కర్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీడీవో నాసర్ రెడ్డి

పెద్ద దోర్నాల, జూలై 3: ప్రాణాంతక వ్యాధి డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. అతిసార వ్యాధి నివారణ మాసోత్సవాలలో భాగంగా స్థానిక మెయిన్ పాఠశాలలో డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో నాసర్ రెడ్డి, ఎంఈవో మస్తాన్ నాయక్‌లు మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, వ్యక్తి గత శుభ్రతను పాటిస్తూ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదే విధంగా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, రాత్రి వేళ దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా అనారోగ్యం చేసినప్పుడు వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సాయి భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న సాయి భక్తులు

భక్తుల ఆధ్వర్యంలో సాయి భిక్ష

మార్కాపురం వన్‌టౌన్, జూలై 3: గురుపౌర్ణమి ఉత్సవాలలో భాగంగా నెహ్రూ బజార్ షిరిడీ సాయి మందిర భక్తుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సాయి భిక్ష కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అందరి గృహాల నుంచి 4రోజుల పాటు సాయి భక్తులు భిక్ష స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తారని మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. పట్టణంలోని సుమారు 200 మంది షిరిడీ సాయి బాబా మహిళా సేవా సమాజ్, సాయి భక్తుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మందిరంలో ఆధ్యాత్మికవేత్తలతో వారం రోజుల పాటు సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మందిర కోశాధికారి పీవీఎల్ఎన్‌వీ నాగరాజు, ఉపాధ్యక్షులు రామడుగు గోపి, యువ సేవా సమాజ్ అధ్యక్షుడు కృష్ణ మోహన్, పవన్, కరీమ్, విజయ్, మహిళా సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

అవార్డులతో సత్కారం

గిద్దలూరు, జూలై 3 : ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తమ అధికారులు, ఉత్తమ రైతులను ఈసందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ తరపున ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ బి.ఎస్.నారాయణ సన్మానించి చిత్రపటాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయశాఖ ఏడీ బాలాజీనాయక్ మాట్లాడుతూ రైతులకు రైతులే ఆదర్శంగా నిలువాలని, అధిక పంట పండించి ముందుండాలని కోరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంటలు పండించేందుకు అలవాటు పడాలని, నీటి లభ్యత తక్కువగా ఉంటే డ్రిప్ సౌకర్యం, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారులు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, బీజేపీ నాయకులు భవనాశి రామాంజనేయులు, మట్టిమళ్ళ పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని వైసీపీ నేత అమ్ముకున్నది వాస్తవమే

నిర్ధారించిన రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

తర్లుపాడు, జూలై 3: మండలంలోని కేతగుడిపి పంచాయతీ బుడ్డపల్లెలోని ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకుడు అమ్ముకున్నది వాస్తవమేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. వైసీపీ నాయకుడు ప్రభుత్వ భూమిని అమ్ముకున్నాడు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు వెంటనే విచారణ చేసి నివేదిక అందించాలని తహసీల్దార్ అబ్దుల్ హమీద్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుడ్డపల్లెలో 137-6లోని 1.31సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా గుర్తించి సర్వే నిర్వహించారు. 2017, 19, 21లో తమ్మిశెట్టి ఏడుకొండలు తన సొంత భూమి అని చెప్పి 20 మంది పేదలకు సెంటు రూ.70వేల ప్రకారం అమ్ముకున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వ భూమిలో ఇరగొర్ల రాజేశ్వరి రేకుల షెడ్డు నిర్మించుకోగా.. బొల్లా వెంకటేశ్వర్లు, వేముల తిరుపతమ్మలు రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. బండారు కాశమ్మ, తమ్మిశెట్టి ఆంజనేయులు స్లాబ్ వరకు గదులు నిర్మించుకున్నారు. తురక అంకమ్మ, శేషగిరిరావు, వేమల పెద్ద దస్తగిరిలు ఖాళీ ప్లాట్‌లుగా ఉన్నాయి. బండారు పెద్దఆంజనేయులు బేస్మట్టం వరకు నిర్మాణం చేపట్టారు. బత్తుల ఏడుకొండలు ఇంటి నిర్మాణం కోసం మట్టి తోలినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీరందరి వద్ద కూడా తమ్మిశెట్టి ఏడుకొండలు డబ్బులు తీసుకుని ప్రభుత్వ భూమికి అగ్రిమెంట్‌లు రాసిచ్చినట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూమిని సొంత భూమిగా చెప్పి అమ్మిన వైసీపీ నాయకుడు తమ్మిశెట్టి ఏడుకొండలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు నివేదికను జిల్లా అధికారులకు, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు పంపిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి పరిశీలించిన వారిలో తహసీల్దార్ వెంట మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో రంగయ్య, గ్రామ సర్వేయర్ రవళి ఉన్నారు.


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

వైసీపీ నాయకుల మట్టి దందా

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తరలింపు

ప్రభుత్వం మారినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

తర్లుపాడు, జూలై 3: మండలంలోని మీర్జపేటలో వైసీపీ నాయకుడు యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్ తరలించి సొమ్ముచేసుకుంటున్నాడు. ఈ విషయం సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. బుధవారం మీర్జపేట పంచాయతీలోని కానుమానుపల్లె చెరువులో 3 భారీ జేసీబీలు, 30 ట్రాక్టర్‌ల ద్వారా వైసీపీ నాయకుడు మట్టిని తరలిస్తున్నాడు. ఒక్కో ట్రిప్పు రూ.400 ప్రకారం ఒక కాంట్రాక్టర్‌కు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక కాంట్రాక్టర్ పొలంలో పెద్ద గుంతను పూడ్చేందుకు 5000 ట్రిప్పులను మట్టిని తోలేందుకు వైసీపీ నాయకుడు ఒప్పందం కుదుర్చుకుని అక్రమంగా చెరువులోని మట్టిని తరలిస్తున్నాడు. ఈ విషయాన్ని కొందరు గ్రామస్థులు తహసీల్దార్ అబ్దుల్ హమీద్‌కు, వీఆర్వోకు సమాచారమిచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంతో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఫోన్ ద్వారా కొందరు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఎక్స్‌కవేటర్‌లు, ట్రాక్టర్‌లను సీజ్ చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న కొన్ని ట్రాక్టర్‌లను, ఎక్స్‌కవేటర్లను తహసీల్దార్ అబ్దుల్ హమీద్ సీజ్ చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకుంటారా లేదా వారికి అండగా నిలుస్తారో చూడాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ఐదేళ్ల నుంచి వైసీపీ నాయకుడు చేసిన ఆగడాలను అరికట్టని అధికారులు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వైసీపీ నాయకుల అక్రమాలను ఎందుకు అరికట్టలేకపోతున్నారనంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.


అక్రమంగా మట్టి తోలుతున్న ట్రాక్టర్లు

కనిగిరికి కొత్తకళ / ఆధునికీకరణ పనులకు శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నగరపంచాయతీగా మారి తొమ్మిదేళ్లు, డివిజన్ కేంద్రమై కూడా రెండేళ్లు దాటింది. కానీ కనిగిరిలో అభివృద్ధి శూన్యమనే చెప్పుకోవచ్చు. అందుకు ప్రధాన కారణం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటం అందుకు ఆక్రమణలు ప్రతిబంధకంగా మారటం. ఉదయం స్కూల్ బస్సు తిరిగే అవకాశం ఉండదు. సాయంత్రం టూవీలర్‌పై కుటుంబ సభ్యులు షాపింగ్ వెళ్లే అవకాశం అసలే ఉండదు. ఈ నేపథ్యంలో ఐదు మాసాల క్రితం ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఆక్రమణల తొలగింపు ఆరంభమైంది. బుధవారం ఒకేసారి కీలకమైన ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించేశారు. రోడ్లు విశాలంగా మారాయి. అన్నివర్గాల వారు హర్షించారు. కానీ ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. దీంతో వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించే విషయంపై కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దృష్టిసారించారు.

ఆ రోడ్లలో అన్నీ ఇబ్బందులే..

కనిగిరి నగరపంచాయితీలో 20 డివిజన్లు ఉన్నాయి. 50వేలమందికిపైగా జనం నివసిస్తున్నారు. పూర్వకాలంలో చిన్న పల్లెటూరు కావటంతో చిన్నచిన్న రోడ్లు ఉండేవి. క్రమేపీ అన్నీ రకాలుగా ఆ ప్రాంతం విస్తరించింది. గతంలో ఉగ్రనరసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కనిగిరి మున్సిపాలిటీ చేయాలని ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరపంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా కనిగిరిని డివిజన్ కేంద్రంగా మార్పు చేశారు. తదనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు పెరిగాయి. మరోవైపు గ్రామాల నుంచి కనిగిరిలో స్థిరపడే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీంతో స్థానికంగా ఉండేవారితోపాటు వివిధ అవసరాల కోసం కనిగిరి వచ్చిపోయే వారి సంఖ్య పెరిగింది. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి కనిగిరి వెళ్లేందుకు గంట సమయం పడితే, కనిగిరిలో ఒంగోలు బస్టాండ్ ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లేందుకు ముప్పావుగంట పట్టే పరిస్థితి నెలకొంది. ఇక కనిగిరిలోని వీధులన్నీ ఉదయం, సాయంత్రం కిటకటలాడటమే. సాయంత్రం షాపింగ్ వెళితే టూవీలర్ పార్కింగ్‌కు అవకాశం లేదు. పొరపాటున ఎక్కడైనా కూడలి ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవిస్తే సకాలంలో ఫైరింజన్ చేరే పరిస్థితి లేదు. అంబులెన్స్‌కు దారి దొరకని ప్రాంతాలు అనేకం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కనిగిరిలో ఆక్రమణల తొలగింపు, తదనుగుణంగా అభివృద్ధి పనుల ద్వారా సమస్యల నివారణకు ప్రతిపాదనలు రూపొందించారు. ఎన్నికలు కాగానే ప్రతిపాదనల అమలుకు శ్రీకారం పలికారు. బుధవారం యావత్తు యంత్రాంగం రంగంలోకి దిగి శాశ్విత నిర్మాణాల జోలికి వెళ్లకుండా ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తొలగించేశారు. పామూరు రోడ్డు, ఆర్టీసీ డిపో రోడ్డు, చెప్పుల బజారు. ఒవీ రోడ్డులో ఈ ఆక్రమణల తొలగింపు పూర్తయ్యింది. మిగిలిన ప్రాంతాల్లో శుక్రవారం కార్యక్రమం జరగనుంది.

చిరు వ్యాపారుల గగ్గోలు

ఈ ఆక్రమణల తొలగింపు ఎంత అవసరం ఉన్నప్పటికీ తాము ఉపాధి కోల్పోయామంటూ చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలే జీవనాధారంగా ఉండేవారు కొందరైతే వాటిని ఆక్రమించి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకునేవారు మరికొందరు. వారు చిరువ్యాపారులకు తోడై అధికారులు, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిపై తీవ్ర వత్తిడి తెచ్చినట్లు తెలిసింది. అయితే సమస్యను అధిగమించి ముందుకుపోతే ఫలితం ఉంటుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే, అధికారులు ధైర్యంగా ముందడుగు వేశారు ఫలితంగా రోడ్లు విశాలంగా మారుతున్నాయి. కానీ ఉపాధి కోల్పోతున్న చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

అయితే ఇదేసమయంలో చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోకుండా, వృత్తిపరమైన, ఇతర వ్యాపారపరమైన షాపుల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించినట్లు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. ఈ విషయంపై బుధవారం ఆయన అమరావతిలో రోడ్లు, భవనాలు శాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు వారి సిబ్బందితోపాటు కొన్ని శాఖల ఉన్నతాధికారులతో చర్చలు ప్రారంభించారు. అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో ఉండగా రాగానే ఆయన్ను కలిసే ప్రయత్నంలో ఉన్నారు. కనిగిరిలో రోడ్లు భవనాలుశాఖ, అటవీశాఖ, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఖాళీస్థలాలను వినియోగంలోకి తీసుకొని అక్కడ ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ షాపుల కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. అంతేకాక ఏబీఎం గ్రౌండ్‌లో మిగిలి ఉన్న స్థలంలో కూడా షాపుల ఏర్పాటు ద్వారా వీరికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. అవసరమైతే సీఎం వద్దకు వెళ్లి ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారుల విషయం చర్చించి వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అదేసమయంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణతో మాట్లాడి అభివృద్ధి పనులకు నిధుల రాబట్టే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

- మోటారు బైక్ బోల్తా
- వ్యక్తి మృతి
- మరొకరికి గాయాలు

పెద్దదోర్నాల, జూన్ 3 : వేగం అదుపు చేయలేక మోటారు బోల్తా పడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చట్టుతాండా సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో దర్శి మండలం బొట్లపాలెంకు చెందిన పోలెంరెడ్డి సురేష్‌రెడ్డి(50) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన బండారు ఆంజనేయులుకు గాయాలయ్యాయి. ఎస్సై అంకమరావు తెలిపిన కథనం ప్రకారం సురేష్‌రెడ్డి, ఆంజనేయులు మోటారుబైక్‌పై శ్రీశైలం వెళ్తుండగా చట్టుతాండా వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి వేగం అదుపు కాక కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో సురేష్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులు స్వల్ప తప్పాడు. ఈ ఘటనను గమనించిన ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో క్షతగాత్రుడు అంజనేయులుని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్సలు నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసు స్టేషనుకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమరావు తెలిపారు.


ప్రమాదంలో మృతి చెందిన సురేష్ రెడ్డి, తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు

కారు బోల్తా, దగ్ధం

- డ్రైవరుకు తీవ్రగాయాలు

త్రిపురాంతకం, జూలై 3: వేగంగా వెళుతున్న కారు బోల్తాపడింది. ఆపై మంటలు చెలరేగి కాలిపోయిన సంఘటన మండలంలోని రాజుపాలెం సమీపంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద బుధవారం జరిగింది. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన డి.సైదులు మండలంలోని వెల్లంపల్లిలో ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి మాచర్లకు కారులో బయలుదేరారు. వేగంగా వస్తున్న కారు రాజుపాలెం వద్దకు రాగానే అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో డ్రైవరు సైదులు కారులో నుంచి బయట పడ్డాడు. రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అనంతరం కారు పూర్తిగా కాలిపోయింది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.


మంటల్లో కాలిపోతున్న కారు

రూ.2 లక్షల బంగారు ఆభరణాలు అపహరణ

కంభం, జూలై 3 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగలు బీరువాలో దాచిన 2లక్షల విలువ చేసే బంగారు వస్తువులను అపహరించికుపోయారు. ఎస్సై పులి రాజేష్ వివరాల మేరకు కంభం అర్బన్ కాలనీలో నివసిస్తున్న షేక్ మహమ్మద్‌రఫి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి అత్తగారికి ఇంటికి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉండడంతో అవాక్కయ్యారు. ఇంట్లోకి వెళ్ళి చూడగా దొంగలు బీరువాలో దాచి ఉంచిన ఉంగరం, చిన్నపిల్లల ఉంగరాలు, వెండి కాళ్ళ పట్టి అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఆమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

పొదిలి, జూలై 3 : పట్టణంలోని ఇస్లాంపేటలో మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. పాశం శ్రీనివాసులు అనే చిరువ్యాపారి తన ఇంటివద్ద వాహనాన్ని ఉంచి లోపల నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు వాహనాన్ని తీసుకెళ్ళినట్లు యజమాని శ్రీనివాసులు తెలిపారు. ఉదయాన్నే నిద్రలేచిన తరువాత చూడగా పెట్టినచోట వాహనం కనిపించలేదు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వారంరోజుల క్రితం అదే కాలనీలో మరోవాహనాన్ని కూడా దొంగిలించారని కాలనీవాసులు తెలిపారు. అయితే అప్పుడు సీసీ కెమెరాల్లో దొంగిలించిన దృశ్యాలు నమోదైనట్లు బాధితులు తెలిపారు.

కంభం విద్యుత్ డీఈఈగా షియానాయక్


డీఈఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న షియానాయక్

కంభం, జూలై 3 : కంభం విద్యుత్ సబ్‌డివిజన్ డీఈఈగా ఎస్.షియానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కంభం డీఈఈగా పని చేస్తున్న బాలంకయ్య జూన్ 30న ఉద్యోగ విరమణ చేయడంతో మార్కాపురం విద్యుత్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న షియానాయక్‌కు కంభం డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 3: స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, ధర్మపత్రి పద్మప్రియలు బుధవారం అమ్మవారి ఆలయంలో వారాహి, రాజ్యశ్యామల అమ్మవార్ల పంచలోహ విగ్రహాలను సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వరుణ్‌తేజ శర్మ విగ్రహాలకు ప్రత్యేక పూజ, సంప్రోక్షణ నిర్వహించారు.


విగ్రహాలను అందజేస్తున్న రామిరెడ్డి దంపతులు

నూతన కార్యవర్గం

గిద్దలూరు, జూలై 3 : గిద్దలూరు నియోజకవర్గ బ్రాహ్మణ సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో జరిగిన బ్రాహ్మణ సమావేశంలో గౌరవాధ్యక్షులుగా ఎ.రామక్రిష్ణశర్మ, అధ్యక్షులుగా వి.విజయనరసింహ శర్మ, ఉపాధ్యక్షులుగా ఎస్.శివశంకరశర్మ, ఎ.వెంకట రంగాచార్యులు, సంచాలకులుగా యద్దనపూడి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దుర్భాక సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.సత్యనారాయణ, ఎస్.శశికుమార్, జి.శ్రీధరశర్మ, డి.పవన్, పి.హరిక్రిష్ణ, పి.కౌండిన్య, కోశాధికారిగా పి.శ్రీరామచంద్రశర్మ, పలువురు కార్యవర్గ సభ్యులతో నియోజకవర్గ బ్రాహ్మణ సమన్వయ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి

పెద్దారవీడు, జూలై 3: బడి ఈడు పిల్లలు తప్పక పాఠశాలలో చేరాలని ఎంఈవో పి.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయడు జి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వేణు, కృష్ణారెడ్డి, ప్రసాద్, సునీత, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.


ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అతిసారపై అవగాహన

పొదిలి, జూలై 3 : అతిసారా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ శరత్‌చంద్ర తెలిపారు. బుధవారం స్థానిక శివాలయం వెనుక బజారులో ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్ద అతిసార వ్యాధిపై తల్లిదండ్రులు, పిల్లలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి 5సంవత్సరాలలోపు పిల్లలు అతిసార బారిన పడే అవకాశం ఉందని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం విజయ, అంగన్వాడీ కార్యకర్త నాగమణి, సూపర్‌వైజర్ కె. మెరీనా, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, రాణి ఉన్నారు.

దర్శికి చేరిన ప్యాసింజర్ రైలు


దర్శికి చేరిన ప్యాసింజర్ రైలు

దర్శి, జూలై 3 : ట్రయిల్‌రన్‌లో భాగంగా ప్యాసింజర్ రైలు బుధవారం దర్శికి చేరుకుంది. రైల్వేలైను పరిశీలించేందుకు సిబ్బంది కూడా అందులోనే వచ్చారు. నడికుడి నుంచి దర్శి వరకు ప్యాసింజర్ రైళ్లను నడపాలని అధికారులు ఆలోచిస్తున్న విషయం తెలిసిందే. పనులు పూర్తికాక జాప్యం జరుగుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో 'సా..గుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను పనులు' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గత ఏప్రిల్ నుంచి ప్యాసింజర్ రైళ్లు నడుపుతామని గతంలో అధికారులు ప్రకటించిన తీరును కథనంలో వివరించటంతో అధికారులు స్పందించారు. వీలైనంత త్వరలో రైళ్లు నడపాలనే ఉద్దేశంతో ట్రయిల్‌రన్‌లో భాగంగా బుధవారం మరోసారి సిబ్బందితో ప్యాసింజర్ రైలు వచ్చింది. ప్రస్తుతం దర్శి వరకు ఒక లైను మాత్రమే పూర్తయినందున ప్యాసింజర్ రైళ్లు తిరిగే అవకాశం ఉంది. దర్శి నుంచి శ్రీకాళహస్తి వరకు రైల్వేలైను నిర్మాణం మందకొడిగా సాగుతోంది. దర్శి-పొదిలి మధ్యలో నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అక్కడ ఒక రైతు నష్ట పరిహారం విషయంలో ఎక్కువ చెల్లించాలని కోర్టుకు వెళ్లటంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం తమ వాట చెల్లించకపోవటం వలన కూడా ఐదేళ్లు పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ప్రస్తుతం అధికారులు హడావుడి చేస్తున్నారు. ఇప్పటికైనా వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి రైళ్లు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

పామూరు జూలై 3 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన ఇంటి భోజనం వల్లే నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి చెప్పారు. కేజీబీవీ పాఠశాలను బుధవారం పరిశీలించారు. వంట వండే ఏజెన్సీలకు శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ప్రభుత్వం పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, విద్యార్థులందరూ నూటికి నూరుశాతం పాఠశాలల్లోనే భోజనం చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కనిగిరిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ప్రత్యేక పోలీసు బలగాలతో బంకులను తొలగించిన మున్సిపల్ అధికారులు


రోడ్డు వెంబడి ఉన్న బంకులను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్


రేకులను తీసుకెళ్తున్న దృశ్యం

కనిగిరి, జూలై 3 : కనిగిరిలో పట్టణంలో బుధవారం వేకువజామున మున్సిపల్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. చెప్పులబజారు, ఒంగోలు బస్టాండు, పామూరు బస్టాండు సెంటర్లలో రోడ్డు వెంట ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులకు సంబంధించిన బంకులను తొలగించారు. ఈ క్రమంలో బంకుల నిర్వాహకులకు, అధికారులకు స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. కనిగిరిలో దాదాపు 45ఏళ్లకు పైగా ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు కొంత సమయం ఇస్తే స్వచ్ఛందంగా బంకులను తీసివేస్తామని ఆర్డీవో, డీఎస్పీ, కమిషనర్‌లను వారు వేడుకున్నారు. బంకులను అర్థంతరంగా తీసివేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వేడుకున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్న ఫళంగా బంకులను ఎలా తొలగిస్తారని బంకుల నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో అధికారులను వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కనిగిరి డివిజన్‌గా రూపాంతరం చెందిందని ఆ మేరకు నగరాభివృద్ధిలో భాగంగా మున్సిపాల్టీని సుందరీకరణ చేపట్టాల్సి ఉందని అధికారులు చెప్పారు. వారం రోజులుగా బంకులను తొలగింపు చర్యలు చేపట్టబోతున్నామని చెబుతున్నా చలనం లేకుండా వ్యవహరించటం ఎంత వరకు సబబు అని అధికారులు ప్రశ్నించారు. దాదాపు 200కు పైగా బంకులను ఎక్స్‌కవేటర్‌లతో తొలగించగా, కొంతమంది స్వచ్ఛందంగా వారి బంకులను తొలగించారు. బంకులను తొలగించటంతో పాటు కందుకూరు రోడ్డులోని శంఖవరం వరకు రోడ్డు వెంబడి ఉన్న కొట్ల ముందు రేకులను కూడా తీసివేయించారు. అదేవిధంగా పామూరు రోడ్డులోని ఎమ్మెస్సార్ విగ్రహం వరకు రోడ్డు వెంబడి ఉన్న బంకులు, బంకుల ముందు, ఇళ్ల ముందు ఉన్న రేకులను తొలగించారు. ఈ ప్రక్రియ పూర్తిగా తొలగింపు చేసేవరకూ కొనసాగుతుందని అధికారులు ప్రత్యేకంగా మైకు ద్వారా ప్రచారం చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించటంతో రోడ్లు విస్తారంగా దర్శనమిస్తున్నాయి.


చెప్పుల బజారులో తొలగించిన బంకుల రేకులను తప్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

ఎంఈవో సాంబశివరావు


నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు అందిస్తున్న ఎంఈవో సాంబశివరావు

దొనకొండ, జూలై 3 : గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈవో సాంబశివరావు చెప్పారు. మండలంలోని పడమర వెంకటాపురం, వీపీ అగ్రహారం పాఠశాలలకు చెందిన దాదాపు వందమంది విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన అయితా సుబ్బరత్నమ్మ కుమారులు లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ, సుబ్బారావులు సమకూర్చిన పలకలు, పెన్నులు, నోట్‌బుక్స్ పెన్సిల్స్‌ను ఎంఈవో అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఏటా విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు బాధ్యతగా సహకరించటం ఎంతో అభినందనీయమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని దాతలు స్పందిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు సమకూరతాయని చెప్పారు. ఈ సందర్భంగా దాత సుబ్బరత్నమ్మను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటరెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు తోటా వెంకటేశ్వర్లు, విప్పర్ల సుబ్బయ్య పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ నేత ఎఫ్రాయిమ్‌కు మాతృవియోగం


నివాళి అర్పిస్తున్న ఎంపీపీ తాటికొండ

తాళ్లూరు, జూలై 3 : తాళ్లూరు మండల టీడీపీ ఎస్సీ సెల్ నేత అనపర్తి ఎఫ్రాయిమ్ తల్లి టీడీపీ సీనియర్ కార్యకర్త అనపర్తి యమేల్‌యమ్మ(80) అనారోగ్యంతో శివరాంపురంలో ఇంటివద్ద బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి శాగం కొండారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, నేతలు జి.లక్ష్మీనారాయణ, ఎం. తిరుపతిస్వామి, మన్నేపల్లి నమర, పేరిరెడ్డి, పాలెపోగు రాజు, పురుషోత్తంలు సందర్శించి నివాళులు అర్పించారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు


గుంటూరులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 3 : శాశ్వతంగా మంచినీటి సమస్యను పరిష్కరించటమే లక్ష్యం దిశగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం గుంటూరులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కనిగిరిలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. అందుకు తగిన ప్రణాళికతో పాటు ప్రస్తుతం నీటి వనరులు, ప్రత్యేక పైపులైను ద్వారా నీటి సరఫరా అంశాలతో అధికారులతో సమీక్షించారు. అందుకు అవసరమయ్యే నిధులు, వాటి వినియోగంతో పాటు శాశ్వతంగా మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కావాల్సిన వనరులపై అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. త్వరలో కనిగిరికి మంచినీటి సమస్య తీరనుంది. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విశ్వనాథరెడ్డి, డీఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

జగన్‌పై భక్తిని చాటుకున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నేతల ఫిర్యాదు


ఏవోకి వినతిపత్రం అందజేస్తున్న శివరాంపురం టీడీపీ నేతలు

తాళ్లూరు, జూలై 3 : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా జగన్‌పై భక్తిని చాటుకుంటున్న శివరాంపురం గ్రామసచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ టీడీపీ నాయకులు ముప్పనేని తిరుపతిస్వామి, నారిపెద్ది కళ్యాణ్‌చక్రవర్తిలు ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వజ్జా శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచి పంపిణీ చేస్తుండగా శివరాంపురంలోని సచివాలయ సిబ్బంది ముగ్గురు మాజీ సీఎం జగన్ డిపాజిట్ చేసిన డబ్బులనే ప్రస్తుతం పంచుతున్నారంటూ అసత్య ప్రచారం చేశారన్నారు. మాజీ సీఎం జగన్‌పై తమ భక్తిని చాటుకుంటూ పెన్షన్ల పంపిణీ రోజు టీడీపీ నాయకులను పిలవకుండా తమ ఇష్టానుసారం పెన్షన్లు పంపిణీ చేయడమే గాక సీఎం చంద్రబాబు సచివాలయ ఉద్యోగులను వలంటీర్లుగా వాడుకుంటున్నారని పెన్షన్‌దారులకు చెప్పటం ఎంతవరకు న్యాయమని తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వంపై ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులుగా ఉండి అసత్య ప్రచారం చేసిన కె.చంద్రశేఖర్‌రెడ్డి(విలేజ్ సర్వేయర్), ఎం రాజశేఖర్‌రెడ్డి(వీఏఏ), ఎస్.పార్వతి(మహిళాపోలీసు)లు ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాక్టర్, అంబులెన్స్ ఢీకొని ఒకరికి స్వల్ప గాయాలు

కొత్త ట్రాక్టర్ కొని ఇంటికి తీసుకెళ్తుండగా ప్రమాదం


రోడ్డు పక్కన బోల్తా కొట్టిన అంబులెన్స్

కనిగిరి, జూలై 3 : రోడ్డులో వెళ్తున్న ముందు ట్రాక్టర్‌ను అంబులెన్స్ ఢీకొట్టిన ఘటన బుధవారం మండల పరిధిలోని పొదిలి రోడ్డులో నందనమారెళ్ల వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలపరిధిలోని ఏరువారిపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి నరసింహారెడ్డి దర్శిలో కొత్త ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి బుధవారం ఉదయాన్నే కనిగిరి బయలుదేరాడు. నందనమారెళ్ల వద్దకు వచ్చే సరికి అదేరోడ్డులో వస్తున్న అంబులెన్స్ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్, అంబులెన్స్‌లు రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి తిరగబడ్డాయి. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ నరసింహారెడ్డికి గాయాలవగా ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ పరారైనట్లు స్థానికులు వెల్లడించారు. ఈ సంఘటనపై కనిగిరి పీఎస్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ త్యాగరాజు తెలిపారు.

అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణ


మాట్లాడుతున్న జిల్లా సబ్ యూనిట్ అధికారి కృష్ణ

దొనకొండ, జూలై 3 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఉన్నాయని, గ్రామాల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వసంతరావునాయక్ అధ్యక్షతన బుధవారం అతిసార వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు రక్షిత మంచినీరు సరఫరా చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సునీత మాట్లాడుతూ భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని, ఆరోగ్యకేంద్రంలో ఉచితంగా అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, అన్ని గ్రామాలకు చెందిన పంచాయితీ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతిదేవి, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే దామచర్ల
- ఘనంగా టూవీలర్ మెకానిక్‌ల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 3 : కార్మికుల సంక్షేమానికి, వారి ఆర్థిక పురోభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జనార్దన్ పేర్కొన్నారు. ప్రపంచ టూవీలర్ మెకానిక్‌ల దినోత్సవం బుధవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. టూవీలర్ మెకానికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దామచర్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక మినీస్టేడియం నుంచి కర్నూలు రోడ్‌లోని అసోసియేషన్ కార్యాలయం వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెకానిక్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఆయా కార్పొరేషన్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పించి వారి ఆర్థిక పురోభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా జిల్లాకు విచ్చేసిన సమయంలోనూ మెకానిక్‌లతో ప్రత్యేకంగా మాట్లాడటంతోపాటు, వారి సమ్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం దాయనేని ధర్మ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం, కార్మికుల కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు, అలాగే పిల్లల చదువులకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీ సౌకర్యం కల్పించాలన్నారు. వయసు రీత్యా వృద్ధులైన కార్మికుల కుటుంబం ఆధారం కోసం కార్మిక పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అండగా నిలవాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చాన్‌బాసు, కోశాధికారి షౌకత్, జిల్లా సెక్రటరీ ఉస్మాని, నగర ఉపాధ్యక్షులు మీరా, రాము, బాబు, శివ, మగ్బుల్, దాసరి, అన్వర్ పాల్గొన్నారు.

అక్కంపేట దేవస్థాన హుండీ చోరీ

పామూరు, జూలై 3 : మండలంలోని బోడవాడ పంచాయతీ అక్కంపేట గ్రామంలోని శ్రీ నాగారప్పమ్మతల్లి దేవస్థానంలో రాత్రి చోరీ జరిగింది. దేవస్థాన నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ దాసరి మాలకొండయ్య తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం గుడికి వెళ్లగా తలుపుల గడిని తీసి అమ్మవారి తాళిబొట్టు కాసులు బంగారంతో పాటు హుండీ తాళాన్ని పగలుకొట్టి అందులోని భక్తుల కానుకలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకొని వెళ్లినట్లు గుర్తు చేశామన్నారు. చోరీ సొత్తు సుమారు మూడు లక్షల రూపాయల దాక ఉంటుందని తెలిపారు. చోరీ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు మాలకొండయ్య తెలిపారు.

అమ్మ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పామూరు జూలై 3 : దేశప్రదాని నరేంద్రమోదీ పిలుపులో భాగంగా అమ్మ కోసం చెట్టు కార్యక్రమం కింద స్థానిక బీజేపీ కార్యాలయ ఆవరణలో అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య తన తల్లి కొండశెట్టి సుబ్బలక్ష్మమ్మ పేరుతో మొక్కను బుధవారం నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జే చినసుబ్బయ్య, ఇమ్మడిశెట్టి శ్రీను, పవన్ కుమార్, చరణ్, చల్లగుండ్లగోకుల్, బీ రమణాచారి పాల్గొన్నారు.

ఆలస్యంగా రావడంతో అందని పింఛన్

సైట్‌ను నిలిపేసిన ప్రభుత్వం.. ఇబ్బందులు పడుతున్న శివయ్య

పామూరు, జూలై 3 : రాష్ట్ర ప్రభుత్వం 2వ తేదీకే పింఛన్ ఆన్‌లైన్ సైట్ నిలిపేయడంతో రెండు కళ్లు సరిగా కనిపించని శివయ్య పింఛన్ నగదు పొందలేక మానసిక వేదన చెందుతున్నాడు. మండలంలోని సుబ్బక్కపల్లికి చెందిన లేగల శివయ్య చిన్నతనంలోనే చూపును కోల్పోయాడు. అతనికి అంధుడు విభాగం కింద పింఛన్ వస్తున్నది. శివయ్యకు ఎవరూ లేకపోవడంతో హైదరాబాద్‌లో అనాథ శరణాలయంలో ఉంటున్నాడు. ప్రతి నెలా పింఛన్ కోసం హైదరాబాద్ నుంచి సుబ్బక్కపల్లికి వచ్చి పింఛన్ సొమ్ము తీసుకుని వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక పెరిగిన పింఛన్ రూ.6 వేలు తీసుకునేందుకు 3వతేదీ రాగా పింఛన్ సైటును ప్రభుత్వం నిలిపివేసింది. దీనిపై అధికారులను అడగడంతో రెండు నెలలకు కలిపి వచ్చే నెలలో ఇస్తామని వారు చెప్పారని శివయ్య తెలిపాడు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

పామూరు, జూలై 3 : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని ఈవో ఆర్డీ కే శ్రీనివాసులు కోరారు. స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని కోరుతూ బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీ బ్రహ్మానందరెడ్డి, సేవసంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్‌రసూల్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉత్తరరావు, పీఈటీ మస్తాని, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతాప్ రెడ్డి, మండ్ల మల్లికార్జున, నాగి రసూల్ పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల షాపుల్లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

దర్శి, జూలై 3 : దర్శి పట్టణంలోని ఎరువులు, విత్తనాల షాపులను వ్యవసాయాధికారులు బుధవారం తనిఖీలు చేశారు. ఏడీఏ బాలాజీనాయక్, వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్‌లు పలు షాపుల్లో రికార్డులను తనిఖీలు చేశారు. నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు విక్రయించిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. వ్యాపారులు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.





ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- జీతాలు, పెన్షన్లు ఖాతాల్లో పడ్డాయ్..
- నిన్న ఉపాధ్యాయులకు.. నేడు పెన్షనర్లకు
- వైసీపీ ప్రభుత్వంలో పడ్డ కష్టాలకు విముక్తి
- ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు హర్షం



గుంటూరు(విద్య), పిడుగురాళ్ల, జూలై 3: దాదాపు నాలుగున్నర సంవత్సరాల తరువాత ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో జోష్ నెల కొంది. ఎన్డీఏ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయు లకు మంగళవారం, పెన్షనర్లకు బుధవారం వారి ఖాతా ల్లోడబ్బులు జమచేయడంతో వారు హర్షాతి రేకం వ్యక్తం చేస్తున్నారు. ఒక విధంగా వారి కుటుంబాల్లో నాలుగున్నర ఏళ్లతరువాత పండుగ వాతావరణం నెల కొంది. ,ఉమ్మడి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూపోలీసుతోపాటు వివిధ శాఖల రెగ్యులర్, కాంట్రాక్టు కలిపి దాదాపు 30 వేలకుపైనే ఉంటారని సంఘాల నాయకులు చెబుతున్నారు. మరో 25 వేల మందికి పైగా పెన్షనర్లు ఉంటారు. ఇందులో గ్రూపు -4 క్యాడర్ జిల్లా స్థాయి అధికారి వరకు అందరూ వేతనంపైనే ఆధార పడి ఉన్నారు. అయితే గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో ఏనెల కూడా జీతం ఒకటి నుంచి 5లోపు పడిన దాఖలాలు లేవు. నెల సగం గడిచన తరువాతే జీతాలు అందుకోవడం, ఒక్కోసారి నెలాఖరులో సైతం కొన్నిశాఖల ఉద్యోగులు జీతాలు తీసుకున్నారు. దీంతో అనేక మంది ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. తాజాగా జులై 3లోపు దాదాపు ఉద్యోగులు, పెన్షనర్ల ఖాతాల్లో డబ్బులు పడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్ల హర్షం..

ఉద్యోగ,ఉపాధ్యాయులు,పెన్షనర్లకు మూడులోగా ప్రభుత్వం జీతాలు, పెన్షన్లు చెల్లించడం పట్ల పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అధ్యక్షులు డి వెంకటేశ్వరు, కార్యదర్శి జి ప్రభుదాస్ హర్షం వ్యక్తం చేశారు. పెన్షన్‌పై అనేక జీవితాలు ఆధారపడి ఉంటాయని, వైద్య ఖర్చులు, కుటుంబ ఖర్చులకు విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఆధారమని గతంలో సక్రమంగా చెల్లించే వారుకాదని, తాజాగా ఎన్డీయే ప్రభుత్వం చెల్లింపులు సకాలంలో చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ బడ్జెట్ తల్లకిందులు..

నాటి వైసీపీ ప్రభుత్వ హయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సకాలంలో జీతాలు రాకపోవడంతో అనేక కుటుంబాల్లో బడ్జెట్ తల్లకిందులైంది. ఇంటి ఖర్చులతో పాటు, పిల్లల చదువులు, ఫీజులు చెల్లింపులు, ఇంటి అద్దెలు, గృహ, వాహనాలకు తీసుకున్న రుణాల చెల్లింపునకు అవసరమైన ఈఎంఐల చెల్లింపు, వైద్యఖర్చులు ఇలా అనేక విధాలైన ఖర్చులకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొన్నిసార్లు ఈఎంఐల చెల్లించక భారీ మొత్తం పెనాల్టీలు ఉద్యోగులు చెల్లించారు. మరోవైపు వైద్య ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు పడ్డారు. మరోవైపు హెల్త్ స్కీమ్ సక్రమంగా అమలు అయ్యేది కాదు. ఆస్పత్రులకు సకాలంలో బకాయిలు చెల్లించక పోవడంతో హెల్త్‌స్కీమ్ ఉన్నా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

సకాలంలో జీతాలు జమ



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులు సకాలంలో జమయ్యాయి. ఇది కూటమి ప్రభుత్వానికే సాధ్యమైంది. గతంలో జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నెల గతంలోలా ఎదురు చూడకుండానే జీతాలు ఖాతాలో జమయ్యాయి. **- విజయసారథి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

ఆనందంలో ఉద్యోగులు



గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లగా జీతాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఇంటి ఖర్చులు, బ్యాంక్ రుణాల చెల్లింపునకు నానా ఇబ్బందులు పడ్డాం. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల మొదటి వారంలోనే జీతాలు జమకావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **- చల్లగుండ్ల శ్రీనివాసరావు, ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు**

వడ్డీల భారం తగ్గుతుంది



టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన నెల మొదటి వారంలోనే జీతాలు పడటంతో వడ్డీల భారం తప్పుతుంది. ఇప్పటిదాకా జీతాల చెల్లింపు ఆలస్యం కావడంతో బ్యాంక్‌లు, ఇతర ఫైనాన్స్‌ల భారం పెనుభారంగా మారింది. ఇప్పటి నుంచి సకాలంలో జీతాలు చెల్లింపులు ఉంటాయన్న భరోసా ఎంతో ఊతమిచ్చినట్లుగా ఉంది. **- శ్రీలక్ష్మి, ఉపాధ్యాయురాలు, పిడుగురాళ్ల**

ఆగని గ్రానైట్ దందా

- గుట్టుగా అక్రమ రవాణా
- జీరోపై రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు
- ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రానైట్ అక్రమ రవాణా గుట్టుగా సాగుతోంది. నాగార్జున సాగర్, నార్కెట్‌పల్లి రెండు రహదారుల్లో రాత్రి వేళ పెద్ద ఎత్తన గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటిపోతున్నాయి. అడిగేవారు ఉండరు.. అడ్డుకునే వారు ఉండరు.. వే బిల్లు అక్కరలేదు. ప్రభుత్వంకు రూపాయి కూడా పన్ను చెల్లించకుండా గ్రానైట్‌ను జిల్లా మీదుగా తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి కోట్లల్లో గండి పడుతోంది.

● చిలకలూరిపేట, నరసరావుపేట, ప్రకాశం జిల్లా సంతమాగులూరు, చీమకుర్తి, బల్లికురవ మండలాల పరిధిలో గ్రానైట్ పరిశ్రమలు, క్వారీలు ఉన్నాయి. అయ ప్రాంతాల నుంచి ప్రతి రోజు పెద్దఎత్తున గ్రానైట్ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు గ్రానైట్ ఎగుమతి చేస్తున్నారు. పల్నాడు జిల్లా గుండా రాష్ట్ర సరి హద్దులు దాటే గ్రానైట్‌కు మాత్రం వే బిల్లులు ఉం డవు, వీరు పన్ను కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. జీరో పైనే లారీలకు లారీల గ్రానైట్‌ను రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్నారు. ఈ అక్రమ గ్రానైట్ దందా రాత్రి వేళల్లో యథేచ్ఛగానే సాగుతోంది. ఈ అక్రమ రవాణా కోసం ఒక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పన్నుల శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



● కోటప్పకొండ మీదుగా నరసరావుపేట బైపాస్ రోడ్డుకు రాత్రి వేళ గ్రానైట్ లారీలు చేరుకుంటాయి. అక్కడ నుంచి లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటించే ముఠా రంగంలోకి దిగి, డ్రైవర్లకు టోకెన్‌లు జారీ చేస్తారు. టోకెన్ ఉన్న లారీని ఎక్కడా ఎవరూ ఆపరని, ఎవరైనా ఆపితే తామే చూసుకుంటామని సదరు ముఠా భరోసా ఇస్తుందని చెబుతున్నారు. ఎక్కడైనా ఏ అధికారైనా టోకెన్ ఉన్న లారీని ఆపితే సదరు ముఠా రంగంలోకి దిగి సురక్షితంగా గ్రానైట్ లారీని రాష్ట్ర సరిహద్దు దాటిస్తుంది. కొందరు అధికారులు కూడా అక్రమ రవాణాలో సూత్రధా రులుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

● గ్రానైట్ లోడు రవాణా చేయాలంటే వే బిల్లు తీసుకోవాల్సి ఉంటుంది. లారీకి రూ లక్షకు పైగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అక్ర మార్కులు కోరిన విధంగా రూ 38 వేలు చెల్లిస్తే ఈ పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. నెలకు వందల సంఖ్యలో గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటిపోతున్నాయి. ఏటా ప్రభుత్వానికి రూ 15 నుంచి రూ 20 కోట్ల వరకు ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతున్నట్టు సమాచారం. పన్నుల శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ గ్రానైట్ పన్ను ఆదాయం 90 శాతంకు పైగా తగ్గిందని చెప్పడం గమనార్హం.

కానిస్టేబుల్.. కింగ్‌మేకర్

- తాను లోకల్ అంటూ హల్‌చల్
- పెండింగ్‌లో పలు కేసులున్నా పోస్టింగ్

చీరాల, జూలై 3: ఓ సినిమాలో హీరో అన్నట్టు పోలీస్ శాఖలో అధికారులు వస్తుంటారు.. పోతుంటారు.. చంటిగాడు లోకల్ అన్నట్లు.. చీరాల నియోజకవర్గ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసే వ్యక్తి రింగ్‌మాస్టర్‌లా చెలరేగిపోతున్నాడు. సదరు కానిస్టేబుల్ నియోజకవర్గంలో కింగ్‌మేకర్ అంటూ హల్‌చల్ చేస్తున్నాడు. అవినీతి ఆరోపణలతో సస్పెండై వీఆర్‌లో ఉన్నా పోస్టింగ్ సంపాదించాడంటే అతడి హవా ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇతడిపై పలు ఆరోపణలతో పాటు, కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ కానిస్టేబుల్‌కి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారనే ప్రచారం ఉంది. కొన్ని చోట్ల ఇతడి చేపట్టిన దందాలే ఇందుకు నిదర్శనమంటున్నారు. పోలీసు అధికారులు సైతం అతడి మాటను సుగ్రీవాజ్ఞలా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసేపుడు అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యాడు. ఆ తర్వాత వీఆర్‌కు పంపిగా ప్రస్తుతం ఓ స్టేషన్‌కు ఆ కానిస్టేబుల్‌ను అటాచ్‌మెంట్ చేసినట్లు తెలిసింది. అతడిపై ఉన్న ఆరోపణలు, కేసుల్లో ప్రధానమైనది నందికొట్కూర్ పీఎస్‌లో ఉన్న కేసని సమాచారం.

బదిలీల్లోనూ కీలకం..

స్థానికంగా పోలీస్‌శాఖలో జరుగుతున్న, జరగాల్సిన బదిలీల్లో కూడా తానే కీలకమని ఆ కానిస్టేబుల్ చెప్పుకుంటున్నాడు. ఆ క్రమంలో జరిగిన ఓ బదిలీని ఉదాహరణగా డిపార్ట్‌మెంట్లో చర్చసాగుతోంది. ఈ క్రమంలో పై అధికారులు బదిలీలు, కొత్త వారి నియామకాలు కూడా తన కనుసన్నల్లోనే జరుగుతాయనే భావనను ఇతరుల్లో కల్పించడంలో సఫలీకృతులైనట్లు సమాచారం.



అంటకాగితే అనర్థమే..

శాఖాపరంగా ఓ చిరుద్యోగి పై అధికారులను సైతం ప్రభావితం చేస్తున్న క్రమం పతాక స్థాయికి చేరింది. అలాంటి వ్యక్తికి అండదండలు ఉన్నాయని భావించేలా అంటకాగుతున్న నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని టీడీపీలో సీనియర్లు కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత పాలకులకు శాపాలుగా మారిన పరిణామాలు కూటమి అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా గడవక ముందే ఎదురవడంపై సంబంధీకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలుకుతున్నారు. ఇప్పటికే సంబంధిత అంశాలపై పార్టీ అధిష్ఠానానికి కూడా సీనియర్ నాయకులు సమాచారం పంపినట్లు తెలిసింది.

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాపట్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా జె. వెంకటమురళి గురువారం బాధ్యతలు స్వీకరించ నున్నారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో డైరెక్టర్‌గా ఉన్న ఆయనను బాపట్ల కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. ఆయన గురువారం ఉదయం 11 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో బాధ్యతల స్వీకరణకు సంబంధించిన అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్‌గా పగ్గాలు చేపట్టిన అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమావేశం కానున్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియమితులైన జేసీ శ్రీధర్ కూడా గురువారం రిలీవ్ కానున్నారు.

టీచ్ స్కూల్ శిక్షణ ఉపయుక్తం

- ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

బాపట్ల, జూలై 3: ఉపాధ్యాయులకు బోధనా ప్రక్రియలో టీచ్ స్కూల్ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావవ్యక్తీకరణ, తరగతి గది సంస్కృతి, బోధన, కృత్యాల సాధన, పరిశీలన, విద్యార్థుల అవగాహన వంటి విషయాలు టీచ్ స్కూల్ శిక్షణ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. తద్వారా విద్యార్థుల సామర్థ్యాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎమ్‌వో డాక్టర్ బిళ్లా మోజెస్, రీసోర్స్‌పర్సన్లు మహ్మద్ అక్రమ్‌ఘోరి, పి.పోతురాజు, డి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు.. బురద మయం

- చెన్నుపల్లి అనంతవరం రోడ్డంటేనే హడల్
- గ్రానైట్ క్వారీలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసం
- యజమానులతో మరమ్మతులు చేయించాలని ప్రజల పట్టు


సురక్ష గ్రానైట్ క్వారీ వద్ద అర్‌అండ్‌బి రోడును జారుడు రోడ్డుగా మార్చిన వైనం


కొండాయపాలెం నుంచి మల్లాయపాలెం వెళ్లే రోడ్డు దుస్థితి

బల్లికురవ, జూలై 3: రూ.లక్షలు వెచ్చించి తారు రోడ్డు వేశారు. అయితే బురదమయంగా మారిన ఈ రోడ్డుపై రాకపోకలు అంటే వాహన చోదకులు హడలెత్తిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ అర్‌అండ్‌బీ రోడ్డును గ్రానైట్ క్వారీల వారు ఇష్టానుసారం తమ సొంతానికి వాడుకోవడంతో ఈ మార్గం ప్రమాదాలకు నెలవుగా మారింది. బల్లికురవ మండలం చెన్నుపల్లి అనంతవరం అర్‌అండ్‌బీ రోడ్డు డబుల్ రోడ్డుగా గతంలో అభివృద్ధి పరిచారు. కొండాయపాలెం నుంచి మల్లాయపాలెం క్రాస్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న గ్రానైట్ క్వారీల నిర్వాహకులు రోడ్డును ఆక్రమించుకున్నారు. రోడ్డుపైనే యంత్రాలను ఉంచడం, లోడింగ్‌లకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో క్వారీల నుంచి వచ్చే మట్టి రోడ్డుపై పెద్ద ఎత్తున చేరుతోంది. దీంతో తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది. చిన్న పాటి వర్షం కురిస్తే బురదతో నిండిపోయి రోడ్డు మొత్తం జారుడు బల్లగా మారుతుంది. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మాజీ మంత్రికి సంబంధించిన సురక్ష గ్రానైట్ క్వారీ వద్ద అయితే తారు రోడ్డు వాగును తలపిస్తుందని వాహన చోదకులతో పాటు సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో క్వారీల యజమానులు రోడ్డుపై ఉన్న మట్టిని యంత్రాలతో తొలగించారని, అయితే మళ్లీ ఇప్పుడు మట్టి పెద్ద ఎత్తున పేరుకు పోయిందంటున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుపై రాకపోకలకు చెన్నుపల్లి, కొండాయపాలెం గ్రామాల ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా చిలకలూరిపేట వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఈ రోడ్డును వదిలేసి బల్లికురవ వెళ్లి వెళుతున్నారు. తక్షణమే రోడ్డు మరమ్మతులను గ్రానైట్ క్వారీల యజమానులచే చేయించాలని కోరుతున్నారు. తారు రోడ్డుపై మట్టి లేకుండా చర్యలు చేపట్టాలని అధికార్లను ప్రజలు కోరుతున్నారు.

ఇసుక మేతపై.. చర్యలెప్పుడో?



- వైసీపీ పాలనలో రూ.450 కోట్ల దోపిడీ
- అనుమతులు లేవు.. నిబంధనల ఊసే లేదు
- తెరవెనక కీలక నేతలు.. తెరముందు అనుచరులు
- సుప్రీంకోర్టు జోక్యంతో ప్రస్తుతం ప్రతి వారం తనిఖీలు

బాపట్ల, చీరాల జూలై 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఊసే లేకుండా.. అనుమతులు అవసరం లేకుండా ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టారీతిన ఇసుక దోపిడీ జరిగింది. పర్యావరణానికి ప్రమాదమన్నా పట్టించుకోకుండా నదీగర్భాలను చెరబట్టి నేతలు కోట్లు దండుకున్నారు. భూగర్భజలాలు అడుగంటుతున్నాయన్న ఆందోళనలను సైతం పక్కన పెట్టి మరీ ఇసుకాసురులు రెచ్చిపోయారు. రీచ్‌ల్లోనే ఇసుక అమ్మకం అంటూ గత ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ కల్లబొల్లి కబుర్లుగానే మిగిలిపోయాయి. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ అడ్డగోలుగా తవ్వేశారు. రాజకీయ పరపతిని ఉపయోగించి రెవెన్యూ శాఖ నుంచి మొక్కుబడి అనుమతులు తెచ్చుకోవడం, సొరంగాలను తలపించేలా పుడమిని చెరబట్టి ఒక్క ఇసుక మీద వైసీపీ నేతలు రూ.450 కోట్లు ఆర్జించారు. బాపట్ల, చీరాల సరిహద్దుల్లో వైసీపీ నేతలు ఇసుక దందాలో పోటీ పడ్డారు. ఇసుక దోపిడీలో బాపట్లకు చెందిన వైసీపీ నేత కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఇసుకలో ఆదాయం పెద్ద ఎత్తున కనబడడంతో వేమూరుకు చెందిన వైసీపీ నేత కన్ను ఇసుక తవ్వకాలపై అప్పట్లో పడింది. దీంతో వారి మధ్య ఆధిపత్య పోరు కూడా నడిచింది. తర్వాత ఓ అవగాహనకు వచ్చి ఇసు కార్జనలో పోటీపడ్డారు. అద్దంకి పరిధిలోని గుండ్లకమ్మ, మోదేపలి వద్దగల చిలకలేరు, పేరాయపాలెం వద్ద వైసీపీ ఇసుక దోపిడీని చెరబట్టింది. ఐదేళ్ల పాటు చేసిన విధ్వంసం తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో మొక్కుబడి తనిఖీలకు యంత్రాంగం పరిమితమవు తోంది. వాస్తవానికి ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన రీచ్‌ల కుంటే పదిరెట్లు ఇసుక బయట తవ్వకాల ద్వారా వైసీపీ నేతలు అమ్మకాలు సాగించారు. ఈ దోపిడీపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి ఇసుకాసురలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన దోపిడీపై నిగ్గు తేల్చాల్సిందేనన్న డిమాండ్లు వస్తున్నాయి. దోపిడీలో వైసీపీ నేతల పాత్రను రూఢీ చేసే ఆధారాలు జిల్లా అధికారులకు ఉన్నాయని వాటిని బయటకు తీసి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కొత్త ప్రభుత్వాన్ని ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

జాతీయ రహదారి పనులకని...

బాపట్ల పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణంతో పాటు మెడికల్ కళాశాల నిర్మాణాలకని ఇసుక తవ్వకాలకు అనుమతులు తెచ్చుకుని చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు. బాపట్ల రూరల్ పరిధిలోని ఇసుక తవ్వకాలకు తెచ్చుకున్న అనుమతులు 2023 ప్రథమార్థంలోనే ముగిసిపోయాయి. అయినా ఈ ఏడాది ఎన్నికల షెడ్యూల్ వచ్చేవరకు కూడా తవ్వకాలను ఇష్టారీతిన సాగించారు. బాపట్ల, చీరాల మధ్యగల వెదుళ్లపలి పరిసరప్రాంతాల్లోని పొలాల్లో దాదాపు 15నుంచి 20 అడుగుల మేర ఇసుక తవ్వకాలు చేశారు. అడ్డగోలు ఇసుక తవ్వకాలు వల్ల భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా తమ పైర్లకు సైతం నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోయినా ఆలకించే వారే లేకపోయారు. పైగా సొరంగాలను తలపించేలా ఇసుకను తవ్వి పొలాలను రొయ్యల చెరువులుగా మార్చి అక్కడ తవ్వకాలే జరగలేదన్న రీతిలో ఇసుకాసురులు చేసిన మాయ గత ప్రభుత్వంలో పరాకాష్టగా నిలిచింది. అద్దంకి నుంచి ఐదేళ్ల పాటు జరిగిన దోపిడీ ఒక ఎత్తయితే చివరి రెండేళ్లలో గుండ్లకమ్మను చెరబట్టి మరీ దోపిడీ సాగించారు. అక్రమ ఇసుక తవ్వకాల ద్వారా అద్దంకి నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ.80 కోట్ల మేర దందా సాగిందని సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలోని లంకల్లో అక్కడి వైసీపీ నేత సాగించిన ఇసుక దందా అన్ని హద్దులను చెరిపేసింది. నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన ఓ ప్రైవేటు ఏజెన్సీ సంస్థ ప్రతినిధులను సైతం బెదిరించి ఇసుక దోపిడీని సాగించారు. ఐదేళ్ల పాటు సాగిన ఈ దందాలో సదరు నేత వెనకేసింది అక్షరాల వంద కోట్లకు పైమాటగానే ఉంది. ఐదేళ్లలో ఇసుక అక్రమ తవ్వకాల్లో ఎక్కడా నేతలు తెరమీద కనబడకుండా ద్వితీయశ్రేణి నేతాగణాన్ని అడ్డుపెట్టి పబ్బం గడుపుకున్నారు. బాపట్లకు సంబంధించి ఇసుక దోపిడీలో మత్స్యశాఖలో నిన్నమొన్నటి వరకు నామినేటెడ్ పోస్టులో ఉన్న వ్యక్తి సదరు కీలకనేత దోపిడీకి బినామీగా వ్యవహరించారని ఆరోపణలున్నాయి. అంతులేని ఈ ఇసుక దోపిడీ వ్యవహారంపై గతంలో కలెక్టర్‌గా పనిచేసిన విజయకృష్ణన్ దాదాపు కోటి రూపాయల వరకు జరిమానా విధించారని సమాచారం. కానీ అధికారం అండతో ఆ దస్త్రాన్ని అప్పటి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. జరిమానానే కోట్లలో ఉందంటే దోపిడీ ఏ స్థాయిలో జరిగిందనేది అర్థం చేసుకోవచ్చు. ఇక చీరాల, వేమూరు పరిధిలో జరిగిన ఇసుక దోపిడీలో కీలక నేతల అనుచరగణమే ప్రధానంగా ఉంటూ ఇష్టారీతిన దండుకున్నారు. వేమూరు పరిధిలో జరిగిన దోపిడీపై రీచ్‌ల కాంట్రాక్టు పొందిన ప్రైవేటు సంస్థ రాతపూర్వకంగానే అక్కడి వైసీపీ నేతలపై జిల్లా అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు.

ఇసుక అక్రమార్కుల్లో అలజడి

చీరాల: ఇసుకపై ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఇసుకాసురుల్లో అలజడి నెలకొంది. ఉచిత ఇసుక అమలుకు సంబంధించిన ప్రకటనతో అక్రమాలకు బ్రేక్ పడనుంది. అయితే ప్రభుత్వాలు మారినా చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమాలు యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. ఈనేపథ్యంలో అక్రమార్కులు ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరుతూ అటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. ఇటు ప్రజల జేబులకు చిల్లులు పెడుతూ వస్తున్నారు. వేటపాలెం మండలం పాపాయపాలేనికి చెందిన ఓ వైసీపీ నేత, అతడి సహచర అక్రమర్కుడు జట్టుగా ఇటీవల ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆ పరిణామం దేనికి సంకేతమని పాలక ప్రతిపక్షాలతోపాటు, సామాన్య ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో వారి అక్రమ ఆటలకు తెరపడినట్లైంది.


బాపట్ల రూరల్ పరిధిలో జరిపిన ఇసుక అక్రమ తవ్వకాలు

మహిళా మార్ట్ నిధుల గోల్‌మాల్‌పై విచారణా.. ఆ అంశాన్ని పక్కదారి పట్టించే పన్నాగమా..?

సిబ్బందిని గుంటూరు రావాలనడంపై అనుమానాలు

ఉన్నతాధికారులు పట్టించుకోవాలని సభ్యుల విజ్ఞప్తి



సభ్యులను విచారిస్తున్న మెప్మా పీడీ వెంకటేశ్వర్లు

అద్దంకి, జూలై 3 : వైసీపీ పాలనలో అద్దంకి పట్టణంలో మెప్మా ఆధ్వ ర్యంలో నిర్వహించిన జగనన్న మహిళా మార్ట్‌లో నిధుల గోల్‌మాల్ ఫిర్యాదులపై బుధవారం గుంటూరు మెప్మా పీడీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. మెప్మా సభ్యుల నుంచి సేకరించిన 11 కోట్ల రూపాయలతో రెండున్నర సంవత్సరాల కిందట అద్దంకిలో మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. అందుకు సంబంధించి ఇంతరవకు సభ్యులకు జమా ఖర్చుల వివరాలను చెప్పలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించే ఆలోచన తో మహిళా మార్ట్‌ను మూసివేశారు. సభ్యులు పెట్టిన పెట్టుబడికి సంబంధించి బ్యాంక్‌లో డబ్బులు నిల్వలు లేకపోవడం, మార్ట్‌లో అంత మొత్తంలో సరుకులు లేకపోవడంతో సభ్యులలో ఆందోళన నెలకొంది. దీంతో పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ విచారణ చేపట్టగా పూర్తి స్థాయిలో రికార్డులు చూపించకపోవడంతో గురువారం నాటికి అన్ని రికార్డులు అందుబాటులో ఉంచి కమిటీ సభ్యులు హజరయ్యే విధంగా చేయాలని కోరారు. బుధవారం మెప్మా పీడీ వెంకటేశ్వర్లు కార్యాలయంలో సిబ్బంది, ఆర్‌పీలు, కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే పలువురు సభ్యులు నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి పక్కా ఆధారాలు చూపించేందుకు ప్రయత్నించినప్పటికీ అవకాశం కల్పించలేదన్న విమర్శలు వస్తున్నాయి. సీఎంఎంగా ఉన్న ఫణికుమారి పక్కా ముందస్తు వ్యూహంతో విచారణను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిధుల గోల్‌మాల్‌పై అద్దంకిలో విచారణ చేపట్టాల్సిన అధికారులు అన్ని రికార్డులు తీసుకొని గుంటూరుకు సభ్యులను రావాలని చెప్పడం వెనుక విచారణను నీరుగార్చే ప్రయత్నం సాగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వేరే శాఖకు చెందిన అధికారులను విచారణ అధికారులుగా నియమిస్తే నిధుల గోల్‌మాల్ వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నెల రోజుల కిందట మహిళామార్ట్ మూత పడగా గత వారం, పది రోజులుగా మార్ట్ బ్యాంక్ ఖాతాలలో కొంత మేర నగదు జమ అవుతుండడం కూడా అనుమానాలకు తావిస్తుందని పలువురు సభ్యులు అభిప్రాయపడుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే ఏలూరికి గ్రానైట్ యాజమాన్యం వినతి



ఎమ్మెల్యే ఏలూరికి వినతిపత్రం అందజేస్తున్న గ్రానైట్ యాజమాన్యం

పర్చూరు, జూలై 3 : గ్రానైట్ పరిశ్రమ యాజమాన్యాల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ బుధవారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై స్పందించిన ఏలూరి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఏలూరిని కలసి అర్జీలను అందజేశారు. గ్రామాల్లో ఉన్న సమస్యలన ఏలూరి అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు మర్యాద పూర్వకంగా ఏలూరిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. అందులో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్‌శాఖ, ఫైర్ సిబ్బంది ఉన్నారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ

నలుగురు యువకులకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన యువకులు

సంతమాగులూరు, జూలై 3: కర్నూలు - గుంటూరు ప్రదాన రహదారిపై సంతమాగులూరు మండలం సంతమాగులూరు - పుట్టావారిపాలెం అడ్డరోడ్డు గ్రామాల మధ్య రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పుట్టావారిపాలెం నుంచి వస్తున్న మోటారు సైకిల్ సంతమాగులూరు నుంచి వస్తున్న మోటారు సైకిల్ ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

మేదరమెట్ల , జూలై 3 : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం మండలంలోని రావినూతలకు చెందిన మోపర్తి బసవరావు(46) గ్రామ సమీపంలోని పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కొరిశపాడు ఎస్‌ఐ శివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కొండయ్యకు వైసీపీ కౌన్సిలర్ల మద్దతు



కొండయ్యకు మద్దతు తెలుపుతున్న వైసీపీ కౌన్సిలర్లు

చీరాల, జూలై 3 : ఎమ్మెల్యే కొండయ్యకు పలువురు వైసీపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్యను పలువురు కలిసి పట్టణాభివృద్ధికి, తమ వార్డుల్లో సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన పార్టీ కార్యక్రమాల్లో భాగంగా ఎన్నికలకు ముందు చేపట్టిన అన్ని కార్యక్రమాల ద్వారా పట్టణ పరిస్థితులు, స్థితిగతులపై పూర్తి అవగాహన ఉందన్నారు. భవిష్యత్‌లో అందరం కలిసి పనిచేస్తూ పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేద్దామన్నారు. త్వరలో మంచి వేదిక ఏర్పాటు ద్వారా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే కొండయ్యకు మద్దతు తెలిపిన వారిలో వైసీపీ కౌన్సిలర్లు ఇస్తర్ల సుజాత, చుక్కా నాగలక్ష్మి, కల్లూరి సత్యానందం, యంద్రపాటి కెజియ, ఉప్పులూరి శోభనారెడ్డి, పండ్లూరి శిరీష, షేక్ షాహిదల తరఫున వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

అక్కంపేట దేవస్థాన హుండీ చోరీ

పామూరు, జూలై 3 : మండలంలోని బోడవాడ పంచాయతీ అక్కంపేట గ్రామంలోని శ్రీ నాగారప్పమ్మతల్లి దేవస్థానంలో రాత్రి చోరీ జరిగింది. దేవస్థాన నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ దాసరి మాలకొండయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం గుడికి వెళ్లగా తలుపుల గడిని తీసి అమ్మవారి తాళిబొట్టు కాసులు బంగారంతో పాటు హుండి తాళాన్ని పగలుకొట్టి అందులోని భక్తుల కానుకలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకొని వెళ్లినట్లు గుర్తు చేశామన్నారు. చోరీ సొత్తు సుమారు మూడు లక్షల రూపాయల దాక ఉంటుందని తెలిపారు. చోరీ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు మాలకొండయ్య తెలిపారు.

అంతా మా ఇష్టం!

ఒంగోలు జీజీహెచ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం

రోగులను ముట్టుకోని మేల్ నర్సులు

అర్హత లేని వారు ఫ్యాకల్టీలుగా పెత్తనం

వైసీపీ నేతల అండతో విధులకు అతిథులుగా మారిన వైనం

గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి, ప్రభుత్వం మారినా తీరు అంతే

పేదలకు అందని వైద్యసేవలు

నిబంధనలకు విరుద్ధంగా నర్సులకు డ్యూటీలు

అందులోనూ చేతివాటం చూపుతున్నట్లు ఆరోపణలు

పేదల పెద్దాసుపత్రి అయిన ఒంగోలు జీజీహెచ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులపట్ల కనికరం చూపాల్సిన వారు కాఠిన్యం ప్రదర్శిస్తున్నారు. వివిధ రకాల వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్న వారికి కనీస సేవలు అందించకుండా కాలక్షేపం చేస్తున్నారు. అసలు పనిని వదిలేసి పెత్తనం చేయడానికే పరిమితమవుతున్నారు. ఎంఎన్‌వోలు (పురుష నర్సులు)గా విధుల్లో చేరిన వారు అసలు డ్యూటీలు మానేసి ఫ్యాకల్టీలుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తిష్ట వేశారు. గత ప్రభుత్వంలో నేరుగా మెడలో వైసీపీ కండువాలు కప్పుకొని విధులకు అతిథులుగా మారిన వారు ఇప్పటికే అదే పంథాను కొనసాగిస్తున్నారు. మరికొందరు ఉద్యోగ సంఘ నాయకులుగా చెలామణి అవుతూ ఎలాంటి బదిలీలు లేకుండా తమ స్థానాలను కాపాడుకొంటున్నారు. అర్హత లేకపోయినా మేల్ నర్సింగ్ ఆపరేటర్లు (ఎంఎన్‌వోలు) నర్సింగ్ విద్యార్థులకు ఫ్యాకల్టీలుగా కొనసాగడంపై డాక్టర్లు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని ఇతర వైద్యశాలలకు భిన్నంగా ఇక్కడి నర్సింగ్ సూపరింటెండెంట్ సొంత టైంటేబుల్ అమలుచేస్తున్నారు. తనకు పైసలు ఇచ్చిన సిబ్బందికి వారికి ఇష్టమొచ్చిన సమయాల్లో విధులు కేటాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



జీజీహెచ్ ఆస్పత్రి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3: ఒంగోలులోని సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)కి జబ్బు చేసింది. ఇక్కడి సిబ్బంది తమ రూటే సపరేటు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ ముఖ్య నేతల ఆశీస్సులతో అంతా మా ఇష్టం అన్నట్లు సాగిన వారు ఇప్పటికీ తీరు మార్చుకోలేదు. సుమారు 60మంది వరకు మేల్ నర్సులు ఉండగా ఒక్కరు కూడా రోగి చేయి పట్టుకోరు. వారికి కట్టుగుడ్డ కట్టరు. వాస్తవానికి మేల్‌నర్సులు కాంపౌడర్‌తో సమానం. రోగులు వస్తే వారికి సేవ చేయాలి. కానీ గత ఐదేళ్లుగా ఇక్కడ ఎంఎన్‌వోలు రాజకీయ పలుకుబడితో కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఫ్యాకల్టీలుగా, అధికారుల వద్ద సీసీలుగా ఎవరికి ఆసక్తి ఉన్నది వారు ఎంచుకుని వైట్‌కాలర్ ఉద్యోగాలకే పరిమితమయ్యారు. దీంతో రోగులను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వారికి పనులు అప్పగించేందుకు జీజీహెచ్ అధికారులు సైతం జంకుతున్నారు. దీంతో పేద రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. నర్సింగ్ విద్యార్థులకు విద్యాబోధనకు ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులు. అయితే జీజీహెచ్‌లో మాత్రం బీఎస్సీ నర్సింగ్ చదివి ఎంఎన్‌వోగా ఉద్యోగం పొందిన ఒకరు ఉద్యోగుల సంఘం నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. దాన్ని అడ్డుపెట్టుకొని ఎలాంటి అర్హత లేకపోయినా నర్సింగ్ విద్యార్థులకు బోధకుడిగా వ్యవహరిస్తుండటం విస్తుగొలుపుతోంది.

మేడంకి పైసలిస్తే పగలు డ్యూటీ

జీజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ సొంత టైం టేబుల్ అమలు చేస్తున్నారు. తనకు పైసలు ఇచ్చిన నర్సింగ్ సిబ్బందికి వారికి ఇష్టమొచ్చిన సమయాల్లో విధులు కేటాయిస్తున్నట్లు విమర్శలున్నాయి. రాష్ట్రంలోని ఏజిల్లాలో లేనివిధంగా ఒంగోలు జీజీహెచ్‌లో డ్యూటీలు మారుస్తూ భారీగా దండుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 200 మంది వరకూ వైద్యులు, వారికి సహాయకులుగా మేల్ నర్సులు (ఎంఎన్‌వోలు) 60 మంది ఉండగా, మహిళా నర్సులు (ఎఫ్‌ఎన్‌వోలు) 45 మంది వరకూ పనిచేస్తున్నారు. స్టాఫ్ నర్సులు (కాంట్రాక్టు కలిపి) 400 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. వారికి మూడు షిఫ్టుల్లో విధులు కేటాయించాల్సి ఉంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకూ పనిచేయాలి. వీరిలో స్టాఫ్ నర్సులకు ప్రతి మూడు నెలలకు ఒక నెల మాత్రం నైట్ డ్యూటీ చేయాల్సి ఉంది. అయితే నర్సింగ్ సూపరింటెండెంట్ నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకూ తన సొంత టైంటేబుల్‌ను అమలు చేస్తున్నారు. ఆ సమయాల్లో డ్యూటీలు వేయడం, అందుకోసం వారి వద్ద నుంచి మామూళ్లు తీసుకోవడం పరిపాటైందన్న విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి.

ఓడిపోయినా ఇంకా వైసీపీ ముసుగులోనే పెత్తనం

ఐదేళ్ల వైసీపీ పాలనలో జీజీహెచ్‌లో కొందరు సిబ్బంది అంతా తామై వ్యవహరించి అధికారులపై పెత్తనం చేయడమే కాకుండా, మాజీమంత్రి పీఏ అండదండలతో తాము చెప్పిందే వేదమన్నట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైనప్పటికీ ఆ పార్టీ పేరు చెప్పుకొని ఇన్నాళ్లు షాడోలుగా వ్యవహరించిన వారి తీరు మారలేదు. ఇదే విషయం ఆసుపత్రి అధికారులు, డాక్టర్ల మధ్య పలు సందర్భాలలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ వారిని వారివారి విధులకు పంపడంలో వెనకడుగు వేస్తున్నారు.

వచ్చామా.. పోయామా..!

వైద్యశాలలో ముఖ్యమైన శస్త్ర చికిత్సలకు డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. సర్జరీ విభాగానికి 70 శాతం మంది రోగులు వస్తుండగా అవసరమైన వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శస్త్ర విభాగానికి సుమారు ఐదుగురు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరముంది. మెడిసిన్ విభాగంలో మరో ముగ్గురు వైద్యుల కొరత వేధిస్తోంది. గుండె జబ్బులు, న్యూరాలజీ, నరాలకు సంబంధించిన వైద్యుల లేకపోవడంతో మరింత దారుణంగా కనిపిస్తోంది. ఇటీవల కాలంలో వైద్యుల బదిలీలు జరగడంతో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల నుంచి పలువురు ఒంగోలు జీజీహెచ్‌కు వచ్చారు. వీరిలో ఎక్కువ మంది వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే విధుల్లో అందుబాటులో ఉంటున్నారు. మిగిలిన రోజుల్లో వైద్యానికి వీరి సేవలు కరువయ్యాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది.

కనిగిరికి కొత్త కళ...!

తొలివిడతగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు

తొలగనున్న ట్రాఫిక్ సమస్య, రోడ్ల అభివృద్ధికి అవకాశం

మలివిడత ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపునకు అవకాశం

పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు, షాపులపై ఎమ్మెల్యే ఉగ్ర దృష్టి

మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నగరపంచాయతీగా మారి తొమ్మిదేళ్లు. డివిజన్ కేంద్రమై కూడా రెండేళ్లు దాటింది. కానీ కనిగిరిలో అభివృద్ధి శూన్యమనే చెప్పుకోవచ్చు. అందుకు ప్రధాన కారణం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటం అందుకు ఆక్రమణలు ప్రతిబంధకంగా మారటం. ఉదయం స్కూల్ బస్సు తిరిగే అవకాశం ఉండదు. సాయంత్రం టూవీలర్‌పై కుటుంబ సభ్యులు షాపింగ్ వెళ్లే అవకాశం అసలే ఉండదు. ఈ నేపథ్యంలో ఐదు మాసాల క్రితం ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఆక్రమణల తొలగింపు ఆరంభమైంది. బుధవారం ఒకేసారి కీలకమైన ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించేశారు. రోడ్లు విశాలంగా మారాయి. అన్నివర్గాల వారు హర్షించారు. కానీ ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. దీంతో వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించే విషయంపై కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దృష్టిసారించారు.



రేకులను తీసుకెళ్తున్న దృశ్యం

ఆ రోడ్లలో అన్నీ ఇబ్బందులే..

కనిగిరి నగరపంచాయితీలో 20 డివిజన్లు ఉన్నాయి. 50వేలమందికి పైగా జనం నివసిస్తున్నారు. పూర్వకాలంలో చిన్న పల్లెటూరు కావటంతో చిన్నచిన్న రోడ్లు ఉండేవి. క్రమేపీ అన్నీ రకాలుగా ఆ ప్రాంతం విస్తరించింది. గతంలో ఉగ్రనరసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కనిగిరి మున్సిపాలిటీ చేయాలని ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరపంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా కనిగిరిని డివిజన్ కేంద్రంగా మార్పు చేశారు. తదనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు పెరిగాయి. మరోవైపు గ్రామాల నుంచి కనిగిరిలో స్థిరపడే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీంతో స్థానికంగా ఉండేవారితోపాటు వివిధ అవసరాల కోసం కనిగిరి వచ్చిపోయే వారి సంఖ్య పెరిగింది. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి కనిగిరి వెళ్లేందుకు గంట సమయం పడితే, కనిగిరిలో ఒంగోలు బస్టాండ్ ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లేందుకు ముప్పావుగంట పట్టే పరిస్థితి నెలకొంది. ఇక కనిగిరిలోని వీధులన్నీ ఉదయం, సాయంత్రం కిటకటలాడటమే. సాయంత్రం షాపింగ్ వెళితే టూవీలర్ పార్కింగ్‌కు అవకాశం లేదు. పొరపాటున ఎక్కడైనా కూడలి ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవిస్తే సకాలంలో ఫైరింజన్ చేరే పరిస్థితి లేదు. అంబులెన్స్‌కు దారి దొరకని ప్రాంతాలు అనేకం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కనిగిరిలో ఆక్రమణల తొలగింపు, తదనుగుణంగా అభివృద్ధి పనుల ద్వారా సమస్యల నివారణకు ప్రతిపాదనలు రూపొందించారు. ఎన్నికలు కాగానే ప్రతిపాదనల అమలుకు శ్రీకారం పలికారు. బుధవారం యావత్తు యంత్రాంగం రంగంలోకి దిగి శాశ్విత నిర్మాణాల జోలికి వెళ్లకుండా ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తొలగించేశారు. పామూరు రోడ్డు, ఆర్టీసీ డిపో రోడ్డు, చెప్పుల బజారు. ఒవీ రోడ్డులో ఈ ఆక్రమణల తొలగింపు పూర్తయ్యింది. మిగిలిన ప్రాంతాల్లో శుక్రవారం కార్యక్రమం జరగనుంది.

చిరు వ్యాపారుల గగ్గోలు

ఈ ఆక్రమణల తొలగింపు ఎంత అవసరం ఉన్నప్పటికీ తాము ఉపాధి కోల్పోయామంటూ చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలే జీవనాధారంగా ఉండేవారు కొందరైతే వాటిని ఆక్రమించి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకునేవారు మరికొందరు. వారు చిరువ్యాపారులకు తోడై అధికారులు, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిపై తీవ్ర వత్తిడి తెచ్చినట్లు తెలిసింది. అయితే సమస్యను అధిగమించి ముందుకుపోతే ఫలితం ఉంటుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే, అధికారులు ధైర్యంగా ముందడుగు వేశారు ఫలితంగా రోడ్లు విశాలంగా మారుతున్నాయి. చిరువ్యాపారులకు ఇబ్బందిగా ఉన్నప్పటికీ పట్టణ అభివృద్ధి దృష్ట్యా తప్పని పరిస్థితి.



రోడ్డు వెంబడి ఉన్న బంకులను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

ఇదేసమయంలో చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోకుండా, వృత్తిపరమైన, ఇతర వ్యాపారపరమైన షాపుల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. ఈ విషయంపై బుధవారం ఆయన అమరావతిలో రోడ్లు, భవనాలు శాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు వారి సిబ్బందితోపాటు కొన్ని శాఖల ఉన్నతాధికారులతో చర్చలు ప్రారంభించారు. అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో ఉండగా రాగానే ఆయన్ను కలిసే ప్రయత్నంలో ఉన్నారు. కనిగిరిలో రోడ్లు భవనాలుశాఖ, అటవీశాఖ, రెవెన్యూశాఖల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఖాళీస్థలాలను వినియోగంలోకి తీసుకొని అక్కడ ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ షాపుల కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. అంతేకాక ఏబీఎం గ్రౌండ్‌లో మిగిలి ఉన్న స్థలంలో కూడా షాపుల ఏర్పాటు ద్వారా వీరికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. అవసరమైతే సీఎం వద్దకు వెళ్లి ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారుల విషయం చర్చించి వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అదేసమయంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణతో మాట్లాడి అభివృద్ధి పనులకు నిధుల రాబట్టే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిపారు.

ఈకేవైసీ దోపిడీ!

గ్యాస్ ఏజెన్సీల బలవంతపు అమ్మకాలు..!

ప్రక్రియ పూర్తిచేయాలంటే పైపు కొనాల్సిందే

కంపెనీ నిబంధనల పేరుతో నిర్వాకం

రూ.50 విలువ చేసే పైపునకు రూ.150 వసూలు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 3: ఈకేవైసీని కొన్ని గ్యాస్ ఏజెన్సీలు దోపిడీకి అవకాశంగా మార్చుకున్నాయి. కొన్నిచోట్ల డబ్బులు వసూలు చేస్తుండగా, కొందరు గ్యాస్‌పైపులను అధిక ధరకు అంటగడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మహిళల కోసం సీఎం చంద్రబాబునాయుడు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు ఇచ్చే దిశగా ముందుకు వెళుతున్నారు. అందులోభాగంగా గత వారంరోజులుగా గ్యాస్ కనెక్షన్ వినియోగదారులు వారికి సంబంధించిన డీలర్ వద్ద ఈకేవైసీ కోసం బారులు తీరుతున్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొందరు గ్యాస్ ఏజెన్సీలు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. నిబంధనల ప్రకారం గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు గ్యాస్‌పుస్తకంతోపాటు, ఆధార్ కార్డును సంబంధిత డీలర్లు ఉచిత గ్యాస్ సిలిండర్‌ల ఈకేవీసీకి సొంత నిబంధనలు అమలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి వినియోగదారుడు ఖచ్చితంగా గ్యాస్ స్టౌవ్‌కు ఉపయోగించే పైపును కొనాల్సిందే నంటూ ఆదేశిస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వినియోగదారుడుకి ఎప్పుడో గ్యాస్ కనెక్షన్ తీసుకున్నారు. మీ పైపు కాలపరిమితి తీరిపోయిందంటూ పేర్కొనడంతో అవాక్కవుతున్నారు. అయితే గ్యాస్ కనెక్షన్ పొందిన తర్వాత ఒక్కో వినియోగదారుడు తాను ఉపయోగిస్తున్న స్టౌవ్ పైపును కనీసం ఐదారుసార్లు మార్చుకున్నామని చెప్పినా, అదేమి కుదరదు. కంప్యూటర్‌లో చూపిస్తుందంటూ ఆదేశించడం కొసమెరుపు. ఒకొక్కరి నుంచి రూ. 150 వసూలు చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

రూ.150 వసూలు చేస్తున్న డీలర్లు

జిల్లాలో 49కి పైగా ఏజెన్సీలు ఉన్నాయి. వాటన్నిటి పరిధిలో సుమారు 6లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నారు. అయితే పేదలకు వంటగ్యాస్ ఆర్థిక భారంగా ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కో ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇచ్చేవిధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడంతోపాటు అమలుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అందులోభాగంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వినియోగదారుడికి ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే ప్రతి వినియోగదారుడు తన ఆధార్ నెంబర్‌తో ఈకేవైసీ చేయించాలని ఏజెన్సీలను ఆదేశించారు. అయితే ఇదేఅదునుగా భావించిన ఏజెన్సీలు కొన్నిచోట్ల రూ.50లెక్కన వసూలు చేస్తుండగా మరికొన్నిచోట్ల గ్యాస్ పైపులు అంటగడుతున్నారు. రూ.50 విలువ చేసే పైపును రూ.150లకు అమ్మకాలు చేపట్టారు. ఒక్కో పైపుపై అదనంగా రూ.100 వసూలు చేయడమే కాకుండా అవసరం ఉన్నా, లేకపోయినా ఖచ్చితంగా పైపు కొంటేనే ఈకేవైసీ చేస్తామని తెలపడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి ఈ తరహా దోపిడీ యథేచ్ఛగా జరుగుతుండగా, కొనకుంటే ఉచిత సిలిండర్ రాదేమోన్న భయంతో వినియోగదారులు అవసరం లేకున్నా, మౌనంగా డబ్బులు చెల్లించి, పైపులు తీసుకుంటున్నారు.

ఈకేవైసీకి సర్వర్ నిలిపివేత

గ్యాస్ కనెక్షన్‌కు ఉచితంగానే ఈకేవైసీ చేయాల్సి ఉండగా, గత వారం, పది రోజుల నుంచి ఏజెన్సీలు వినియోగదారుడు వద్ద నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. అవసరం ఉన్నా, లేకపోయినా పైపు కొనాల్సిందేనని ఒత్తిడి చేయడంతో విషయాన్ని పలువురు జిల్లా పౌరసరఫరాల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు వినియోగదారుడు వద్ద నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయకూడదని, పైపులైను అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో డీలర్లు బుధవారం నుంచి ఈకేవైసీ చేయడం నిలిపివేశారు. సర్వర్ రావడం లేదని, మరో పదిరోజుల వరకు రాదని తేల్చి చెప్పడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఈకేవైసీ కోసం బారులుదీరిన గ్యాస్ వినియోగదారులు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- కొద్దిపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి..
- వేలకు వేలు చెల్లించి అద్దె భవనాల్లో నిర్వహణ
- పట్టించుకోని అధికారులు





పర్చూరులోని పాత ఎంపీడీవో భవనం.. నిరుపయోగంగా గిరిజన గురుకుల వసతి గృహం.. అన్యాక్రాంతానికి సిద్ధంగా గ్రామ చావిడి

పర్చూరు, జూలై 3 : కొన్ని చోట్ల ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చే ప్రభుత్వ భవనాలు ఉన్నా వేలకువేలు వెచ్చించి అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. కొన్ని భవనాలు ఆలనా పాలన లేక నిరుపయోగంగా ఉండడం, మరికొన్ని అన్యాక్రాంతానికి గురవుతున్నా.. అవి మన పనికాదన్న చం దంగా అధికారులు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులోని ఒకనాటి ఎంపీడీవో కార్యాలయంతోపాటు, స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల వసతి గృహం నిరుపయోగంగానే ఉన్నాయి. లక్షల రూపాయల విలువ చేసే ఈభవనాలు కొద్దిపాటి మరమ్మతులు చేపట్టినా వినియోగంలోకి వచ్చేవే. ఇలాంటి భవనాలను సైతం అధికారులు గాలికి వదిలివేసి ఇవి మనవి కాదన్న రీతిలో అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అద్దె భవనాల్లో కార్యాలయాలు, వసతి గృహాలు

పర్చూరులోని రిజిస్ట్రార్ కార్యాలయం గత ఇరవై ఏళ్లకుపైగా అద్దె భవనంలో కొనసాగడం ఇందుకు నిదర్శనం. దీంతోపాటు, విద్యుత్‌శాఖ కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ కార్యాలయం, గిరిజన సాంఘిక సంక్షేమ వసతి గృహం, కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ తదితర కార్యాలయాలు నేటికీ వేలకు వేలు చెల్లించి అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. గిరిజన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనం పూర్తి స్థాయి వసతులు ఉన్నా ఆభవనాన్ని సైతం ఖాళీ చేసి నిరుపయోగంగా ఉంచి అరకొర వసతులతో ఉన్న అద్దె భవనంలో నిర్వహించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

గ్రామ చావిడి అన్యాక్రాంతం

పర్చూరులోని స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న లక్షల విలువ చేసే ఓనాటి గ్రామ చావిడి నిరుపయోగంగా ఉండి అన్యాక్రాంతానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామ నడిబొడ్డున ప్రధాన రహదారిలో ప్రభుత్వ భవనం ఉన్నా అధికారులు కన్నెత్తి చూడని పరిస్థితి. ఇలా లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భవనాలు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోక పోవటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న వీరమహిళలు

మహిళల ఆత్మగౌరవం కాపాడాలి

ఎమ్మెల్యే కొండయ్యకు వీరమహిళల విజ్ఞప్తి

చీరాల, జూలై 3 : మహిళల ఆత్మగౌరవం కాపాడలని జనసేన పార్టీ వీర మహిళలు పలువురు ఎమ్మెల్యే కొండయ్యను కోరారు. ఈపురుపాలెం యువతి హత్యాచారం ఘటనలో యుద్ధప్రాతిపదికన స్పందించిన తీరుపై వారు కొండయ్యను అభినందించారు. బుధవారం పలువురు వీరమహిళలు కొండయ్యను కలసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ మహిళల పట్ల విపరీతధోరణులతో ప్రవర్తించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వీరమహిళలు వీ భాగ్యలక్ష్మి, వై.నాగలక్ష్మి, కాళిక, శిరీష, ప్రియ, సౌజన్య ఉన్నారు.

భరతనాట్యంపై శిక్షణ

అద్దంకిటౌన్, జూలై 3 : స్పందన సేవా సమితి శ్రీ వేణుగోపాలస్వామి భరతనాట్య ఆధ్వర్యంలో భవానీ సెంటర్‌లోని బ్రహ్మంగారి గుడి వద్ద ప్రతి ఆదివారం ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భరతనాట్యం శిక్షణ తరగతులు జరుగుతాయని వీ ప్రమీలాదేవి తెలిపారు. పూర్తి వివరాలకు 7981937931 నెంబరును సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

సంతమాగులూరు, జూలై 3 : కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, మెరుగైన బోధన అందించాలని జీసీడీవో ఎం.చారులత తెలిపారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని కేజీబీవీని ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. భోజనం, వసతి సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. 6వ తరగతి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను అందజేశారు.

తీరంలో పర్యాటకుల రక్షణకు చర్యలు



వాడరేవు సముద్ర తీరంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

వాడరేవు(చీరాలటౌన్), జూలై 3 : వాడరేవు, రామాపురం సముద్రతీరంలో పర్యాటకుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఈపూరుపాలెం ఎస్ఐ మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఇటీవల సముద్రతీరంలో వరుస ఘటనల్లో పలువురు మృత్యువాత పడ్డారు. దీంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వాడరేవు, రామాపురం ప్రాంతాలలో పర్యాటకుల అనుమతులను నిలిపి వేశారు. ఈక్రమంలోనే పొట్టి సుబ్బయ్యపాలెం వరకు హెచ్చరిక జెండాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వచ్చే సోమవారానికి అన్ని జాగ్రత్తలు తీసుకుని అనుమతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయనవెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

శింగరకొండ హుండీ కానుకల లెక్కింపు

అద్దంకి, జూలై 3 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకల లెక్కింపు బుధవారం జరిగింది. 97 రోజులకుగాను హుండీల ద్వారా రూ.30,40,189, యూఎస్ డాలర్లు 12, దుబాయ్ దిరమ్‌లు 11 వచ్చినవి. హుండీల కానుకల లెక్కింపును దేవదాయశాఖ అధికారి శైలేంద్ర, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర పర్యవేక్షించారు.

ఘనంగా వార్షిక వేడుకలు



మార్టూరు, జూలై 3 : పడమర బజారున యూనియన్ బ్యాంక్ సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ మూడవ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత నిర్వాహకులు తగెడ్ల అంజనేయులు దంపతులు స్వామి వారిమెడలో పూలదండలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదట వినాయకుని విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం తరువాత అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆశ్రమ భవనానికి ఆర్థిక సాయం

మార్టూరు, జూలై 3 : నూతనంగా నిర్మిస్తున్న అమ్మ ఆశ్రమం భవన నిర్మాణానికి తుర్పుబజారున ఉన్న రైతు చల్లగుండ్ల రామారావు రూ.5వేల సాయాన్ని అందించారు. ఆ మొత్తాన్ని ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు ఆయన బుధవారం ఆశ్రమంలో అందచేశారు.

ఎంపీడీవో సేవలు మరువలేనివి : ఏలూరి



రాజశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, నాయకులు

చినగంజాం, జూలై 3 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి వరప్రసాద్ అని, ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో యాబీ వరప్రసాద్ సంతాప సభలో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. వరప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోదవీరయ్య, యార్లగడ్డ లక్ష్మి, టీ.జయరావు, చెరుకూరి రాఘవయ్య, అబ్దుల్‌కలాం అజాద్, ఆసోది సుబ్బారెడ్డి, నక్కల వీరరాఘవులు, బత్తుల శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరిబాబు, డి.ఏసునారాయణ, పీ.శ్రీనివాసరావు, నరసింహారావు, పీ.వెంకటేశ్వర్లు, కేశన బాలయ్య, జీ.వెంకటనారాయణ, నీలాయపాలెం, చింతగుంపల్లి గ్రామ సర్పంచ్‌లు తూమాటి శ్రీనివాసరావు, యార్లగడ్డ సత్యనారాయణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కట్టెబోయిన సుబ్బారావు పాల్గొన్నారు. చినగంజాం సర్పంచ్ ఆత్మారావు, తహసీల్దార్ జీవీస్ ఫణీంద్రబాబు, పలు శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాప సభలో పాల్గొన్నారు.

రాజశేఖర్ కుటుంబానికి భరోసా

చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తాటి రాజశేఖర్ దశ దిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం పాల్గొన్నారు. రాజశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఏలూరి ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో

చేతుల శుభ్రతపై అవగాహన

మార్టూరు, జూలై 3 : విద్యార్థులు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ వీ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని వలపర్ల గ్రామంలో నేతాజీ విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది చిన్నారులు డయారియా వ్యాధికి గురవుతుంటారని వారు ఈ వ్యాధికి గురికాకుండా ఉండాలంటే తీసుకోవలసిన జాగ్రత్తలను ఆమె విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా భోజనానికి ముందు చేతులను ఏవిధంగా శుభ్రం చేసుకోవాలనే విషయంపై ప్రదర్శన రూపంలో వివరించారు. బయట పదార్థాలను తీసుకోకూడదని, జంక్ ఫుడ్స్‌ను తినరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పరిశుద్ధం, మరియమ్మ, హెల్త్ సిబ్బంది, స్కూల్ డైరెక్టర్ సయ్యద్ కరిముల్లా పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

మార్టూరు, జూలై 3 : డెంగ్యూ నివారణ మాసోత్సవాల సందర్భంగా బుధవారం యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. యద్దనపూడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శ్రీహర్ష ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల ముందు నీటి తొట్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని, ఖాళీ కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూడాలన్నారు. వాటిద్వారా రోగాలు, దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో టీవీఎస్ ప్రసాద్, ఎస్‌యూవో శేషగిరిరావు, సూపర్ వైజర్లు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



వస్త్రాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

దివ్యాంగులకు వస్త్రాల బహూకరణ

వేటపాలెం(చీరాల), జూలై 3 : మార్పు సంస్థ ఆధ్వర్యంలో వేటపాలెం మండలంలోని లెప్రసీ, సర్వోదయ, అక్కాయపాలెం, సిలోన్ కాలనీల్లోని పేద మహిళలకు, దివ్యాంగులు, లెప్రసీ మహిళలకు మార్పు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 180 మందికి నూతన వస్త్రాల బహూకరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సేవా సంస్థ ప్రతినిధులు మార్పు గ్రెగోరి మాట్లాడుతూ నిరుపేదలకు సాయం అందించమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. లెప్రసీ కాలనీ వారికి గతంలో మెడికల్ క్యాంపులు నిర్వహించామని, విపత్తు సంభవించినప్పుడు నిత్యావసర వస్తువులను అందజేశామని చెప్పారు. విద్యకు సంబంధించి అనేక నిరుపేద విద్యార్థులకు చేయూత నందించామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవ ఫాదర్ మార్పు నరేష్ (జర్మనీ), ఫాదర్ సీఏ లాజర్, రెవ ఫాదర్ కరుణాకర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ మార్పు విన్సెంట్ పాల్, బాపట్ల రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు చేగూడి సురేష్, జోతుల ప్రకాష్ పాల్గొన్నారు.

చీరాల ఏడీఏగా నాగరాజు బాధ్యతలు



చీరాలటౌన్, జూలై 3 : చీరాల వ్యవసాయ సహాయ సంచాలకులుగా కట్టెబోయిన నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎఫ్రాయిమ్ పూర్వపు స్థానమైన స్థానమైన ఒంగోలుకు బదిలీ అయ్యారు. ఈక్రమంలో చినగంజాం మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. దీంతో పలువురు కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు.

మరమ్మతులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, జూలై 3 : అద్దంకి పట్టణంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌ల ఏర్పాటు తదితర పనులు జరుగుతున్నందున ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. గురువారం చినగానుగపాలెం ప్రాంతంలో విద్యుత్ లైన్ల మర్మతుల దృష్టా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

మెకానిక్ డే ర్యాలీ



సమావేశమైన టూ వీలర్ మెకానిక్‌లు

అద్దంకి, జూలై 3 : మెకానిక్ డే సందర్భంగా అద్దంకి పట్టణ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. గాంధీ, అంబేడ్కర్ వి గ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద్, హనుమంత్, మహబూబ్, హకీమ్, బషీర్, శేఖర్, బుజ్జి, రవి, రామాంజీ, శ్రీను, నాగూర్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

చీరాల టౌన్, జూలై 3 : ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోక్సో కేసు నమోదైంది. 17ఏళ్ల బాలికపై మేజర్ యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణతో నాణ్యమైన బోధన



మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్రామయ్య

పర్చూరు, జూలై 3 : బోధనా సామర్థ్యాల మెరుగునకు శిక్షణ తరగతులు దోహదపడతాయని ఎంఈవో పి.వెంకట్రామయ్య అన్నారు. పర్చూరులోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం కోర్స్ కోర్డినేటర్ వీరయ్య పరిశీలించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా పాఠ్య బోధన చేసేందుకు ప్రతి ఉపాధ్యాయునికి శిక్షణ అవసరం అన్నారు. నేర్చుకున్న విషయాలను తరగతి గదిలో వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన చేపట్టిన కార్మికులు

చీరాలటౌన్, జూలై 3 : మున్సిపల్ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. ఈక్రమంలోనే బుధవారం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణకు ఉపయోగించే తోపుడు బండ్ల మరమ్మతులకు గురైనట్లు వివరించారు. చీపుర్లు, గ్లౌజులు కూడా అందించకుండా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపించారు. కార్మికులు స్వయంగా కొనుగోలు చేసి విధులు నిర్వహిస్తున్నా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు చెత్త, మురుగుతో పోరాడాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని, దీనిపై ఎమ్మెల్యే విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో అచ్యుతుని బాబూరావు, కోటి దాసు, కొండయ్య, రాజేష్, కార్మికులు పాల్గొన్నారు.







రామతీర్థం పురవీధుల్లో భక్తుల నడుమ సాగుతున్న రథం

హరహర మహాదేవ..!

- వేడుకగా రామలింగేశ్వరుడి రథోత్సవం
- శివనామ స్మరణతో మార్మోగిన రామతీర్థం
- నేడు ఆదిదంపతుల కల్యాణం

విడవలూరు, జూలై 3 : 'హరహర మహాదేవ శంభోశంకర.. శంభో శివ శంభో..' అంటూ భక్తుల నామస్మరణల నడుమ శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామివారు రథంపై తిరుగుతూ కటాక్షించారు. రామతీర్థంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆదిదంపతుల రథోత్సవ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామం కిక్కిరిసి పోయింది. తొలుత ఆలయ అర్చకులు శివపార్వతులకు ప్రత్యేక పూజల అనంతరం రథ వాస్తుహోమాలు, ప్రధాంగ వళి, రథశుద్ధి, రథదేవతా రాధన, రథబలి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మానవుని ఆత్మలో పరమాత్ముడు నిలిచి ఉండాలనే సూచికగా అత్యంత శోభాయమానంగా అలంకరించిన జంగమాలయం (రథం)పై స్వామిఅమ్మవార్లు ఆశీనులై భక్తుల వద్దకు తరలివచ్చారు. ఇన్‌చార్జి తహసీల్దారు భానుప్రకాష్, కొడవలూరు సీఐ సుబ్బారావు, ఈవో రామకృష్ణ, శంభుని కాపులు, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, కోడిమేర్ల శేషయ్య, కుడుముల మల్లికార్జున, ఎస్‌ఐ రాజులు, వీఆర్వో నరసయ్య తదితరులు రథాన్ని లాగి ప్రారంభించారు. మేళతాళాలు, తీన్‌మార్, తెనాలి బ్యాండ్ నడుమ భక్తుల శివనామస్మరణలతో రథం రామతీర్థం, పాతూరు పురవీధుల్లో సాగింది. వీధుల్లో భక్తులు ముగ్గులు వేసి, టెంకాయలు కొట్టి హారతులు పట్టారు. సాయంత్రం శంభుని కాపుల ఆధ్వర్యంలో స్వామి వారికి పూలంగి సేవ జరిగింది.

● ఆకట్టుకున్న కళాకృతులు

శంభుని కాపులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, ఉప్పు, పండ్లతో కూడిన దేవుని కళాకృతులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిమ్మ, యాపిల్, జామ, ద్రాక్ష, ఇలా వివిధ రకాలు పండ్లతో దేవుని ప్రతిమలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలూ భక్తులను అలరించాయి. కాగా, గురువారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరగనుంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదిదంపతులకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఆయన పేరుకే చిరుద్యోగి. మార్కెటింగ్ శాఖలో ఒక జూనియర్ అసిస్టెంట్ స్థాయి కలిగిన ప్రభుత్వ ఎంప్లాయి. కానీ చేసేవన్నీ పెద్ద పనులే. వైసీపీ హయాంలో ఓ మాజీ మంత్రికి వ్యక్తిగత సహాయకుడిగా వ్యవహరించిన ఆయన సాగించిన దందాలు అన్నీ ఇన్నీ కావు. సర్వేపల్లి కాలువ వెంబడి ఉన్న ఆక్రమణదారుల నుంచి వసూలు మొదలు క్వార్ట్జ్ లీజుదారుల వద్ద కప్పం వసూలు చేసే వరకూ అన్నీ తానై వ్యవహరించారు. నెల్లూరులోని మూలాపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా రూ.కోట్లు విలువైన ఓ కల్యాణ మండపాన్నే నిర్మిస్తున్నారంటేనే ఆ ఉద్యోగి స్థాయి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు సెలవులు పెట్టి మరీ స్వామిభక్తిని చాటుకుంటున్న ఆయన వ్యవహారంపై రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ఆరా తీశారు. సెలవులు ముగిసినా విధుల్లో చేరకపోవడంపై సదరు ఉద్యోగికి మెమో జారీ చేశారు.

సేవలు 'వ్యక్తిగత'ం చేసేవి అనంతం!


వివాదాస్పదంగా ఓ మాజీ మంత్రి పీఏ తీరు

- 'కోడ్'లో సరెండర్ చేసినా వీడని స్వామిభక్తి
- తప్పుడు పత్రాలతో మెడికల్ లీవ్
- ఆపై మాజీ మంత్రి కోసం ఎన్నికల ప్రచారం
- నాడు పట్టించుకోని అధికారులు.. నేడు చర్యలకు సిద్ధం
- నోటీసులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ

నెల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో ఓ మాజీ ప్రజాప్రతినిధికి ఆర్థిక వ్యవహారాల్లో అన్నీ తానై వ్యవహరించిన మార్కెటింగ్ శాఖలోని ఉద్యోగి ఎన్నికల సమయంలోనూ స్వామి భక్తిని వీడలేదు. కోడ్ అమల్లోకి రాగానే ప్రజాప్రతి నిధుల వద్దనున్న ప్రభుత్వ ఉద్యోగులను సరెండర్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖలో రిపోర్టు చేసుకున్న సదరు ఉద్యోగి ఆ వెంటనే మెడికల్ లీవ్ అంటూ సెలవులో వెళ్లిపోయారు. సాధారణంగా మెడికల్ లీవ్‌ను నెల రోజులు మంజూరు చేస్తారు. కానీ ఈ ఉద్యోగి దాదాపు మూడు నెలలకుపైగా విధుల్లోకి రాలేదు. మరోవైపు మెడికల్ లీవ్ మంజూరు చేయకుండానే సదరు ఉద్యోగి సెలవుల్లోకి వెళ్లిపోవడం గమనార్హం. సదరు ఉద్యోగి విధుల్లో ఉన్నట్లే భావించిన కలెక్టరేట్ సిబ్బంది ఎన్నికల విధులు అప్పగించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని కూడా సదరు ఉద్యోగి తీసుకున్నారు. కానీ ఆ తర్వాత ఆయనకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వడం గమనార్హం.

● స్వామిభక్తి చాటుకున్న ఉద్యోగి

మెడికల్ లీవ్ పెట్టగానే దానిని నిబంధనల ప్రకారం మెడికల్ బోర్డుకు రెఫర్ చేస్తారు. డాక్టర్ల బృందం సదరు డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుంది. కానీ ఈ ఉద్యోగి విషయంలో అలా జరగలేదు. ఇంతవరకూ మెడికల్ బోర్డు నుంచి ఎటువంటి క్లియరెన్స్ రాలేదు. అయితే ఈ ఉద్యోగి మెడికల్ లీవ్ పేరుతో రాజకీయ ప్రచారంలో పాల్గొన్నారని చెప్పుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా గతంలో సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఎన్నికలు ముగిశాకైనా సదరు ఉద్యోగిలో మార్పు వచ్చిందా.. అంటే అదీనూ లేదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించి విధుల్లో చేరిన ఆయన మళ్లీ క్యాజువల్ లీవ్ పేరుతో సెలవుపై వెళ్లారు.



● మంత్రి నారాయణ ఆరా

క్యాజువల్ లీవ్ ముగిసినా విధుల్లోకి చేరలేదు. తాను పనిచేసిన మాజీ ప్రతినిధి కార్యాలయంలో కూర్చొని మళ్లీ రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారని పలువురు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన సదరు ఉద్యోగి తీరుపై ఆరా తీయగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఉద్యోగికి ఆపరేషన్ అవసరమంటూ మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చింది ఆ మాజీ మంత్రి తమ్ముడేనని తేలినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు ఉద్యోగిపై నిబంధనల ప్రకారం చర్యలకు మార్కెటింగ్ శాఖ అధికారులు కదిలారు. సెలవు ముగిసినా విధుల్లోకి చేరకపోవడంతో మెమో కూడా జారీ చేశారు. అలానే మెడికల్ బోర్డు నుంచి కూడా ఎగ్జామినేషన్ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సదరు ఉద్యోగిని స్క్రీనింగ్ చేస్తే ఎటువంటి ఆపరేషన్ చేయించుకున్నారో అర్థమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగికి మెమో ఇచ్చాం

మా శాఖలో పని చేస్తున్న ఉద్యోగి మెడికల్ లీవ్ పెట్టారు. దీనిని మెడికల్ బోర్డుకు పంపాం. ఇంకా ఎటువంటి క్లియరెన్స్ రాలేదు. మెడికల్ లీవ్ పత్రాలు తప్పుడువని తేలితే సదరు ఉద్యోగిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. మెడికల్ లీవ్ ముగిశాక మళ్లీ విధుల్లోకి వచ్చి సీఎల్ పెట్టి వెళ్లారు. గడువు ముగిసినా మళ్లీ విధుల్లోకి రాకపోవడంతో మెమో జారీ చేశాం.

- నవీన్, నెల్లూరు ఏఎంసీ కార్యదర్శి

మాజీ మంత్రి పూర్వ పీఏపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైం): మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పీఏగా పనిచేసిన అప్సర్‌పై పలువురు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరులోని కూరగాయల మార్కెట్‌లో దుకాణం ఇప్పిస్తానని మూలాపేటకు చెందిన జెండా గోవర్ధన్, వేణుగోపాల్, శంకర్‌రావు, శరత్‌కుమార్ వద్ద అప్సర్ రూ.4 లక్షలు తీసుకున్నారు. అయితే వారికి దుకాణం ఇప్పించకపోగా సమాధానం చెప్పలేదు. బాధితులు పలుమార్లు అప్సర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో వారు బుధవారం చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నబజారు పోలీసులు వివరణ ఇచ్చేందుకు స్పందించలేదు. వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ అంశాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు, ప్రస్తుతం బాధితులు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

సమస్యలు అనేకం..

పరిష్కరిస్తేనే ఆనందం!

- వైసీపీ పాలనలో పడకేసిన ప్రగతి
- ఐదేళ్లలో పెరిగిపోయిన భూ సమస్యలు
- బలవంతంగా పేదల అసైన్డ్ భూముల దోపిడీ
- భూసేకరణ జరగక ప్రధాన ప్రాజెక్టులకు బ్రేక్
- కలగానే మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- నేడు నూతన కలెక్టర్ ఆనంద్ బాధ్యతల స్వీకరణ



బుధవారం రాత్రి నెల్లూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న నూతన కలెక్టర్ ఓ ఆనంద్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో మలోల

నెల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు భూ సమస్యలు.. మరోవైపు అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు.. కదలనంటున్న ఇళ్ల నిర్మాణాలు.. ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన ఫైళ్లు.. భూసేకరణ జరగక ముందుకు కదలని కీలకమైన ప్రాజెక్టులు... ఇలా జిల్లా అనేక సమస్యలతో సతమతమవుతోంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు. ఆ పార్టీ నేతల దోపిడీని తట్టుకోలేకపోయారు. తమ సమస్యలపై నోరు విప్పలేక లోలోన కుమిలిపోయారు. తమకు జరిగిన అన్యాయంపై ఎన్నికల్లో ఓటుతో గట్టిగా సమాధానం చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. పాలనా సౌలభ్యం, ఇతరత్రా కారణాల దృష్ట్యా అధికారుల బదిలీలు వేగంగా జరిగిపోతున్నాయి. ప్రస్తుత కలెక్టర్ హరినారాయణన్ బదిలీ అవగా, ఆయన స్థానంలో విశాఖ నుంచి ఓ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన జిల్లా పాలనాధికారిగా గురువారం బాధ్యతలు చేపట్టబోతున్నారు. గూడూరు సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఆయనకు గత అనుభవాలు పాఠాలు నేర్పుతుండగా, అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వీటన్నిటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

● భూ సమస్యలతో సతమతం..

జిల్లాను భూ సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో లిటిగేషన్లు ఎక్కువైపోయాయి. అందులోనూ భూసర్వేను అస్తవ్యస్తంగా నిర్వహించడంతో సమస్యలు మరింత ముదిరిపోయాయి. భూములకు విలువ పెరగడంతో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. చివరకు పట్టా భూముల రికార్డులు కూడా మార్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రికార్డుల ట్యాంపరింగ్ మూలంగా దాదాపుగా ప్రతి మండలంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దాదాపు అరవై మంది వరకు తహసీల్దార్ స్థాయి నుంచి వీఆర్వో స్థాయి వరకు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినా కొందరు ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు. అదే సమయంలో గతేడాది జరిగిన అసైన్‌మెంట్ భూముల పంపిణీలో కూడా భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. అనర్హులకు ప్రభుత్వ భూములను పంచి పెట్టడమే కాకుండా అర్హుల నుంచి భూములను బలవంతంగా లాక్కున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయి. అసైన్‌మెంట్ భూముల పంపిణీ, ఇరవై సంవత్సరాలు నిండిన వారికి పట్టా హక్కులు ఇచ్చిన ప్రక్రియలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అవసరముంది.

● కదలని ప్రాజెక్టులు

జిల్లాలోని కీలకమైన ప్రాజెక్టులన్నీ పడకేశాయి. భూసేకరణ చేయడంలో వైఫల్యం కారణంగా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. సోమశిల హైలెవల్ కెనాల్, బండేపల్లి-డేగపూడి కెనాల్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ వంటి ప్రాజెక్టులు ఈ కోవలోకి వస్తాయి. భూసేకరణలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేకపోతున్నారు.

● ఇక పేదలకు సొంతింటి కల కల్లగానే మిగిలిపోయింది. ఐదేళ్ల పాటు ఇళ్ల నిర్మాణాల పేరుతో దోచుకుతిన్నారు తప్ప పేదలకు మాత్రం ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. రూ.వందల కోట్ల ప్రజాధనం ఈ హౌసింగ్ పథకంలో దుర్వినియోగమైంది. జిల్లాలోని లేఅవుట్లలో దాదాపు 90 వేల ఇళ్లను మంజూరు చేయగా పూర్తి చేసింది 22 వేలు మాత్రమే. నివాసానికి పనికిరాని విధంగా ఇళ్లు నిర్మించి వాటిని పూర్తి చేసినట్లు లెక్కలు చూపిస్తున్నారు. హౌసింగ్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపించడంతో పాటు పేదలకు ఇళ్లు నిర్మించాల్సి ఉంది.

● ఇరిగేషన్ శాఖ గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. కాలువల్లో పూడిక తీయకుండానే బిల్లులు తినేశారు. గడిచిన ఐదేళ్లలో రూ.వందల కోట్లతో కాలువల్లో పనులు చేసినట్లు రికార్డులు చూపిస్తున్నారు. కానీ సాగు ప్రారంభమయ్యాక మాత్రం నీరు అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇలా ప్రధానంగా పరిష్కరించాల్సిన సమస్యలన్నింటిపై నూతన కలెక్టర్ ఓ ఆనంద్ దృష్టి పెట్టాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు.

కడలిలో అలజడి



కావలి మండలం తుమ్మలపెంట తీరంలోని సముద్రంలో అలల ఉధృతికి పెద్ద రింగ్ వల కొట్టుకుపోయింది. తుమ్మలపెంటకు చెందిన కాటంగారి పోలయ్య, మరో 24 మంది మత్స్యకారుల భాగస్వామ్యంతో చేపల కోసం ఓ రింగ్ వలను సముద్రంలో వదిలారు. బుధవారం ఉదయం మత్స్యకారులకు సముద్రంలో వల కనిపించకపోవడంతో బోట్లలో ముమ్మరంగా గాలించారు. సుమారు 6 కి.మీ దూరంలోని కొత్తసత్రం తీరం వద్దకు కొట్టుకు వచ్చి ఇసుక మేటలో కూరుకుపోయి దెబ్బతిన్న వలను మత్స్యకారులు గుర్తించారు. అలల ఉధృతికి వల పూర్తిగా పనికిరాకుండా పోయిందని వారు వాపోయారు. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని గగ్గోలు పెడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తమను ఆదుకోవాలని గంగపుత్రులు వేడుకుంటున్నారు.

- కావలి రూరల్

త్రిసభ్య కమిటీలకు చెల్లుచీటీ

- జిల్లాలో 79 పీఏసీఎస్‌లు
- సొసైటీల్లో ఆఫీస్ ఇన్‌చార్జుల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లా సహకార అధికారులకు బాధ్యతలు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో త్రిసభ్య (త్రీమెన్) కమిటీలపై వేటు పడింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి స్థానంలో ఆఫీస్ ఇన్‌చార్జులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా సహకార అధికారులకు నియామకపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశాలతో తక్షణమే జిల్లా అధికారులు రంగంలోకి దిగి, అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీలకు చెక్ పడింది.

సంగం, జూలై 3 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 99 సహకార పరపతి సంఘాలు ఉండగా, విభజన జిల్లాలో 79 (సొసైటీ) ఉన్నాయి. గడిచిన ఐదేళ్లుగా సొసైటీలు త్రీమెన్ కమిటీల పాలనలోనే నడిచాయి. వైసీపీ ఈ సొసైటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడంతో పలు సొసైటీల్లో భారీగా అవకతవకలు జరిగాయి. అందుకు సంగం సొసైటీయే ఓ నిదర్శనం. ఓ రైతు లోకాయుక్తాలో కేసు వేయడంతో విషయం బహిర్గతమై సుమారు రూ.42 లక్షలు సొసైటీ సొమ్ము త్రీమెన్ కమిటీ నుంచి రికవరీ చేయడం జరిగింది. ఇదేవిధంగా జిల్లాలో చాలా సొసైటీల్లో అవకతవకలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల ఫలితాలు చూసిన తరువాత ఈ సంఘాలకు చెందిన త్రిసభ్య కమిటీలు రాజీనామా చేశాయి. రాజీనామా చేయని వారిపై టీడీపీ ప్రభుత్వం వేటు వేసింది. వాటి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జులు నియమితులయ్యారు. ఇప్పుడు ఏ సొసైటీల్లో ఏ మేరకు అవినీతి అక్రమాలు జరిగాయో బహిర్గతమవుతాయా!? లేదా అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

● వైసీపీలో ఇష్టారాజ్యం

వైసీపీ హయాంలో సహకార సంఘాలపై వైసీపీ నాయకుల పెత్తనం పెరిగింది. రైతులకు పరపతి తగ్గింది. ఎన్నికలు నిర్వహించకుండా ఐదేళ్లు గడిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జుల సిఫారసులతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వచ్చారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ సహకారం కొరవడి ధాన్యం కమీషన్ సొమ్ము కూడా ఇవ్వలేదు. జిల్లా సహకార బ్యాంకుల్లో కమీషన్‌ను డిపాజిట్ చేశారు. దానికి వడ్డీని సహకార సంఘాలకు అందిస్తూ వచ్చారు.



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

ఒక పర్యాయంలో రైతులకు ఇచ్చిన రవాణా చార్జీలు కూడా సొసైటీలకు విడుదల చేశారు. ఆ సొమ్మంతా రైతు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా వైసీపీ నేతలతో పాటు, త్రిసభ్య కమిటీ చైర్మన్‌లు సొంత అవసరాలకు వాడేసుకున్నారు.

● ఎన్నికలా? కమిటీలా?

వైసీపీ త్రిసభ్య కమిటీలను తక్షణమే రద్దు చేసేందుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రస్తుతం వెంటనే ఎన్నికలు జరిపించే అవకాశం లేకపోవడంతో డిసెంబరు 20వ తేదీ వరకు సుమారు ఆరు నెలల పాటు సొసైటీలకు ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. దాంతో అధికారికంగా త్రిసభ్య కమిటీలు రద్దయ్యాయి. భవిష్యత్తులో ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుందా!? లేదంటే కొన్ని రోజుల తరువాత మళ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తుందా అనే అంశం పై చర్చ నడుస్తోంది. మరోవైపు కూటమి శ్రేణులు కూడా తమకూ నామినేటెడ్ ద్వారా అవకాశం ఇవ్వాలని ఆశిస్తున్నారు. కొద్ది రోజులపాటైనా కమిటీలతోనే ముందుకు వెళ్లాలని అభిప్రాయంతో కూటమి శ్రేణులు ఉన్నాయి.

వరుణదేవా.. కరుణించవా !

గంపెడాశతో ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధపడుతున్న రైతన్నను వరుణుడు కటాక్షించడం లేదు. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో చినుకు జాడ లేకపోవడంతో నీటివనరులన్నీ ఇంకిపోయాయి. 965 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆత్మకూరు చెరువు ఇదిగో ఇలా చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. పైతట్టు ప్రాంతాల్లో వర్షం కురిస్తేనే కొండవాగు కాలువ, బొగ్గేరు ద్వారా ఈ చెరువుకు నీరు చేరుతుంది. అలాంటిది వానజాడే లేకపోవడంతో కాలువలతోపాటు చెరువూ ఎండిపోయింది. ఏరువాక పున్నమికి కూడా పొలంలోకి వెళ్లలేని పరిస్థితుల్లో రైతులు ఆకాశం వైపు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

- ఆత్మకూరు



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పోలేరమ్మకు వార్షిక వేడుకలు



పోలేరమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జూలై 3: మండలంలోని అనసూయనగర్‌లో ఉన్న పోలేరమ్మ ఆలయంలో బుధవారం వార్షిక వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించారు.అనంతరం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు.

సీతారామపురంలో పారిశుధ్య పనులు

సీతారామపురం. జూలై 3: సర్పంచి కే భాగ్యకుమారి ఆదేశాల మేరకు బుధవారం సీతారామపురంలోని కోటవీధి, కురవవీధి, పడమరవీధుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల ప్రజలు సీజనల్ వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా డయేరియా, మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నందున ప్రతిరోజూ పారిశుధ్య పనులు జరిగేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

వరుణదేవా.. కరుణ చూపవా ?

- తొలకరి వర్షాలకు అరకొరగా పదును
- నీరు లేక వెలవెలబోతున్న పెద్ద చెరువులు
- ఎండిన ఆత్మకూరు తటాకం

ఆత్మకూరు, జూలై 3: ఖరీఫ్‌పై ఎంతో ఆశతో సాగుకు సిద్ధపడుతున్న రైతన్నపై వరుణుడు కరుణ చూపడంలేదు. ఈసారి వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొనడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గతనెలలో ఆత్మకూరు నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. పదును వాన పడితేనే భూములు సాగుకు యోగ్యంగా ఉంటాయి. వాన కురవక రైతులు ఏరువాక పున్నమికి కూడా పొలాల వైపు వెళ్లలేదు.

● సాగు కాని పంటలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పంటలు సాగుకాలేదు.ఈ సీజన్‌లో తొలకరి వర్షాలు పడితే పెసర, సజ్జ, రాగి తదితర మెట్ట పైర్ల సాగుకు రైతులు సన్నద్ధమవుతారు. జూన్‌కు ముందు దుక్కులు దున్నేందుకు వర్షాలు సరిగా పడలేదు. పదును వర్షం పడితే దున్నుకున్న పొలాల్లో పంట సాగుకు సిద్ధమవుతారు.

● ఎండిన ఆత్మకూరు చెరువు

నియోజకవర్గంలో పెద్ద చెరువులుగా పేరొందిన ఆత్మకూరు, మహిమలూరు, వాసిలి, జమ్మవరం, అనుమసముద్రం తదితర చెరువుల్లో నీరు లేక చిన్నబోతున్నాయి. ఈ చెరువుల కింద ఉన్న వేలాది ఎకరాలు సాగుకు నోచుకోలేదు. ఆత్మకూరు చెరువు ఆయకట్టు కింద సుమారు 6500 ఎకరాల ఆయకట్టు ఉంది. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు పూర్తిగా నిండిన దాఖలాలు లేవు. ప్రస్తుతం చెరువుల్లో నీరు నిల్వ లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక మండలంలోని వాసిలి చెరువు కింద 2500పైగా ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు బొగ్గేరు నుంచి వచ్చే నీరే ఆధారం. ఆత్మకూరు చెరువు నిండి, మిగిలిన నీరు అలుగుకాలువ గుండా పారి ఈ చెరువు నిండాల్సి ఉంది. అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆత్మకూరు చెరువులోనే చుక్కనీరు లేకపోవడంతో వాసిలి చెరువు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ క్రమంలో వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.



అనంతసాగరం మండలంలో చుక్కనీరు లేని బొమ్మవరం చెరువు



మర్రిపాడు : ఎండిన పడమటినాయుడుపల్లి చెరువు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలు పెట్టండి

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 3: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రోటోకాల్ ప్రకారం పీఎం నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు పెట్టాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలిగిరికి వచ్చిన ఆయన ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు మండల విద్యావనరుల కేంద్రాల్లో ఫొటోలు లేకపోవడాన్ని గుర్తించి ప్రభుత్వాలు ఏర్పడి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇంకా ఎందుకు ఫొటోలు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ప్రజలకు రెవెన్యూ సేవలను సక్రమంగా అందించాలని తహసీల్దారు బాలకిషోర్‌కు, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో రంగసుబ్బరాయుడుకు సూచించారు. అనంతరం రోడ్డు విస్తరణలో సమాచారం ఇవ్వకుండా కూల్చిన భవనాలను సందర్శించారు. సమాచారం ఇవ్వకుండానే భవనాల కూల్చివేత అని జూన్ 30న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి నష్టపోయే యజమానులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కావలి ఆర్డీవో శీనానాయక్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఈ కార్యక్రమాల్లోటీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, వెంగపనాయుడు, వరప్రసాద్, గొల్లపూడి ప్రసాద్, కిలారి కొండపనాయుడు, మాదాల శ్రీనివాస్, లెక్కల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎంను సన్మానించిన కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, జూలై 3: మండలంలోని గండిపాళెం ప్రధాన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ గతనెల 30న పదవీ విరమణ చేసిన షేక్ జాఫర్‌సాహెబ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇక నుంచి ఆయన శేషజీవితం ఆనందంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ పాముల రమాదేవి, గ్రామస్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి రూరల్, జూలై 3: విద్యార్థుల్లో పఠన, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం మండలంలోని అప్పసముద్రం మెయిన్, చవటపల్లి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన పలు రిజిస్టర్లను పరిశీలించారు.

ఆత్మకూరు ఇన్‌చార్జి ఎంఈవోగా జ్యోతి



ఇన్‌చార్జి ఎంఈవో జ్యోతిని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, జూలై 3: ఎంఈవోగా ఎం జ్యోతి నియమితులయ్యారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందజేయాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా పాఠశాలలకు వర్క్ అసిస్టెంట్‌ను వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి, ఇతర నాయకులు ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, నరేంద్రరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరిలో మోస్తరు వర్షం



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

ఉదయగిరి రూరల్, జూలై 3: మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో మురుగు కాలువలు పొంగడం, రహదారులు చెత్తాచెదారంతో నిండిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పంటల సాగుకు ఎంతోమేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు. ఉద్యాన పంటలకూ ఈ వర్షం ఊరటనిచ్చింది. అలాగే దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో సైతం వర్షం కురిసింది.

చేపల అక్రమ వేటపై విచారణ

- పాలకవర్గ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు



మత్స్యకారులను విచారిస్తున్న విచారణాధికారి శ్రీనివాసులు

కలువాయి, జూలై 3 : స్థానిక చెరువులో చేపల అక్రమ వేటపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం మత్స్యశాఖ కావలి ఏడీ శ్రీనివాసులు మత్స్యకారులను విచారించారు. అనంతరం కలువాయి మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షుడు వజ్రాల శ్రీనివాసులు, మరి కొంతమంది మత్స్యకారుల వద్ద నుంచి ఆయన రాత పూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నారు. రెండేళ్లుగా మత్స్య సొసైటీ పాలకవర్గ సభ్యులు, కాపలాదారులు, మరి కొంతమంది కలసి చెరువులో చేపలను అక్రమంగా రాత్రివేళ పట్టించి అమ్ముకున్నారని మత్స్యకారులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని మత్స్యకారులు కోరారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా విచారణ అధికారి ఎస్.శ్రీనివాసులు పాలకవర్గ సభ్యులు బచ్చల బాలయ్య, ధనుం మధు, బచ్చల శేఖర్, వజ్రాల సుబ్బయ్య, ఈగ ఆదెయ్య, వడ్డిదారి సురేష్, కాలిచప్పిడి రత్నయ్య, సింగమల ఎల్లయ్య, బచ్చల చంద్రకాంత్‌తోపాటు వారికి సహకరించిన, చేపలు కొనుగోలు చేసి, కాపలాదారులపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

ఉలవపాడు, జూలై 3 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. బుధవారం భీమవరం గ్రామం సమీపంలో మన్నేరు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సంఘటనా స్థలంకు చేరుకొని ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లింగసముద్రం : మండలంలోని పెదవని శివారులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న అంగిరేకులపాడుకు చెందిన ట్రాక్టర్‌ను కందుకూరి ఎస్ఈబీ ఎస్సై దీప్తీ కరంత్, సిబ్బంది పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించగా స్థానిక ఎస్సై బాజీబాబుకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, జూలై 3 : ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల పెంపకానికి ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో బీ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 200 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యమన్నారు. ఆసక్తిగల వారు 1బీ, అడంగల్, పాసు పుస్తకం, సన్న, చిన్నకారు రైతు సర్టిఫికెట్, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు నకల కాపీలతో ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనంతసాగరంలో కల్తీ మద్యం ?



వైరల్ అవుతున్న మద్యం సీసా

అనంతసాగరంలో కల్తీ మద్యం అమ్ముతున్నట్లు మందు బాబులు ఆరోపిస్తున్నారు. ఫుల్ బాటిల్ మూత తొలగించి అందులో నుంచి కొంత మందు తీసి, అదే మోతాదులో నీళ్ల కలిపి విక్రయిస్తున్నారని వారంటున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు. కల్తీ మద్యం అమ్ముతున్నట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

- అనంతసాగరం

నేడు అడవి పేరంటాలమ్మకు నెల పొంగళ్లు

ఉదయగిరి, జూలై 3: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న అడవిపేరంటాలమ్మకు గురువారం నెల పొంగళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పులిగుండ్ల రవీంద్ర బుధవారం తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించాలని ఆయన కోరారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 3: దుత్తలూరులో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవోలు మస్తాన్‌వలి, వెంగయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

6న కుక్కలకు టీకాలు

వరికుంటపాడు, జూలై 3: ఈనెల 6న వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాటి యజమానులు పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాలను సంప్రదించి,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చినుకు పడితే వణుకే..

- భయం గుప్పెల్లో విద్యార్థులు



కూలేందుకు సిద్ధంగా భోజనశాల

ఉదయగిరి రూరల్ : మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాల భోజనశాల(డైనింగ్ హాల్ కమ్ కిచెన్) శిథిలావస్థకు చేరింది. దీంతో అది ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1988లో పాఠశాలతోపాటు భోజనశాలను నిర్మించారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరి, శ్లాబు పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటపడి ప్రమాదకరంగా ఉంది. పాఠశాలలో 370 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం భోజనశాలలో చేయడంతోపాటు సిబ్బంది వంటలు కూడా ఆ భవనంలోనే చేయాల్సి ఉంది. ఆ సమయంలో శ్లాబు పెచ్చులూడి పైనపడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భవనం ఉరుస్తుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ భవనంపై దృష్టిసారించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపారని ప్రిన్సిపాల్ పుష్పరాజ్ తెలిపారు. భవన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమయిందని, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



కృష్ణకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, జూలై 3: విద్యార్థి దశలో ఇష్టంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం తిప్ప జూనియర్ కళాశాల, విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బచ్చు వెంకట కృష్ణయ్య జ్ఞాపకార్థం బచ్చు అమరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకుడు బచ్చు కృష్ణకుమార్, సంధ్యలు నిర్మించిన అదనపు తరగతి గదులు, స్టేజిలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతు వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్నా స్వదేశం, పుట్టిన ఊరుపై మమకారంతో కృష్ణకుమార్ ఆయన సోదరి అమరా బచ్చు పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి గుడులు, బడులు నిర్మించడమే కాకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలో పదవ తరగతి పాసైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కళాశాల, పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, రవీంద్రనాథ్ ఠాగూరుల ఆధ్వర్యంలో జరిగిన నేను బడికి పోతా కార్యక్రమంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. దాత బచ్చు కృష్ణకుమార్‌ను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో కప్పరాళ్లతిప్ప జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటిసారి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డికి టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, తెలుగు తమ్ముళ్లు తిప్ప జాతీయ రహదారి వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, ప్రసన్న వేంకటేశ్వరస్వామి పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, నాయకులు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, చిలకపాటి వెంకటేశ్వర్లు, దొడ్ల అంజయ్య యాదవ్, యర్రం.వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవరాల చిన్నకొండయ్య ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్కూల్ బస్సు ప్రమాదం బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



విద్యార్థిని పరామర్శిస్తున్న ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, జూలై 3: స్కూల్ బస్సు ప్రమాదానికి గురికావడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులను బుధవారం ఆయన వారి నివాసాలకు, ఆసుపత్రులకు వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరగటం, బస్సు క్లీనర్ చనిపోవడం, విద్యార్థులకు తీవ్ర గాయాలవడం తెలుసుకుని చలించిపోయానన్నారు. గాయపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా తానే బాధ్యత తీసుకుని వైద్యం చేయిస్తానన్నారు. మృతి చెందిన క్లీనర్ కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను పరామర్శించి ధైర్యాన్ని కల్పించిన కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

3140 లీటర్ల డీజిల్ పట్టివేత



పట్టుబడిన ఆయిల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు

ఉలవపాడు, జూలై 3 : ఉలవపాడు జాతీయ రహదారిపై ఆయిల్ దందా చేస్తున్న అక్రమార్కులపై బుధవారం స్థానిక రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. తహసీల్దారు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది హైవే వెంట ఉన్న డీజిల్ షాపులపై తనిఖీలు చేపట్టారు. రాజుపాలెం ఎస్టీ కాలనీలో కట్టా చెంచురామయ్య ఇంటి వద్ద అక్రమంగా 2800 లీటర్ల డీజిల్, కలికివాయి కోటేశ్వరరావు 210 లీటర్లు, కోటు సురేంద్ర 130 లీటర్లు డీజిల్ నిల్వ చేసి ఉండగా పట్టుకున్నారు. అధికారుల దాడులు తెలుసుకున్న మరో 10 మందిపైగా అక్రమ ఆయిల్ నిర్వాహకులు సరుకును జాగ్రత్త పరిచి అధికారులకు పట్టుబడకుండా తప్పించుకున్నారు. ప్రస్తుతం పట్టుబడిన 3140 లీటర్ల డీజిల్‌ను చాగొల్లు హైవే పక్కన ఉన్న కేవీఆర్ పెట్రోల్ బంక్‌కు తరలించినట్లు తహసీల్దారు చెప్పారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, ఇన్‌చార్జ్ ఆర్ఐ బాలచంద్ర, వీఆర్వోలు పద్మజ, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సురేష్‌రెడ్డి, తదితరులు

కందుకూరు, జూలై 3: అరుదైన లివర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన చిన్నారి షేక్ అర్మాన్ వైద్యం కోసం స్థానిక వ్యాపారి సురేష్‌రెడ్డి రూ.25వేల, ఆయన చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది, మిత్రులు కలిసి మరో రూ.50 వేల ఆర్థికసహాయం బుధవారం అందించారు. అర్మాన్ తల్లిదండ్రులు ఆరీఫ్, ఆఫ్రిన్లు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉలవపాడు, జూలై 3 : ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌కు చెందిన రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. గత నెల 29న జరిగిన గొడవలో అంచుపోగు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో వెలిచర్ల షారోన్‌కుమార్‌పై కేసు నమోదు చేయగా, షారోన్‌కుమార్ భార్య వెలిచర్ల హెప్సిబా గర్భంతో ఉన్న తనపై దాడి చేసి కొట్టారన్న ఫిర్యాదు మేరకు అంచుపోగు వాసు, భాస్కర్, సురేష్, వెంకట్రావు, సునీల్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాల అందజేత



అధికారులకు చిత్రపటాలు అందచేస్తున్న నేతలు

ఉలవపాడు, జూలై 3 : ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, డీప్యూ టీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఎన్‌డీఏ కూటమి నాయకులు బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు వెళ్లి అధికారులకు అందచేశారు. కూటమి నాయకులు అయ్యప్ప, మాబాషా, అంజనేయులు, డాక్టర్ పవన్, డాక్టర్ కరీం, ప్రసాదు, సుబ్రహ్మణ్యం, గుప్తా, నాగేశ్వరరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఐఈఏ వార్షికోత్సవం

కందుకూరు, జూలై 3: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) 74వ వార్షికోత్సవ వేడుకలను స్థానిక ఎల్ఐసీ బ్రాంచిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ సీనియర్ బ్రాంచి మేనేజరు ఐవీఏ కాంతారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో, యునాని, ఆయుర్వేద వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టరు ఆర్వీఎస్ లక్ష్మీకుమారి, హోమియో వైద్యురాలు డాక్టరు పీ.రత్నావళి, యునాని వైద్యురాలు కేవీ పద్మజాకుమారిలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఐఈఏ ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్, కార్యదర్శి విష్ణువర్ధనరెడ్డి, సభ్యులు డీవీ రమణ, లక్ష్మీనారాయణ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కావలి రూరల్, జూలై 3: యువత ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని 1వ పట్టణ సీఐ రాజేష్ హెచ్చరించారు. కావలి పట్టణంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ట్రిబుల్ డ్రైవింగ్‌తో నడుపుతున్న 15 బైకులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల నడవడికలను గుర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 4 కళాశాలలపై నిఘా ఉంచామన్నారు. కొందరు యువకులు తమ కళాశాలలకు వెళ్లకుండా ఇతర కళాశాలల వద్దకు వెళ్లి విద్యార్థినుల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో కళాశాలల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు నిఘా ఉంచామన్నారు. ఎవరైనా ఆడపిల్లలను ఈవ్‌టీజింగ్ చేస్తూ తిరుగుతున్నట్లయితే ఫొటోలు తీసి పంపాలన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా విద్యార్థినులు కళాశాలకు వచ్చేటప్పుడు, కళాశాల నుంచి ఇళ్లకు వెళ్లేటప్పుడు గమనిస్తుండాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బిట్రగుంట, జూలై 3: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంటలోని బండ్లవారి కాలనీలో పేదలకు బుధవారం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని దుప్పట్లు, పండ్లు, బన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఆర్ యువ నేస్తం నిర్వాహకులు షేక్ సమీఉల్లా, సమీమిత్ర బృందం ఖలీల్‌బాషా, శ్రీధర్‌రావు, షాకీర్, సుజీత్, ముత్తహర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ ట్రైసైకిళ్లకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, జూలై 3: కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఆర్‌సీ, అలిమ్కో సంస్థల ద్వారా సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, చంక కర్రలు ఉచితంగా అందజేస్తున్నట్లు సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం కార్డు, యుడీఐడీ కార్డు, పాస్‌ఫొటోను ఈనెల 4వ తేదీ సాయంత్రంలోగా 9949334606 నెంబరుకు వాట్సాప్ చేయాలని ఆయన కోరారు. 60 ఏళ్లు పైబడిన వారికి సదరం కార్డుతో పనిలేకుండా వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, చంకకర్రలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. అవసరమైన వారు సంప్రదించాలని కోరారు.

నేడు సేవా కార్యక్రమాలు

కందుకూరు, జూలై 3: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం కందుకూరులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పామూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేసిన అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యాహ్నం కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం, పట్టణంలో అనాథలు, యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఐఎన్ఆర్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.